

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 209

శుక్రవారం 14-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | VIJAYAWADA | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మీ లలితా జ్యువెల్లరిలో..
మార్కెట్ లోనే అధిక ఆదాయం అందించే
2 నగల కొనుగోలు పథకాలు

11 నెలల
'నగలు కొనుగోలు పథకం'!

FLEXI YO FLEXI

బంగారం ధర
పెరిగినా, తగ్గినా
ఆదాయం మీకే!

ఏ నగ అయినా కానీ
100%
తరుగు లేదు
NO WASTAGE !

ఒక నెల
ఇన్‌స్టాల్‌మెంట్‌లో
50% బోనస్

చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000
రూ.2500 / రూ.5000 / రూ.10000



అడ్వాన్స్ నగల
బుకింగ్ స్కీమ్

ఖర్చు లేకుండా,
ముందుగా పాత నగలు
ఇచ్చి, కొత్త నగలు
తీసుకోవచ్చు!

100%
V.A. లేదు!

5 నుంచి 11 నెలలలోపు ఎప్పుడైనా
ఈ పథకాన్ని ముగించుకుని
లబ్ధి పొందొచ్చు!

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు
నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు
పట్టుకుంటాం.

పాత నగలతో మాత్రమే కాదు,
నగదు చెల్లించి కూడా
ఈ స్కీమ్‌లో చేరొచ్చు!



ఇండియాలోనే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం.

మరింత అందంగా మెరిసే స్వచ్ఛమైన వజ్రాభరణాలు !

మా ధరలతో చెక్ చేయండి!

లలితాలో మార్కెట్‌లో కంటే క్యారెట్‌కు అతి తక్కువ ధర. ఇతర షోరూం మాదిరిగా తరగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు. V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!

నాణ్యత సర్టిఫికెట్

షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను ఇవ్వడం లేదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అంతర్జాతీయస్థాయి నాణ్యత సర్టిఫికెట్ ఇస్తున్నాం.

కలర్ & క్లారిటీ

E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటీ వజ్రాభరణాలనే విక్రయిస్తున్నాం. G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను విక్రయించడం లేదు.

ఎక్స్‌ఛేంజ్ పాలసీ

వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్, నగలుగా అయితే 90%, నగదుగా 85% బైబ్యాక్.





99%
వెండి వస్తువులకు
తరుగు లేదు!



Lalithaa®
www.lalithaajewellery.com

బెంగళూరు : కమ్మనహళ్లి- హెన్నూర్ రోడ్ బనస్వాది రోడ్, 3వ బ్లాక్, 4వ మెయిన్‌రోడ్. ఫోన్: 080 - 25433611 / 12 / 13.
మల్లేశ్వరం - 45, RPPఆర్కేడ్, సంపిగెరోడ్. ఫోన్: 080 - 2356 8888 / 1188.
జయనగర్ - 29వ సి-క్రాస్ రోడ్, 4వ బ్లాక్ బస్టాప్ ఎదురుగా. ఫోన్: 080 - 2665 4411 / 4422 / 7733 / 7766.
మరతహళ్లి - 209, వర్తూర్ రోడ్, మరతహళ్లి బ్రిడ్జి,తులసి థియేటర్ సమీపం. ఫోన్: 080 - 25400824 / 825.
ఎలహంక - ఎంవీఎం ఔరం, బీబీ రోడ్, ఎలహంక పోలీసుస్టేషన్ పక్కన, ఆర్ఎంజెడ్ గెలేరియా మాల్ ఎదురుగా. ఫోన్: 080 - 29909169.
మంగళూరు : 4-6-73/1,2, కుషే సదన్, పీవీఎస్ సర్కిల్ సమీపం. కేఆర్ఆర్ రోడ్, ఫోన్: 0824 - 2497788 / 2244.
మైసూరు : 2929/1, ⌊19/1, బెంగళూరు నీలగిరి రోడ్, లష్కర్ మొహల్లా, సబర్బన్ బస్టాప్ సమీపంలో. ఫోన్: 0821-2442882 / 999.

Customer Care
90 99 999 916

BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 209

శుక్రవారం 14-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గుజరాత్ గెలిచె..

పంజాబ్ కింగ్స్‌కు రెండో ఓటమి.. రాణించిన గిల్, మోహిత్ శర్మ - 12లో



ఎగుమతుల్లో ఆరు శాతం వృద్ధి

2022-23లో 447 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు - 12లో



సరికొత్తగా భారత్: మోదీ

కేంద్రం తీసుకువస్తున్న విధానాలు, వ్యూహాలతో కొత్త భారత్ ఆవిష్కృతం దిశగా దేశం పరుగులు తీస్తోందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



మరీ ఇంత పెద్ద శిక్షా ?

కాంగ్రెస్ నేత రాహుల్ కేసులో నేర నిరూపణ విధానం సవ్యంగా లేదని ఆయన తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

వివరాలు 6లో ▸

బీబీసీపై ఈడీ కేసు

విదేశీ నిధుల్ని పొందిన సమయంలో ఫెమా నిబంధనల్ని ఉల్లంఘించిందంటూ బీబీసీ ఇండియాపై ఈడీ కేసు నమోదు చేసింది.

వివరాలు 6లో ▸



10 వేల కరోనా కేసులు

దేశవ్యాప్తంగా 24 గంటల వ్యవధిలో కొత్తగా 10,158 కరోనా కేసులు నమోదయ్యాయి. ఎనిమిది నెలల తర్వాత ఇదే అత్యధికం.

వివరాలు 6లో ▸

ఘటనా స్థలిలో మృతదేహాలు



యూపీలో పోలీసు ఎన్‌కౌంటర్

ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్, అతని సహాయకుడు గుల్హామ్ పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్ ఝాన్సీ పట్టణంలో గురువారం జరిగింది. ఘటనాస్థలిలో అత్యాధునిక విదేశీ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 6లో

టిడ్కో ఇళ్లపై విష ప్రచారం



తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు

- టిడ్కో ఇళ్ల పథకాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- ఒక్క ఇంటిని కూడా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయలేదు
- ఈ పథకాన్ని చిత్తశుద్ధితో పూర్తి చేస్తున్నది మన ప్రభుత్వమే
- రూ.21 వేల కోట్ల మేర లబ్ధిదారులకు మేలు చేస్తున్నాం
- వాస్తవాలను ప్రజలకు వివరించండి
- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత
- గత ఏడాది రూ.10,203 కోట్లు.. ఈ ఏడాది రూ.15,810 కోట్ల ఖర్చు
- ఇప్పటి వరకు 3.40 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- స్లాబ్ దశలో మరో 4,67,551 ఇళ్లు
- గృహ నిర్మాణ శాఖపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



సాక్షి, అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన టీడీపీ.. ప్రస్తుతం ఆ పథకంపై చేస్తున్న అసత్య, విష, దుష్ప్రచారం అంతా ఇంతా కాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తి చేసి, చక్కటి మౌలిక సదుపాయాలతో లబ్ధిదారులకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో టిడ్కో ఇళ్ల రూపంలో 2.62 లక్షల మంది పట్టణ ప్రాంత పేద, మధ్య తరగతి లబ్ధిదారులకు ఏకంగా రూ.21 వేల కోట్ల విలువైన లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న మేలును వివరిస్తూ ప్రజల ముందు వాస్తవాలు ఉంచాలన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన గృహ నిర్మాణ శాఖ, టిడ్కోపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన పనుల గురించి, వెచ్చించిన సొమ్ము గురించి విశదీకరించారు.

ఇళ్ల ఖర్చు చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే అధికం

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.10,203 కోట్లు ఖర్చు చేశామని గృహ నిర్మాణ శాఖ అధికారులు సీఎంకు తెలిపారు. ఈ లెక్కన రోజుకు రూ.28 కోట్ల మేర ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో రోజుకు రూ.43 కోట్ల చొప్పున రూ.15,810 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు కొన్ని చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే అధికమని తెలియజేశారు. కొన్ని

మిగతా 2వ పేజీలో ▶

బాబూ.. ఇదేం ఖర్మ

- టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనకు ప్రజల నుంచి స్పందన కరువు
- జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలతో స్వాగతం
- 52 నియోజక వర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జీలే లేరు.. మరో 38 చోట్ల మూడో స్థానానికే పరిమితం

- వివరాలు 3లో



గురువారం గుడివాడలో జనం లేక వెలవెలబోతున్న చంద్రబాబు సభ



బుధవారం మచిలీపట్నంలోనూ ఇదే పరిస్థితి

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే
- ఆర్ఐఎన్ఎల్‌ను బలోపేతం చేసేలా చర్యలు.. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసే ప్రక్రియపై దృష్టి
- గనుల సమస్యనూ పరిష్కరిస్తామని హామీ
- ఇలా చెప్పలేదంటూ సాయంత్రానికే మాట మార్చిన మంత్రి
- కార్మిక సంఘాల నేతల మండిపాటు



5లో



అమరావతిలో పేదల ఇళ్ల స్థలాల కేసు.. హైకోర్టుకే వెళ్లండి

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- రాజధాని పిటిషనర్‌కు చుక్కెదురు
- పిటిషన్ ఉపసంహరణకు అనుమతి

5లో

గుడివాడలో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై మాజీ ఎంపీ మాగంటి బాబు అనుచరుల దౌర్జన్యం

- అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వైపు దూసుకెళ్లిన వైనం
- ప్రతిఘటించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేస్తున్న మాగంటి బాబు అనుచరులు, టీడీపీ కార్యకర్తలు

గుడివాడ రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనలో టీడీపీ శ్రేణులు హల్‌చల్ చేశారు. గుడివాడ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఉన్న శరత్ థియేటర్ వద్ద టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. చంద్రబాబు పామర్రు నుండి గుడివాడ వస్తున్న నేపథ్యంలో గుడివాడ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో పాటు కొందరు టీడీపీ శ్రేణులు చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వెళుతూ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు రాగానే స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అప్పుడే కాన్వాయ్‌లో వస్తున్న మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అనుచరులు టీడీపీ గూండాలతో కలసి రోడ్డుపై బైక్‌లు, కార్లతో నానాహంగామా సృష్టించారు. పోలీసులు గొడవలు వద్దని వారించినా వినకుండా కార్యాలయం వైపు దూసుకొచ్చారు. అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుంకర శ్యామ్‌పై దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తమై అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. వారిపైనా దౌర్జన్యం చేసేందుకు దూసుకొచ్చారు.

సర్దిచెప్పి పంపించిన సీఐ

కాగా, బందోబస్తు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది టీడీపీ నేతలను అదుపు చేసి అక్కడ నుంచి వారిని కాన్వాయ్‌లో పంపించేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు సర్దిచెప్పారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయ ఇన్‌చార్జి కొంకితల ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు రాగానే అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారన్నారు. అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను గొడవలు వద్దని వారించామన్నారు. పోలీసుల మాట లెక్క చేయకుండా కార్యాలయం వద్దకు మాగంటి బాబు అనుచరులు దూసుకువచ్చే ప్రయత్నం చేశారన్నారు. చట్టంపై గౌరవంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మౌనంగా ఉన్నారన్నారు. తమ నాయకుడు ఎమ్మెల్యే కొడాలి నానిపై అనుచిత వ్యాఖ్యలు చేసినా అవాకులు, చవాకులు పేలినా సహించేది లేదని, తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

కాకినాడ జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవనం

- నిర్మిస్తున్న రంగరాయ వైద్యకళాశాల పూర్వ విద్యార్థులు
- వైద్యశాఖతో ఎంవోయూ



ఒప్పంద పత్రాలను చూపుతున్న డీఎంఈ డాక్టర్ వినోద్, ఆర్-ఎమ్‌కానా వైస్ చైర్మన్ డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్

సాక్షి, అమరావతి: కాకినాడ జీజీహెచ్‌లో రూ.42 కోట్లతో మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) బ్లాక్ నిర్మించడంతో పాటు వైద్యపరికరాల్ని ఏర్పాటు చేసేందుకు రంగరాయ వైద్యకళాశాల అల్యుమ్ని ఆఫ్ నార్త్ అమెరికా (ఆర్-ఎమ్‌కానా) ప్రతినిధులు ముందుకొచ్చారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్, ఆర్-ఎమ్‌కానా ప్రతినిధులు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా వైద్యరంగంలో సీఎం జగన్ ఆస్పత్రుల బలోపేతం, కొత్త వైద్యకళాశాలలు నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న తీరుకు స్ఫూర్తిగా తాము ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి ముందుకొచ్చామని ఆర్-ఎంకానా ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే రూ.20 కోట్లతో కాకినాడ జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవనం గ్రౌండ్, మొదటి ఫ్లోర్‌లను నిర్మించామని, మిగిలిన భవన నిర్మాణం పూర్తిచేయడంతో పాటు అన్ని వసతులతో 18 నెలల్లో ఎంసీహెచ్ బ్లాక్‌ను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. అధునాతన సౌకర్యాలతో కూడిన మాతాశిశు సంరక్షణ సేవలు, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఈ బ్లాక్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 12 లేబర్ టేబుళ్లు , 40 పడకల యాంటీనేటల్ వార్డు, రెండు ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు, మొదటి ఫ్లోర్‌లో 75 పడకల పోస్ట్‌నేటల్ వార్డు, రెండో ఫ్లోర్‌లో రెండు అధునాతన ఎలక్టివ్ ఆపరేషన్ థియేటర్లు, మూడు, నాలుగు ఫ్లోర్‌లలో నియోనేటల్ వార్డు, వెంటిలేటర్, ఫొటోథెరపీ వంటి సౌకర్యాలు సమకూరతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్-ఎంకానా వ్యవస్థాపకులు, రంగరాయ వైద్యకళాశాల రెండోబ్యాచ్‌కు చెందిన డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, డాక్టర్ పాలడుగు రాంబాబు, డాక్టర్ ఎస్.వి.లక్ష్మీనారాయణ, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత పాల్గొన్నారు. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి ముందుకొచ్చిన ఆర్-ఎంకానా ప్రతినిధులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, కృష్ణబాబు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలం, సాగర్‌లలో నిల్వ ఉన్న నీళ్లన్నీ మావే..

- కోటా కంటే 90.36 టీఎంసీలు అధికంగా వాడుకున్న తెలంగాణ
- సాగర్ కుడి కాలువకు 6, ఎడమ కాలువకు ఒక టీఎంసీ విడుదల చేయండి
- కృష్ణా బోర్డుకు రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖ



సాక్షి, అమరావతి: కృష్ణా జలాల్లో అంగీకరించిన వాటా కంటే తెలంగాణ సర్కార్ అధికంగా 90.36 టీఎంసీలు వాడుకుందని.. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లలో నిల్వ ఉన్న నీళ్లన్నీ తమకే చెందుతాయని కృష్ణా బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. తాగునీటి అవసరాలు, ఉద్యాన పంటలు, సాగు చేసిన పంటలను రక్షించుకోవడం కోసం సాగర్ కుడి కాలువకు 6, ఎడమ కాలువకు 1 టీఎంసీని విడుదల చేస్తూ తక్షణమే ఉత్తర్వులివ్వాలని కోరింది. ఈ మేరకు గురువారం కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖ రాశారు. ఆ లేఖలో ప్రధానాంశాలివీ..

☛ దిగువ కృష్ణా బేసిన్‌లో ప్రస్తుత నీటి సంవత్సరంలో లభ్యతగా ఉన్న జలాలు 961.07 టీఎంసీలు. ఇందులో అంగీకరించిన మేరకు ఏపీ వాటా 634.30 టీఎంసీలు(66 శాతం) తెలంగాణ వాటా 326.77 టీఎంసీలు(34 శాతం).

☛ ఈ నెల 12 వరకూ ఏపీ 470.63 టీఎంసీలు, తెలంగాణ 417.13 టీఎంసీలు వాడుకున్నాయి. వీటిని పరిశీలిస్తే.. ఏపీ కోటా కింద ఇంకా 163.67 టీఎంసీలు మిగిలాయి. తెలంగాణ సర్కార్ కోటా కంటే ఎక్కువగా 90.36 టీఎంసీలు అధికంగా వాడుకుంది. ఈ నెల 12 నాటికి శ్రీశైలం, సాగర్‌లలో నిల్వ ఉన్న 126.01 టీఎంసీలన్నీ ఏపీవే. ఆ రెండు ప్రాజెక్టుల నుంచి నీటిని వాడుకోకుండా తెలంగాణను కట్టడి చేసి, దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులు పరిరక్షించండి.

'ఏయూ'పై గవర్నర్ సమీక్ష

సాక్షి, అమరావతి/ఏయూ(విశాఖతూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం అకడమిక్, పరిపాలన వ్యవహారాలపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నెలకొల్పిన ఇంక్యుబేషన్ కేంద్రాలు, పరిశ్రమల సహకారంతో ఏర్పాటైన అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ల్యాబ్, ప్లేస్మెంట్స్‌తోపాటు ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఫుడ్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ వంటి నూతన కోర్సులను ప్రారంభించడం తదితర వివరాలను గవర్నర్‌కు వీసీ తెలియజేశారు. ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు 17కు వాయిదా

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా 2018లో ఆయనపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసును ఎన్ఐఏ న్యాయస్థానం ఈనెల 17కు వాయిదా వేసింది. ఈ కేసులో బాధితుడినైన తన వాంగ్మూలాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నమోదు చేసేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో కుట్ర కోణాన్ని ఎన్ఐఏ తన దర్యాప్తులో విస్మరించిందని కూడా ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. తనపై హత్యాయత్నం వెనుక ఉండే రాజకీయ కుట్ర కోణాలపై సందేహాలను వ్యక్తంచేస్తూ ఆ దిశగా దర్యాప్తు చేసేలా ఎన్ఐఏను ఆదేశించాలని కోరుతూ మరో పిటిషన్‌ను కూడా ఆయన దాఖలు చేశారు. వీటిపై డిఫెన్స్ న్యాయవాది కౌంటర్ పిటిషన్‌ను ఎన్ఐఏ న్యాయస్థానంలో గురువారం దాఖలు చేశారు. ఎన్ఐఏ తరఫు న్యాయవాది కూడా కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలతో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తరఫు న్యాయవాది న్యాయస్థానాన్ని గడువు కోరారు. ఎన్ఐఏ, డిఫెన్స్ న్యాయవాదుల పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసేందుకు సీఎం తరఫు న్యాయవాదికి గడువిస్తూ కోర్టు ఈనెల 17కు కేసును వాయిదా వేసింది.

పాలమూరు–రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి

- కృష్ణాడెల్టాకు మళ్లించే గోదావరి జలాల్లో 45 టీఎంసీలపై ఉభయ రాష్ట్రాలకు హక్కు
- ఆ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య జరగని ఒప్పందం
- ఆ నీటి పంపిణీ అంశాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లిన ఏపీ ప్రభుత్వం
- ఈ దశలో డీపీఆర్‌ను మదింపు చేయలేం.. ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేం
- తెలంగాణ సర్కార్‌కు స్పష్టం చేసిన సీడబ్ల్యూసీ
- ఈ మేరకు నాగర్‌కర్నూల్ ప్రాజెక్ట్స్ సీఈకి సీడబ్ల్యూసీ డైరెక్టర్ లేఖ



సాక్షి, అమరావతి: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను మదింపు చేయలేమని, అనుమతి ఇవ్వలేమని తెలంగాణ సర్కార్‌కు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిచెప్పింది. డీపీఆర్‌ను తెలంగాణ సర్కార్‌కు వెనక్కి పంపింది. ఈ మేరకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా (ప్రాజెక్ట్స్) సీఈకి సీడబ్ల్యూసీ డైరెక్టర్ నిత్యానంద ముఖర్జీ లేఖ రాశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలను తరలించేందుకు తెలంగాణ సర్కార్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టింది. చిన్ననీటిపారుదల విభాగంలో మిగులుగా ఉన్న 45 టీఎంసీలు, కృష్ణాడెల్టాకు మళ్లించే గోదావరి జలాలకుగాను కృష్ణాజలాల్లో అదనంగా 45 టీఎంసీల వాటా తమకే దక్కుతుందని ఏకపక్షంగా తీర్మానించుకుని 90 టీఎంసీలను ఆ ఎత్తిపోతలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీడబ్ల్యూసీకి డీపీఆర్ సమర్పించింది. డీపీఆర్‌ను పరిశీలించిన సీడబ్ల్యూసీ.. నీటి కేటాయింపులపై అభ్యంతరాలను లేవనెత్తింది. కృష్ణాడెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకుగాను నాగార్జునసాగర్‌కు ఎగువన కృష్ణానదిలో 45 టీఎంసీలను అదనంగా వాడుకునే వెసులుబాటును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిందని సీడబ్ల్యూసీ తెలిపింది. విభజన నేపథ్యంలో ఆ 45 టీఎంసీలపై రెండు రాష్ట్రాలకు హక్కు ఉంటుందని పేర్కొంది. ఈ జలాల పంపిణీ అంశాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) దృష్టికి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లిందని గుర్తుచేసింది. ఆ 45 టీఎంసీల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతోందని తెలిపింది. ఇక ఆ 45 టీఎంసీల వినియోగంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఒప్పందం కూడా జరగకపోవడాన్ని ఎత్తిచూపుతూ తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్‌లకు లేఖలు రాశామని సీడబ్ల్యూసీ గుర్తుచేసింది. కానీ.. ఈ అంశంపై వారి నుంచి స్పష్టమైన సమాధానాలు రాలేదని పేర్కొంది. నీటి కేటాయింపులపై స్పష్టత లేని నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను మదింపు చేయలేమని, అనుమతి ఇవ్వలేమని తెలంగాణ సర్కార్‌కు సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

ఎన్‌సీసీకి పూర్తి సహకారం

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ
- సీఎంను కలిసిన ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్‌సీసీ సేవలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ (డీజీ) లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఏపీలో ఎన్‌సీసీ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రత్యేకంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు సీఎంకు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో క్రీడలు, యువజన సర్వీసులశాఖ ముఖ్యకార్యదర్శి జి.వాణీమోహన్, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఏపీ, తెలంగాణ) ఎయిర్ కమాండర్ పి.మహేశ్వర్, కల్నల్ వి.వి.శ్రీనివాస్, కల్నల్ వివేక్ షీల్, తదితరులు ఉన్నారు.

17న ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం వైఎస్ జగన్
- డిప్యూటీ సీఎం అంజాద్ బాషా వెల్లడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురం బైపాస్ రోడ్డులోని స్టేడియం స్థలంలో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఆయన గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పోలీస్ కమిషనర్ కాంతి రాణాటాటా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో అంజాద్ బాషా మాట్లాడుతూ ఈ నెల 17వ సాయంత్రం ఐదు గంటలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల మంది ముస్లింలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. మైదానంలో సుమారు ఐదు వేల మందికి పైగా ముస్లిం సోదరులు సామూహిక మగ్‌రిబ్ నమాజ్ చేసుకునేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. ఉపవాస దీక్షను విరమించేవారికి పండ్లు, అల్పాహారం, నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముస్లిం సోదరులు నిర్దేశించిన సమయానికి కన్నా ముందుగానే మైదానం వద్దకు చేరుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ప్రొటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, వక్ఫ్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ షరీన్ బేగం, సీఈవో అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా తిరుపతి గంగమ్మ జాతర

సాక్షి, అమరావతి: తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికంగా ఏటా మే నెలలో తాతలగుంట గంగమ్మ జాతరను ప్రసిద్ధ పండుగగా నిర్వహిస్తున్నారు. 900 ఏళ్ల పురాతన చరిత్ర కలిగిన గంగమ్మ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ క్రమంలో ఏటా ప్రభుత్వం అధికారికంగా గంగమ్మ జాతరను నిర్వహిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మమ్మల్ని ఎవరూ లంచం అడగలేదు

- మాల్ అండ్ మల్టీప్లెక్స్ ప్రమోటర్ రామ్‌నితేష్
- చంద్రబాబు వ్యాఖ్యలకు ఖండన

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు బుధవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో కొందరు తమను రూ.150 కోట్లు లంచం అడిగారంటూ చేసిన ఆరోపణలు అవాస్తవమని మచిలీపట్నం మాల్ అండ్ మల్టీప్లెక్స్ ప్రమోటర్ జల్లు రామ్‌నితేష్ గురువారం 'సాక్షి'కి చెప్పారు. ఈ ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. చంద్రబాబుకు, ఆ పార్టీ నాయకులకు ఈ విషయంపై తాము ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. తమ ప్రాజెక్టు విలువ రూ.150 కోట్లు లేనప్పుడు తమను ఎవరో రూ.150 కోట్లు లంచం అడిగారని అసత్య, అసంబద్ధ ఆరోపణలు ఎలా వచ్చాయో తనకు తెలియదని చెప్పారు. ఓసీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం తమను ఏ రాజకీయ పార్టీ నాయకుడు, పార్టీ లంచం డిమాండ్ చేయలేదని తెలిపారు. అలా అడిగినట్లుగా తాము కూడా ఎవరికీ చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి అక్రెడిటేషన్లకు దరఖాస్తుల స్వీకరణ

- సమాచార శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: పాత్రికేయులకు రెండు సంవత్సరాల వ్యవధితో రాష్ట్ర స్థాయి అక్రెడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులను www.ipr.ap.gov.inలో అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త అక్రెడిటేషన్ల మంజూరు కోసం జీవో తీసుకువచ్చిందని.. అలాగే రాష్ట్ర స్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుల నియామకాన్ని పూర్తి చేసిందని పేర్కొన్నారు. తొలుత రాష్ట్ర స్థాయి అక్రెడిటేషన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పాత్రికేయులు తమ వివరాలతో పాటు యాజమాన్య సిఫారసు లేఖ, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంబంధిత డాక్యుమెంట్లను పీడీఎఫ్ రూపంలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మే రెండో వారంలో టెన్త్ రిజల్ట్స్

చిలకలూరిపేట టౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాలను మే నెల రెండో వారంలో విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించినట్టు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,349 కేంద్రాల్లో 6.64 లక్షల మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు ఆరుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ నెల 18వ తేదీతో పరీక్షలు ముగుస్తాయని, అనంతరం 19 నుంచి 26వ తేదీ వరకు మూల్యాంకనం జరుగుతుందని వివరించారు. మే నెల రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

ప్రేమోన్మాదికి జీవితఖైదు

- 2021లో నరసరావుపేటలో డిగ్రీ విద్యార్థిని అనూష హత్య
- గొంతు నులిమి చంపిన సహ విద్యార్థి విష్ణువర్ధన్‌రెడ్డి
- నిందితుడికి జీవితఖైదు, రూ.2,500 జరిమానా
- నరసరావుపేట 13వ అదనపు జిల్లా కోర్టు తీర్పు
- 'దిశ' ద్వారా వేగంగా కేసు దర్యాప్తు... నిందితుడికి శిక్ష



నిందితుడిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

నరసరావుపేట టౌన్: తన ప్రేమను నిరాకరించిందని యువతిని దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాదికి జీవితఖైదు, రూ.2,500 జరిమానా విధిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేట 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఒంగోలు వెంకటనాగేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... ముప్పాళ్ల మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన కోటా అనూష నరసరావుపేట రామిరెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివేది. అదే కళాశాలలో చదువుతున్న బొల్లాపల్లి మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన మేడం విష్ణువర్ధన్‌రెడ్డి తనను ప్రేమించాలని అనూషను వేధింపులకు గురిచేశాడు. ఆమె నిరాకరించడంతో 2021, ఫిబ్రవరి 24న కళాశాలకు వెళుతున్న అనూషను మాట్లాడాలని విష్ణువర్ధన్‌రెడ్డి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని పట్టణ శివారులోని పాలపాడు రోడ్డు గోవిందపురం మైనర్ కాలువ వద్దకు తీసుకువెళ్లి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేసి పరారయ్యాడు. మృతురాలి తల్లి వనజాక్షి ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవడంతోపాటు రూ.10 లక్షల పరిహారం అందించింది. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును పల్నాడు జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రత్యేక విచారణ అధికారిగా డీఎస్పీ రవిచంద్రను నియమించారు. హత్యపై సమగ్ర వివరాలు సేకరించి చార్జిషీట్ దాఖలు చేసి సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. దీంతో విచారణ చేసిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడికి జీవితఖైదు, రూ.2,500 జరిమానా విధించారు. నిందితుడికి త్వరగా శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అభినందించారు. దిశ డీఎస్పీ రవిచంద్రను అనూష తల్లిదండ్రులు సన్మానించారు.

పోలీసుల సహకారంతోనే త్వరగా శిక్ష



ప్రేమించలేదన్న అక్కసుతో మా అమ్మాయిని దుండగుడు విష్ణువర్ధన్‌రెడ్డి కిరాతకంగా గొంతునులిమి హత్య చేశాడు. పోలీసుల సహకారంతో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడింది. ప్రభుత్వం, పోలీసులు మా కేసు పట్ల చూపించిన శ్రద్ధ మరువలేం. నిందితుడికి యావజ్జీవ శిక్ష పడినప్పటికీ... ఉరిశిక్ష వేసి ఉంటే బాగుండేది.

– కోటా వనజాక్షి, అనూష తల్లి

ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టాం. నిందితుడ్ని 24 గంటల్లో అరెస్ట్ చేసి 48 గంటల వ్యవధిలో ప్రాథమిక చార్జిషీట్, వారం రోజుల్లో సమగ్ర విచారణ జరిపి తుది చార్జిషీట్‌ను దాఖలు చేశాం. దిశ ద్వారా సత్వర న్యాయం అందుతుందన్న భావన ఈ కేసుతో రుజువైంది.

– రవిచంద్ర, దిశ డీఎస్పీ, నరసరావుపేట

టిడ్కో ఇళ్లపై విషప్రచారం



గృహ నిర్మాణ శాఖ, టిడ్కోపై ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కూడా ఇంత బడ్జెట్ లేదన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇప్పటి వరకు 3,40,741 ఇళ్లు పూర్తయ్యాయని, స్లాబ్ పూర్తి అయిన, స్లాబ్‌కు సిద్ధంగా ఉన్న ఇళ్లు మరో 4,67,551 ఉన్నాయన్నారు. కొద్ది రోజుల్లో ఈ ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటుక, సిమెంటు, స్టీలు, ఇతర సామగ్రికి నాణ్యత పరీక్షలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 4,529 పరీక్షలు చేశామని, 2 శాతం మేర లోపాలు కనిపిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

నాణ్యతలో రాజీపడొద్దు

నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సీఎం వైఎస్ జగన్ మరోసారి అధికారులకు స్పష్టం చేశారు. వైఎస్సార్, జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వెనువెంటనే కరెంటు, నీరు సహా ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలతో పాటు ప్రతి ఇంటికీ సోక్‌పిట్స్ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా భవిష్యత్తులో వాన నీరు భూమిలోకి ఇంకిపోయేలా చేయొచ్చని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి, ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా, జేఎండీ శివప్రసాద్, టిడ్కో ఎండీ శ్రీధర్, మైనింగ్ డైరెక్టర్ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం చేస్తున్న వ్యయం

- 30.25 లక్షల మందికి 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పంపిణీకి: రూ.56,102.91 కోట్లు
- కాలనీల్లో సదుపాయాల కల్పన కోసం: రూ.36,026 కోట్లు (ఇందులో తాత్కాలిక సదుపాయాలకు రూ.3,117 కోట్లు, శాశ్వత సదుపాయాలకు : రూ.32,909 కోట్లు)
- శాశ్వత సదుపాయాల్లో నీటి సరఫరా: రూ.4,128 కోట్లు
- విద్యుత్, ఇంటర్నెట్: రూ.7,989 కోట్లు
- డ్రైనేజీ, సీవరేజ్: రూ.7,227 కోట్లు
- రోడ్లు, ఆర్బీలు : రూ.10,251 కోట్లు
- పట్టణ ప్రాంత లేఅవుట్‌లలో వసతుల కల్పన: రూ.3,314 కోట్లు
- లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా కింద చెల్లింపులు, ఇతర రాయితీలు: రూ.13,758 కోట్లు

టిడ్కో పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.21 వేల కోట్ల లబ్ధి ఇలా

అంశం: 300 చ.అ ఇళ్లు
నాడు (2015 నుంచి ఏప్రిల్ 2019 మధ్య): రూ.2,65,500
నేడు (మే 2019 నుంచి ఇప్పటి వరకు): పూర్తి ఉచితం

మార్పు: గత ప్రభుత్వంలో 300 చ.అ ఇళ్ల లబ్ధిదారులు బ్యాంక్ లోన్ ద్వారా రూ.2.65 లక్షలు చెల్లించాల్సి ఉండేది. ఈ మొత్తాన్ని 20 ఏళ్ల పాటు వాయిదాల్లో తిరిగి చెల్లించాల్సి ఉండేది. అంటే వడ్డీతో కలిపి ఒక్కో లబ్ధిదారు రూ.7.20 లక్షల మేర చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం చేసిన మేలుతో 1,43,600 (300 చ.అ) ఇళ్ల లబ్ధిదారులకు రూ.18,339 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

అంశం: 365, 430 చ.అ ఇళ్లు
నాడు (2015 నుంచి ఏప్రిల్ 2019 మధ్య): 365 చ.అ ఇళ్ల లబ్ధిదారుడు ముందుగా తన వాటా కింద రూ.50 వేలు చెల్లించాలి. 430 చ.అ ఇళ్ల లబ్ధిదారు తన వాటా కింద రూ.లక్ష చెల్లించాలి.
నేడు (మే 2019 నుంచి ఇప్పటి వరకు): లబ్ధిదారులు తమ వాటా కింద చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం మేర రాయితీ.

మార్పు: 50 శాతం మేర రాయితీతో 44,304 మంది 365 చ.అ ఇళ్ల, 74,312 మంది 430 చ.అ ఇళ్ల లబ్ధిదారులపై రూ.482.32 కోట్ల మేర భారం తగ్గింది.

అంశం: రిజిస్ట్రేషన్
నాడు: నిర్ణీత ఫీజు చెల్లించాలి
నేడు: ఉచితం

మార్పు: ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ద్వారా 2.62 లక్షల మంది లబ్ధిదారులపై రూ.1,200 కోట్ల భారాన్ని ప్రభుత్వం తప్పించింది.

అంశం	నాడు	నేడు
ఎ. బ్యాంక్ లోన్ టైఅప్	రూ.78.08 కోట్లు	రూ.1,875 కోట్లు
బి. రిజిస్ట్రేషన్లు	-	1,55,673
సి. లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత	-	1.50 లక్షల ఇళ్లు అప్పగిస్తున్నాం

మార్పు: జూన్‌లోగా అప్పగింత ప్రక్రియ పూర్తి. మిగిలిన 1.12 లక్షల ఇళ్లను డిసెంబర్ నాటికి అప్పగిస్తారు. ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, హడ్కోకు రుణాల చెల్లింపు కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.9,044 కోట్లు ఖర్చు చేసింది.

ఉపాధి కల్పనే ప్రధాని లక్ష్యం



నియామకపత్రాలు పొందిన అభ్యర్థులతో కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే

- కేంద్ర సహాయ మంత్రులు ఫగ్గన్ సింగ్ కులస్తే, పంకజ్ చౌదరి
- ఘనంగా రోజ్‌గార్ మేళా.. వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు పంపిణీ

దొండపర్తి (విశాఖ దక్షిణ)/రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రధానమంత్రి మోదీ నిబద్ధతను నెరవేర్చే దిశగా రోజ్‌గార్ మేళా ద్వారా ఒక ముందడుగు పడిందని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి అన్నారు. గురువారం విశాఖ, విజయవాడలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. విశాఖలోని పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి కులస్తే మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా ప్రధాని దీర్ఘకాల ప్రణాళికతో అనేక సంస్కరణలు చేపడుతున్నారని తెలిపారు. దేశంలో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకొని దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. 2023 చివరి నాటికి 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన రోజ్‌గార్ మేళా 4వ దశలో ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన 192 మంది అభ్యర్థుల్లో 25 మందికి నియామకపత్రాలు అందజేశారు. విజయవాడలోని రైల్వే ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి అభ్యర్థులు 258 మందికి నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా స్టాండప్, స్టార్ట్ అప్ ఇండియా వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. యువతకు అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు రూ.10 లక్షల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భారీగా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, విజయవాడలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డీఆర్ఎం షివేంద్రమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దళితులు పీకిందేమీ లేదు



విదేశీ విద్య కోసం దళితులు పొడిచిందేమీ లేదు

కర్నూలు 'యువగళం' పాదయాత్రలో లోకేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి కర్నూలు: దళితులపై నారా లోకేశ్ నోరుపారేసుకున్నారు. అసభ్య పదజాలంతో ఆ వర్గాన్ని దూషించారు. 'యువగళం' పేరుతో చేస్తున్న పాదయాత్రలో లోకేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చనీయాంశమవుతున్నాయి. పాదయాత్రలో భాగంగా గురువారం నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గానికి లోకేశ్ చేరుకున్నారు. జక్కసానిపల్లిలో ఎస్సీలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురానికి చెందిన అక్కులప్ప అనే దళితుడు విదేశీ విద్య, అవుట్ సోర్సింగ్, కస్తూరిబా గురుకుల పాఠశాలలోని ఉద్యోగులను పర్మినెంట్ చేసే విషయంలో టీడీపీ వైఖరిని ప్రశ్నించాడు. టీడీపీ అధికారంలోకి వస్తే 'అంబేడ్కర్ విదేశీ విద్య' అని పేరు మారుస్తారా? అన్నారు. ఇందుకు లోకేశ్ బదులిస్తూ 'విదేశీ విద్యను చంద్రబాబు తీసుకొచ్చారు. కొంతమంది పిల్లలైనా విదేశాలకు వెళ్తే, మరో పదిమంది వెళ్తారనే ఉద్దేశంతో ప్రారంభించారు. ప్రస్తుతం చాలా మంది పిల్లలు విదేశాలకు వెళ్లి ఇరుక్కుపోయారు. టీడీపీ ప్రభుత్వం ఒక ఏడాది ఫీజులు చెల్లించింది. ఈ ప్రభుత్వం ఫీజులు చెల్లించలేదు. విదేశాల్లో చదివే విద్యార్థులు అప్పుల పాలయ్యారు. విదేశీ విద్యతో పాటు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు తీసేశారు. ప్రభుత్వం రూ.30కోట్లు పెట్టి యాడ్స్ ఇచ్చినంత మాత్రాన పిల్లలు విదేశాలకు వెళ్లరు. విదేశీ విద్యపై పోరాడిన వ్యక్తి మీ లోకేశ్. మంగళగిరి వేదికగా నేనే పోరాడాను. దళితులు పీకింది లేదు... పొడిచింది లేదు. ఈయన పేరు పెట్టేందుకు!' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు తీవ్ర కలకలంరేపుతున్నాయి. గతంలో లోకేశ్ తండ్రి చంద్రబాబు కూడా 'ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు?' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

అనామక లేఖ అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం

- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం
- ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌తో ఎలాంటి పరిచయం లేదు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ విడుదల చేసిన అనామక లేఖను అడ్డుపెట్టుకుని తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ చాట్‌ల ఆధారంగా తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలతో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సుకేశ్ చంద్రశేఖర్‌తో తనకెలాంటి పరిచయం లేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను సహించలేని, కేసీఆర్ జాతీయ స్థాయి కార్యాచరణను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేని తెలంగాణ వ్యతిరేకులు మీడియా సంస్థల ద్వారా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని కవిత తెలిపారు. ఆర్థిక నేరగాడు విడుదల చేసిన అనామక లేఖపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, బీజేపీ టూల్‌కిట్‌లో భాగంగా ఎంపీ అరవింద్ పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో బురద జల్లడం.. అంతా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలి

తన మొబైల్ ఫోన్ల విషయంలోనూ గతంలో తొందరపడి వార్తలు రాశారని, ప్రస్తుతం నేరగాడు సుకేశ్‌ను పావుగా వాడుకుని తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ కుటుంబసభ్యులను బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత పేర్కొన్నారు. రాజకీయ ఎజెండాలో మీడియా సంస్థలు పావుగా మారి బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎన్నికల ఏడాదిలో వచ్చే ఈ తరహా వార్తల విషయంలో తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అయినా తెలంగాణ ప్రజలకు పాలు, నీళ్ల నడుమ తేడా తెలుసని, కేసీఆర్ మీద కక్షతో, బీఆర్ఎస్ మీద ఈర్ష్యతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తరిమికొడతారని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలుగా తాము తలవంచబోమని, తెగించి కొట్లాడతామని స్పష్టం చేశారు.

కవిత స్పందన బ్లేమ్‌గేమ్‌లా ఉంది

- చిన్నపిల్లల వ్యవహారాన్ని తలపిస్తోంది
- సుకేశ్ న్యాయవాది అనంత్ మాలిక్ విమర్శ
- తన క్లయింట్ ఈ వారంలోనే పూర్తిస్థాయిలో స్పందిస్తారని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తన క్లయింట్ సుకేశ్ చంద్రశేఖర్ లేవనెత్తిన ఆరోపణలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించిన తీరు మీడియా, రాజకీయ పార్టీలపై బ్లేమ్ గేమ్ (పరిష్కారం కోసం చూడకుండా నిందలు వేయడం)లా ఉందని న్యాయవాది అనంత్ మాలిక్ విమర్శించారు. సుకేశ్ చంద్రశేఖర్ ఎవరో తనకు తెలియదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విడుదల చేసిన ప్రకటనపై స్పందించారు. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'సుకేశ్ చంద్రశేఖర్ లేవనెత్తిన అంశాలపై కవిత జారీ చేసిన ప్రకటన చిన్నపిల్లల వ్యవహారంలా ఉంది. సుకేశ్ తన ఆరోపణలను అఫిడవిట్ రూపంలో ఇచ్చారు. అంతేకాకుండా ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 65బీ కింద ధ్రువపత్రం కూడా ఇచ్చారు. ఈ విషయంలో న్యాయమైన విచారణను స్వాగతించకుండా అస్పష్టమైన ఆరోపణలతో దర్యాప్తు నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించడం నీటిని ఒడిసి పట్టుకొని ఉంచాలనుకోవడమే. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడెవరైనా విచారణ స్వాగతించేవారు. కవిత స్పందన చూస్తుంటే దాగుడుమూతలు ఆడడంలో ఉన్న నైపుణ్యం కనిపిస్తోంది. ఈ అంశం ప్రత్యేక దర్యాప్తు సంస్థల ప్రత్యేక పరిశోధనకు సంబంధించినదే కానీ, ప్రజల్లో ప్రజాదరణ కోసం పోటీ కాదు. అయితే నా క్లయింట్ కూడా ఈ వారంలోనే పూర్తిస్థాయిలో స్పందిస్తారు..'అని అనంత్ మాలిక్ తెలిపారు.

విజయవాడ రూట్లో 10% రాయితీ

సూపర్ లగ్జరీ, రాజధాని సర్వీసుల్లో అమలు: టీఎస్ ఆర్టీసీ ప్రకటన

హైదరాబాద్: హైదరాబాద్ – విజయవాడ మార్గంలో నడిచే సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల్లో టికెట్ చార్జీలపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు టీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. రాను, పోను టికెట్లన్నింటిపై ఇది వర్తిస్తుందని, ఈ నెల 30వ తేదీ వరకు దీనిని కొనసాగిస్తామని ఎండీ సజ్జనార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం విజయవాడ వరకే వెళ్లే బస్సులతోపాటు ఆ మార్గంలో నడిచే ఇతర సర్వీసులకూ వర్తిస్తుందని వెల్లడించారు. ఒక ప్రయాణికుడు రాజధాని ఏసీ సర్వీస్‌లో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలనుకుంటే.. అతడి టికెట్‌లో విజయవాడ వరకు 10శాతం రాయితీ లభిస్తుందన్నారు. రాయితీతో ఒక్కో ప్రయాణికుడికి రూ.40 నుంచి రూ.50 వరకు ఆదా అవుతుందని.. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు సైతం టీఎస్ ఆర్టీసీ రాయితీ కల్పిస్తోందని తెలిపారు. రోజుల నుంచి 44 రోజుల ముందు అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే 5 శాతం.. 45 నుంచి 60 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు.

యాదాద్రీశునికి బంగారు కిరీటాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ముఖ మండపంలో సువర్ణ మూర్తులకు కొత్త శోభ చేకూరింది. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన వి.ప్రకాశ్ ముదిరాజ్ కు టుంబ సభ్యులు రూ.30 లక్ష లు విలువ చేసే 429 గ్రాముల బంగారంతో తయారు చేయించిన 3 కిరీటాలు, 520 గ్రాముల వెండి పళ్లేన్ని బహూకరించారు. వీటిని గురువారం ఆలయ ఈవో గీతారెడ్డికి అందించగా, సువర్ణ మూర్తులకు అలంకరించారు.

బాబూ.. ఇదేం ఖర్మ



మచిలీపట్నంలో బుధవారం జరిగిన చంద్రబాబు సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సభలకు జనాన్ని రప్పించడం ఆ పార్టీ నేతలకు పెద్ద సవాల్‌గా మారింది. టీడీపీ తన అడ్డాగా చెప్పుకునే విజయవాడలో చంద్రబాబు పర్యటనకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఆ పార్టీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రాతినిధ్యం వహిస్తున్న విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ! టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం విజయవాడలోని రాణీగారితోట ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించగా కనీసం ఆ ప్రాంతలోని ప్రజలు కూడా ఆయన్ను పట్టించుకోలేదు. దీంతో కంగు తిన్న చంద్రబాబు హడావుడిగా నిష్క్రమించారు. ఆ తర్వాత బందరు వెళుతూ కానూరు, పోరంకి ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. విజయవాడ, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో చంద్రబాబు రోడ్‌షోలు ఫ్లాప్ కావడంతో బెజవాడ టీడీపీ నేతలు మొహాలు వేలాడేశారు. గేరు మార్చామంటూ చంద్రబాబు, టీడీపీ నేతలు కొద్దిరోజులుగా చేస్తున్న ప్రచారంలో పస లేదని విజయవాడ పర్యటనతో తేటతెల్లమైందని ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

బందరులో మాడిపోయిన బాబు మొహం

మచిలీపట్నంలో చంద్రబాబుకు టీడీపీ కార్యకర్తలు మరో షాక్ ఇచ్చారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలతో స్వాగతం పలికి నినాదాలు చేయడంతో మచిలీపట్నం సభ చంద్రబాబును 'ఇదేం ఖర్మ' అనుకునేలా చేసింది. సభకు జనం ఆశించిన స్థాయిలో రాకపోవడంతో బాబు మొహం మాడిపోయింది. నాయకులకు ఇండెంట్లు ఇచ్చి మరీ జన సమీకరణకు ప్రణాళిక రూపొందించినా స్పందన కరువవడంతో ఇరుకు సందులను ఎంచుకుంటున్నారు. టీడీపీ నేతలు ఫేక్ ప్రచారానికి ఎల్లో మీడియా, సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారు. చంద్రబాబు పర్యటనలు, లోకేశ్ పాదయాత్రకు స్పందన కొరవడటంతో ప్రజలను నమ్మించేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

ఇన్‌చార్జ్‌లు కరువు

టీడీపీకి జనాదరణ లేదని గ్రహించడంతో చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీకి ఇన్‌చార్జిలు లేకుండా పోయారు. సుమారు 52 నియోజకవర్గాలకు టీడీపీ ఇన్‌చార్జిలు లేరు. మరో 38 చోట్ల 3వ స్థానానికి పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. గన్నవరం, కైకలూరులో నాయకులు ఎవరో తెలియని దుస్థితి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని నానిని ఇన్‌చార్జిగా ప్రకటించినా ఆయన్ను వ్యతిరేకించే నేతలు ఒప్పుకోవడం లేదు. నూజివీడు, గుడివాడలో పార్టీ పరిస్థితి అంతా అయోమయం. గుంటూరు జిల్లాలో సత్తెనపల్లికి ఇన్‌చార్జి లేరు. చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని పూతలపట్టు, చిత్తూరు నియోజవర్గాల్లో పార్టీని నడిపించే నాథుడే లేడు. అనంతపురం జిల్లాలోని శింగనమల, మడకశిరలో టీడీపీకి అభ్యర్థులే దొరకలేదు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన సీఎం

- గుడివాడలో చంద్రబాబు మండిపాటు
- ఎమ్మెల్యే కొడాలి నానిని ఓడించాలని పిలుపు
- జనం లేక వెలవెలబోయిన సభ



గురువారం గుడివాడలో వెలవెలబోతున్న చంద్రబాబు సభ

గుడివాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాలు చేశారని టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గుడివాడలో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో నిర్వహించిన సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చినట్లు సీఎం జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో తనకు ఉన్న సత్‌సంబంధాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని జూదాలు, మట్టి, ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించడం నిజం కాదా అని ప్రశ్నించారు. బూతుల ఎమ్మెల్యేగా కొడాలి నాని పేరు గడించారని ఎద్దేవా చేశారు. అలా బూతులు మాట్లాడటం తమకూ వచ్చన్నారు. రాష్ట్రంలో కృష్ణా జిల్లాకు మంచి పేరు ఉందని.. సినీ, రాజకీయ రంగాల్లో రాణించిన వ్యక్తులు కృష్ణా జిల్లాకు చెందినవారేనన్నారు. గుడివాడ ఎమ్మెల్యే నానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

కిరాయికి తెచ్చిన జనం ఉడాయింపు

తన ఐదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పకుండా, భవిష్యత్‌లో ఫలానా మంచి పనులు చేస్తామని ధైర్యంగా ప్రకటించకుండా.. కేవలం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు, ముఖ్యమంత్రిపై ఆరోపణలతో గురువారం గుడివాడలో చంద్రబాబు పర్యటన ప్రసంగం సాగింది. రోడ్‌షోలో ఆద్యంతం ప్రజల నుంచి తిరస్కారం ఎదురైంది. స్థానిక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు వెనిగండ్ల రాములు వేర్వేరుగా జన సమీకరణకు భారీగా డబ్బు ఖర్చు చేసి, మద్యం వెదజల్లినా ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. 3 గంటలకే వస్తారన్న చంద్రబాబు చీకటి పడినా రాకపోవడంతో కిరాయికి తీసుకొచ్చిన జనం ఇళ్లకు వెళ్లిపోయారు. తీరా రాత్రి 10 గంటలకు చంద్రబాబు సభా స్థలికి చేరుకునే సరికి ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కాగా, జనసమీకరణకు సంబంధించి గుడివాడ నెహ్రూ చౌక్‌లో డబ్బు పంపిణీ విషయమై గొడవ చోటుచేసుకుంది. రాత్రి 10 గంటలైనా చంద్రబాబు రాకపోవడంతో డబ్బులిస్తే వెళ్లిపోతామని కిరాయికి వచ్చిన వారు అడిగారు. ఇందుకు టీడీపీ నేతలు ఒప్పుకోలేదు. దీంతో పరస్పరం దాడులకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నిమ్మకూరులో బాబు అసహనం

నిమ్మకూరు (పామర్రు): ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో గురువారం చంద్రన్న ఆత్మీయ సమ్మేళనాన్ని, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనుకున్న స్థాయిలో ప్రజలు రాకపోవడంతో చంద్రబాబు అసహనానికి గురయ్యారు. ప్రసంగం అనంతరం ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, మనవరాలు సుహాసిని, నిమ్మకూరు గ్రామస్తులు చంద్రబాబుకు నూతన వస్త్రాలలిచ్చి గౌరవించారు. చంద్రబాబు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వచ్చిన పలువురు గ్రామస్తులు ఆయన మాట్లాడుతుండగానే.. సభాస్థలి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి.. చంద్రబాబు రోడ్డు షోగా గుడివాడ వెళ్లారు.

సీఎం చొరవతో కిడ్నీ వ్యాధి బాధితునికి భరోసా



బుధవారం సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరిస్తున్న బాధితుడి తల్లి



గురువారం శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసిన ప్రకాశం కలెక్టర్

ఒంగోలు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కిడ్నీ వ్యాధి బాధితునికి భరోసా లభించింది. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడి కుటుంబ సభ్యులకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒంగోలులోని ప్రకాశం భవనంలో ప్రభుత్వం తరఫున గురువారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరో రూ.5 లక్షలు వచ్చేలా చర్యలు చేపట్టడంతోపాటు వివిధ రూపాల్లో ఆదుకుంటామన్నారు. ఈబీసీ నేస్తం రెండో విడత ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మార్కాపురం వచ్చిన సందర్భంగా బాధితుడి తల్లి మారమ్మ ఆయనను కలిసి తన కుమారుడు శ్రీనివాసులు పరిస్థితిని వివరించింది. బీఎస్సీ నర్సింగ్ చదివి ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడని, తనొక్కడే కుటుంబానికి ఆధారమని తెలిపింది. కిడ్నీ చెడిపోయి ఆస్పత్రిలో ఉన్నాడని, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు తెలిపారని సీఎంకు వివరించింది. స్పందించిన ముఖ్యమంత్రి జగన్ బాధిత కుటుంబానికి సహాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో బాధితుడి తల్లి మారమ్మను గురువారం కలెక్టరేట్‌కు పిలిపించి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష చెక్కు అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరో రూ.5 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. బాధితుడి అర్హతను బట్టి ఉద్యోగం కూడా ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇడుపూరు లే-అవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం చెప్పారు.

ఫైబర్‌తో 30 అడుగుల అంబేడ్కర్ విగ్రహం

తెనాలిలో త్రీడీ మోడలింగ్, డిజిటల్ టెక్నాలజీతో రూపకల్పన



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలిలోని సూర్యశిల్పశాలకు చెందిన శిల్పులు ఫైబర్‌తో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 30 అడుగుల భారీ విగ్రహాన్ని రూపొందించారు. త్రీడీ మోడలింగ్, డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించి ఈ విగ్రహాన్ని తయారుచేశారు. దానిని గురువారం తమ శిల్పశాలలో ప్రదర్శనకు ఉంచగా, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తిలకించి శిల్పులను అభినందించారు. శిల్పకళాకారుడు కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ విగ్రహం తయారీకి మూడు నెలలు పట్టిందని తెలిపారు. బెంగళూరులో ప్రతిష్ఠ నిమిత్తం ఈ విగ్రహాన్ని తయారు చేశామని, ప్రస్తుతం అక్కడ ఎన్నికల కోడ్ ఉన్నందున వాయిదా పడిందన్నారు. త్వరలోనే బెంగళూరు తరలించనున్నట్లు వివరించారు. శిల్పకళాకారులు రవిచంద్ర, శ్రీహర్ష పాల్గొన్నారు.

రుషికొండలో ఉల్లంఘనల్లేవ్

హైకోర్టుకు నివేదించిన కేంద్ర సంయుక్త కమిటీ

- అనుమతించిన దానికంటే తక్కువ విస్తీర్ణంలోనే నిర్మాణాలు
- 19,968 చ.మీటర్ల విస్తీర్ణంలో 7 బ్లాకుల నిర్మాణానికి అనుమతి
- 13,542 చ.మీటర్ల విస్తీర్ణంలో నాలుగు బ్లాకులే నిర్మాణం
- భూ వినియోగంలో ఎటువంటి మార్పులు లేవు
- ఆమోదించిన బిల్ట్ అప్ ఏరియాలో నిర్మించిన ప్రాంతం సరిగానే ఉంది
- వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఉల్లంఘనలు లేవు
- తాత్కాలిక నిల్వ కోసమే మట్టి డంప్.. తర్వాత తొలగింపు
- సీఆర్‌జెడ్ అనుమతులకు లోబడే నిర్మాణాలు, తవ్వకాలు



సాక్షి, అమరావతి: రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా విశాఖలోని రుషికొండపై చేపడుతున్న నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవని హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కమిటీ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం నివేదికను కమిటీ బుధవారం హైకోర్టుకు సమర్పించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతించిన మేరకు 9.88 ఎకరాల ప్రాంతంలోనే ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ రుషికొండ రిసార్ట్ ప్రాజెక్టు భవనాలను చేపట్టిందని తెలిపింది. వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఎలాంటి ఉల్లంఘనలు లేవని కమిటీ తేల్చింది. మొత్తం 19,968 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏడు బ్లాకులు నిర్మించాలని టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీటీడీసీ) ప్రతిపాదించింది. 19,968 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏడు బ్లాకుల నిర్మాణానికి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ అనుమతించినా టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగు బ్లాకులకే పరిమితం చేసిందని కమిటీ పేర్కొంది. వాస్తవంగా సీఆర్‌జెడ్ అనుమతి మేరకు 19,968 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అంటే 2.71 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ కేవలం 1.84 ఎకరాల్లో అంటే 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగు బ్లాకులకే పరిమితమైనట్లు కమిటీ వివరించింది. మొత్తం 9.88 ఎకరాల ప్రాజెక్టులో 3.86 ఎకరాల్లో ఉన్న వాలు ప్రాంతంతో పాటు 4.225 ఎకరాలున్న మట్టి డంప్ ప్రాంతాన్ని కమిటీ పరిశీలించింది.

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ హైకోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం దాదాపుగా సరిపోతున్నట్లు కమిటీ పేర్కొంది. మట్టిడంప్ ప్రాంతమే అథారిటీ పేర్కొన్న దాని కన్నా కొంచెం ఎక్కువగా ఉందని, అయితే నిర్మాణం పూర్తయిన తరువాత డంప్ చేసిన మట్టిని తొలగిస్తారని కమిటీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ కేంద్ర పర్యావరణ శాఖ ముందస్తు అనుమతి లేకుండా భూ వినియోగ నమూనాలు, ప్రతి బ్లాక్‌లో బిల్ట్ అప్ ఏరియాతో ఉన్న బ్లాకుల సంఖ్యలో సవరణలు చేసిందని కమిటీ వ్యాఖ్యానించింది. అయితే ఏపీటీడీసీ బిల్టప్ ఏరియాను తొలుత ప్రతిపాదించిన 19,968 చదరపు మీటర్ల విస్తీర్ణం నుంచి 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణానికే నాలుగు బ్లాకులకే కుదించిందని కమిటీ పేర్కొంది. ఇందులో భూ వినియోగ విధానంలో ఎటువంటి మార్పులు లేవని, ఆమోదించిన బిల్ట్ అప్ ఏరియాలో నిర్మించిన ప్రాంతం సరిగానే ఉందని కమిటీ తెలిపింది. తొలుత 15,364 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించినట్లు అంకెల్లో పొరపాటు దొర్లిందని పేర్కొంది. 13,542 చదరపు మీటర్లలో నిర్మాణాలు, ఆమోదించిన ప్రాంతంలోనే ఉన్నాయని కమిటీ వెల్లడించింది.

ప్రాజెక్టు పూర్తయ్యాక డంప్ తొలగింపు

రుషికొండకు దక్షిణం వైపున సీఆర్‌జెడ్–2 ప్రాంతంలో తవ్విన మట్టిని ఏపీటీడీసీ డంప్ చేస్తున్నట్లు కమిటీ పరిశీలనలో తేలిందని పేర్కొంది. అయితే ఇది మెటీరియల్ తాత్కాలిక నిల్వ కోసం ఉద్దేశించినందున అభ్యంతరకరం కాకపోవచ్చని తెలిపింది. పాక్షికంగా ల్యాండ్ స్కేపింగ్, హార్డ్ స్కేపింగ్ పనుల కోసం దీన్ని వినియోగిస్తున్నారని, ప్రాజెక్టు పూర్తయిన తరువాత ఏవైనా ఉంటే ఆ స్థలం నుంచి తొలగిస్తారని పేర్కొంది. మొత్తం మీద కోస్టల్ రెగ్యులేషన్ జోన్, పర్యావరణ శాఖ అనుమతుల్లో పేర్కొన్న షరతుల ప్రకారమే ఉన్నాయని, ఎటువంటి ఉల్లంఘనలు లేవని కమిటీ స్పష్టం చేసింది.

ఏపీటీడీసీ ప్రాజెక్టుకు అనుమతులు ఇలా

జీవీఎంసీ నుంచి 07-02-2023న భవన ప్లాన్‌కు ఆమోదం.	జీవీఎంసీ నుంచి ఫైర్ సేఫ్టీ ఆమోదం.	అటవీ శాఖ నుంచి 139 చెట్లు తొలగించేందుకు అనుమతి.	కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు.

చంద్రబాబుకు సింగిల్‌గా పోటీ చేసే దమ్ములేదు

మంత్రి అంబటి రాంబాబు



పట్నంబజారు: టీడీపీ అధినేత చంద్రబాబుకు సింగిల్‌గా పోటీ చేసి గెలిచే దమ్ము లేదని.. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సింగిల్‌గా పోటీ చేస్తే అసెంబ్లీకి వెళ్లలేడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. జగనన్న నవోత్సవాలలో భాగంగా గుంటూరులోని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం 'జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం–సంస్కరణలు' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ.. చే గువేర ఆదర్శమని చెప్పి బీజేపీతో చేతులు కలిపిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు కమలనాథులకు విడాకులు ఇచ్చి, టీడీపీతో కలిసేందుకు చూస్తున్నాడని ఆరోపించారు. చంద్రబాబును సీఎంను చేసేందుకు కలుస్తారా? లేక సిద్ధాంతాల కోసం కలుస్తారా? కలిస్తే ఆ సిద్ధాంతాలేమిటో చెప్పాలి అని పవన్‌ను ప్రశ్నించారు. రామోజీరావు వైట్‌కాలర్ క్రిమినల్ అని, ఆర్థిక నేరస్తుడు కాబట్టే విచారణ జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ ఏసురత్నం, నగర మేయర్ మనోహర్‌నాయుడు, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలపై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో 8 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారంటూ దాఖలైన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు సరైన జవాబులను నిర్ణయించలేదని, ఈ వ్యవహారాన్ని నిపుణుల కమిటీకి నివేదించడంతో పాటు తమను దేహదారుఢ్య పరీక్షకు అనుమతినించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జలగం సహజ మరో 79 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది పీవీజీ ఉమేష్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. అకాడమీ పుస్తకాల్లో సమాధానాలకు భిన్నంగా తుది కీ సమాధానాలు ఉన్నాయన్నారు. అందువల్ల 8 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఏమిటో తేల్చేలా నిపుణుల కమిటీని ఆదేశించాలని కోర్టును కోరారు. కీలో తప్పుల కారణంగా అభ్యర్థులు నష్టపోవడానికి వీల్లేదని, ఇలాంటి పరిస్థితుల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

అన్నీ పరిశీలించాకే తుది కీ విడుదల

ఈ కేసులో పోలీస్ నియామక బోర్డు తరఫున ప్రభుత్వ న్యాయవాది కిషోర్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. అత్యంత అరుదైన పరిస్థితుల్లో మాత్రమే నియామక ప్రక్రియలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయన్నారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. నిపుణుల కమిటీ అన్నీ అంశాలను పరిశీలించిన తరువాతే తుది కీ విడుదలైందని తెలిపారు. అందువల్ల ఈ వ్యవహారంలో ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని, పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదిలా ఉంటే, ఎస్‌ఐ పరీక్ష కీలో సమాధానాలు తప్పుగా ఉన్నాయంటూ దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ వెంకటేశ్వర్లు పోలీస్ నియామక బోర్డును ఆదేశించారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

బందరు ద్రోహి చంద్రబాబే

మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: మోసపూరిత హామీలతో బందరు ప్రజలను వంచించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు అక్కడ పర్యటించే నైతిక అర్హత లేదని మాజీ మంత్రి పేర్ని నాని(వెంకట్రామయ్య) మండిపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టిన చంద్రబాబు ఆర్నెల్లలో బందరు పోర్టును నిర్మిస్తానని హామీ ఇచ్చి మోసగించారని ధ్వజమెత్తారు. 'హైదరాబాద్‌ను తలదన్నేలా బందరు పోర్టు సిటీని నిర్మిస్తానన్నారు. బందరుకు ఒకటి కాదు రెండు రింగు రోడ్డులు వేస్తానన్నారు. పేదలకు 3 సెంట్ల స్థలంతోపాటు రూ.1.50 లక్షలతో పక్కా ఇంటిని నిర్మిస్తానని హామీ ఇచ్చి చేతులెత్తేశారు' అని విమర్శించారు. దేశంలో చంద్రబాబు కంటే మోసగాడు ఎవరైనా ఉన్నారా? అని గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్..

నమ్మకం, విశ్వసనీయతకు సీఎం జగన్ బ్రాండ్ అంబాసిడర్ కాగా మోసానికి, వెన్నుపోటుకు నిదర్శనం చంద్రబాబు. రాష్ట్రానికి సుమారు రూ.మూడు లక్షల కోట్ల మేర అప్పులున్నట్లు కేంద్రం చెబుతుంటే అప్పుల కుప్ప అంటూ చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. గత నాలుగేళ్లలో పేదల ఖాతాల్లో సీఎం జగన్ రూ.రెండు లక్షల కోట్లు జమ చేశారు. అందులో అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.1.42 లక్షల కోట్లు జమ చేశారు. టీడీపీ సర్కార్ హయాంలో అప్పు చేసిన రూ.రెండు లక్షల కోట్లను చంద్రబాబు ఎవరికి దోచిపెట్టారు?

వచ్చే నెలలోనే శంకుస్థాపన

బందరు పోర్టు నిర్మాణం పేరుతో చంద్రబాబు 27 గ్రామాల్లో శ్మశానాలతో సహా 33 వేల ఎకరాలను సమీకరించి రామోజీ వియ్యంకుడితో కలసి దోచుకునేందుకు సిద్ధం కావడం వల్లే ప్రజలు కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు సీఎం జగన్ రహదారికి మినహా ఒక్క ఎకరం కూడా సేకరించకుండా ప్రభుత్వ భూమిలోనే నాలుగు బెర్తులతో పోర్టు నిర్మిస్తున్నారు. వచ్చే నెల రెండో వారంలో శంకుస్థాపన చేసి వేగంగా పూర్తి చేస్తాం.

రైతులకు అండగా వ్యవసాయ పరిశోధనలు

- పంటల్లో నెమటోడ్స్ నివారణకు అందుబాటులో 200 రకాల విధానాలు
- 'సాక్షి'తో ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ క్రాంతి



రంపచోడవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): వ్యవసాయ పరిశోధనలు రైతులకు అండగా నిలుస్తున్నాయని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐసీఏఆర్) శాస్త్రవేత్త డాక్టర్ కె.క్రాంతి అన్నారు. పంటల్లో నెమటోడ్స్(నులిపురుగులు) నివారణపై పరిశోధనలు చేస్తున్న ఆమె.. ఆలిండియా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రంపచోడవరం మండలం పెదపాడులో డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్–కొవ్వూరు నిర్వహించిన 'ఉద్యాన పంటలను ఆశించే నులిపురుగుల నివారణ అవగాహన' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. దేశంలోని ఒకటి, రెండు రాష్ట్రాల్లో మినహా మిగతా అన్ని చోట్లా నెమటోడ్స్‌పై పరిశోధన సెంటర్లు ఉన్నాయని చెప్పారు. 1977 నుంచి పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు ఆయా ప్రాంతాల్లో సర్వే చేసి హాట్‌స్పాట్‌లను గుర్తించి.. వాటి నివారణకు కృషి చేస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు పంటలను పట్టిపీడిస్తున్న నెమటోడ్స్ నివారణకు 200 రకాల విధానాలను ఆవిష్కరించినట్లు వెల్లడించారు.

నెమటోడ్స్‌తో భారీగా నష్టం..

నెమటోడ్స్ మొక్కల వేర్లపై బుడిపెలుగా వస్తాయని.. ఇవి మొక్క పై భాగానికి నీరు వెళ్లకుండా అడ్డుకుంటాయని వివరించారు. దీంతో మొక్కలు ఎండిపోతాయని తెలిపారు. ఉద్యాన పంటల్లో రూట్ నెమటోడ్స్ ఎక్కువ నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పాలీహౌస్, షెడ్‌నెట్‌లలో పెంచే కూరగాయ పంటలకు విపరీతమైన నష్టం వాటిల్లుతోందని చెప్పారు. పంజాబ్, హరియాణా, జమ్మూ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో రైతులు రూ.కోట్లు నష్టపోయారని తెలిపారు. ఉత్తర భారతదేశంలో నెమటోడ్స్ వల్ల 90 శాతం పంట నష్టం జరుగుతుండగా.. ఏపీ, తెలంగాణలో నష్టం 10 శాతంగా ఉందని చెప్పారు. వీటిని నివారించాలంటే.. ఉత్తర భారతదేశంలో అయితే మే, జూన్ నెలల్లో, దక్షిణ భారతదేశంలో ఏప్రిల్, మే నెలల్లో పాలీహౌస్‌లలో కొద్దిగా తడి ఉండేలా 25 మైక్రాన్ మందం కలిగిన పాలిథిన్ కవర్లు పరచాలని సూచించారు. రెండు కేజీల బయో ఏజెంట్, పది గ్రాముల ఎఫ్‌ఐఎం పిచికారీ చేసి పాలీహౌస్‌ను మూసివేయాలన్నారు. క్రాప్‌కు ముందు రెండు నెలలపాటు ఇలా చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. పంట మార్పిడి, కూరగాయల పంట మధ్యలో పూల మొక్కలు నాటడం ద్వారా కూడా వీటిని అడ్డుకోవచ్చన్నారు.

ఇది బహుజనుల విజయం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో ఇళ్ల స్థలాలపై వేసిన పిటిషన్ ఉపసంహరించుకున్న పిటిషనర్లు
- 928వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకుల హర్షం



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించడంపై స్టే ఇవ్వాలంటూ కులవాదులు వేసిన కేసులపై సర్వోన్నత న్యాయస్థానం పేదలకు అనుకూలంగా చేసిన వ్యాఖ్యలతో కులవాదులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు పేర్కొన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 928వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తీసుకున్న నిర్ణయాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వానికి భూములిచ్చేశాక రైతులకు దానిపై హక్కు ఏముంటుందని సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టడంతో కులవాదులు తమ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడం బహుజనుల విజయం అన్నారు. త్వరలో పేదల కల సాకారమై రాజధాని ప్రాంతంలో 54 వేల పట్టాలు అందనున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. బహుజనుల హక్కులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, వరప్రసాద్, సాంబయ్య, ఆదాం, శ్యామ్యూల్, పుష్పరాజ్ పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలు

మే 1 నుంచి ఆన్‌లైన్‌లోనే టికెట్ల జారీ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో అన్ని ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నట్లు ఈవో ఎస్.లవన్న తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి అన్ని ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ (మల్లన్న స్పర్శదర్శనం) టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25వ తేదీ నుంచి దేవస్థానం వెబ్‌సైట్‌లో భక్తులకు టికెట్లను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మే ఒకటో తేదీ నుంచి కరెంట్ బుకింగ్ కౌంటర్ల ద్వారా టికెట్ల జారీని నిలిపివేస్తామని వెల్లడించారు. శ్రీశైలం దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా భక్తులు ఆయా సేవా టికెట్లు పొందాలని సూచించారు. భక్తుల రద్దీ దృష్ట్యా సామాన్యులకు స్వామి, అమ్మవారి దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు పొందినవారు నిర్దేశించిన సమయానికి ఆయా సేవలకు హాజరుకావాలని, వచ్చేటప్పుడు టికెట్ ప్రింట్ కాపీ, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

ప్రజల శ్రేయస్సు కోసం మహాయజ్ఞం

దేవదాయ శాఖ ఆధ్వర్యాన విజయవాడలో మే 12 నుంచి 17 వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంపద, ఆరోగ్యం, పాడిపంటల వృద్ధి కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మే 12 నుంచి 17వ తేదీ వరకు చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతితో, ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ నిర్ణయం మేరకు, ఆగమ సలహా మండలి సూచనలతో జ్యోతిష్య దైవజ్ఞులు నిర్ణయించిన ముహూర్తాన్ని అనుసరించి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 108 కుండములు, 2 ప్రధాన కుండములతో 8 ఆగమములను అనుసరించి రాష్ట్రంలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాయజ్ఞం నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి (దేవదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డి గురువారం రెవెన్యూ (దేవదాయ శాఖ) కార్యదర్శి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ పోలీస్ కమిషనర్, మున్సిపల్, అగ్నిమాపక, ఎలక్ట్రికల్, రహదారులు–భవనాలు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.



మనుషులు నశ్వరులు. అలాగే ఆలోచనలు.
ఒక మొక్కకు నీళ్లు ఎలా అవసరమో, ఆలోచనకు వ్యాప్తి అలా
అవసరం. లేదంటే రెండూ వాడిపోయి చచ్చిపోతాయి.
– డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్

సాక్షి
శుక్రవారం, 14 ఏప్రిల్ 2023

జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది మొదలు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వినూత్నమైన, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో బీసీల కుల గణనకు సంకల్పించి ఆ వర్గాల చిరకాల వాంఛ నెరవేర్చారు. గద్దెనెక్క దల్చుకున్న ప్రతి పార్టీ అట్టడుగు వర్గాల ఉద్ధరణే ధ్యేయమని ప్రకటించటం మన దేశంలో రివాజు. అధికారం వస్తే గిస్తే ఆ వర్గాల నేతల్లో కొందరికి మొక్కుబడిగా పదవులివ్వటం, ఆ వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకునే పేరుతో నామమాత్రంగా నిధులు విదల్చటం కూడా షరా మామూలే. కానీ జగన్‌మోహన్ రెడ్డి ఇందుకు భిన్నంగా సాధారణ ప్రజానీకానికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే తన కేబినెట్‌లో 68 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు కేటాయించి ఔరా అనిపించారు. సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ చట్టసభల్లో, స్థానిక సంస్థల పదవుల్లో అట్టడుగు కులాలకు ప్రాతినిధ్యం గణనీయంగా పెంచటమే కాదు... అన్ని రకాల నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో కూడా ఆ వర్గాలకు 50 శాతం కేటాయించాలని నిర్దేశించారు. వెనకబడిన కులాల్లో ఇంతవరకూ ఎవరి దృష్టీ పడని కులాలకు సైతం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సామాజిక ఆర్థిక ప్రగతికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆ క్రమంలో బీసీల కుల గణనకు పూనుకోవాలనుకోవటం అత్యంత కీలక నిర్ణయం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా, జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీ కులాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో పెద్దగా ప్రాధాన్యత లేదు. వివక్ష కారణంగా వెనకబాటుతనానికి గురవుతున్న కులాలను గుర్తించేందుకు 1979లో కేంద్రంలోని అప్పటి జనతా పార్టీ ప్రభుత్వం మండల్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఇచ్చిన సమగ్రమైన నివేదికను పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలన్న స్పృహ ఎవరికీ లేని కారణంగా దశాబ్దంపాటు అది మూలనపడింది. 1989లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ నేతృత్వంలోని సర్కారు ఆ నివేదిక దుమ్ము దులిపి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించటం ఆ వర్గాల వారికి విద్య, ఉద్యోగావకాశాలను కల్పించటం మాత్రమే కాదు... దేశ రాజకీయాల గతినే మార్చేసింది. ఆ తర్వాత నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదోమేరకు ఆ వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. అరకొరగానైనా ఆ వర్గాలకు రాజకీయ పదవులు దక్కుతున్నాయి. విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు ఇంకా పూర్తి స్థాయిలో అమలుకావటం లేదు. ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లోనూ, ఇతరత్రా ప్రభుత్వరంగ సంస్థల్లోనూ కోటా అమలు అంతంతమాత్రంగానే ఉన్నదని బీసీ వర్గాలు తరచు ఆరోపిస్తున్నాయి. జనాభాలో మెజారిటీ వర్గ ప్రజలు అభ్యున్నతి సాధించకుండా దేశం ఉన్నత స్థాయికి చేరుకోవటం సాధ్యమవుతుందా? దేశంలో చివరిసారి కులగణన బ్రిటిష్ పాలకుల హయాంలో 1931లో జరిగింది. స్వతంత్ర భారతదేశంలో పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 1951లో మొదలు కాగా, 2011లో జరిగిన జనాభా లెక్కల సేకరణ వరకూ బీసీ కులాల గణన జోలికే మన పాలకులు పోలేదు. పశుపక్ష్యాదుల లెక్కలు సైతం తెలుసుకోవాలనుకునే ప్రభుత్వాలకు బీసీ జనాభా గణన పట్టకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఒకపక్క అట్టడుగు వర్గాల ఉద్ధరణ ధ్యేయమంటూ పథకాలు రూపొందించిన పాలకులు అవి లక్షిత వర్గాలకు చేరుతున్నాయో లేదోనన్న స్పృహ లేకుండా గడిపారు. అందువల్లే ఇన్నేళ్లుగా ఆశించిన ఫలితాలు రాలేదన్నది వాస్తవం. వేళ్లమీద లెక్కించదగ్గ కులాలు మినహా ఇప్పటికీ చాలా బీసీ కులాలు సంక్షేమ పథకాల మాట అటుంచి కనీస అవసరాలు కూడా దక్కించుకోలేకపోతున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం బీసీ కులాలు 2,666 కాగా సంక్షేమ ఫలాలు అందుకునే కులాలు అందులో పట్టుమని పదిశాతం కూడా ఉండటం లేదు. బీసీ జనాభా సంఖ్య ఎంతన్నది మిస్టరీగా మిగిలిపోవటం వల్ల ఆర్థికంగా, విద్యాపరంగా, ఉపాధిపరంగా ఆ వర్గాల స్థితిగతులేమిటన్నది ప్రభుత్వాలకు తెలియటం లేదు. రూపొందించే పథకాలు, అందు కోసం కేటాయించే నిధుల వ్యవహారం చీకట్లో తడుములాటగా సాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 341 రోజులపాటు సాగించిన 3,641 కిలోమీటర్ల ప్రజా సంకల్పయాత్రలో కోట్లాదిమంది అట్టడుగు ప్రజానీకం కష్టాలనూ, కడగళ్లనూ జగన్ కళ్లారా చూసినందువల్లే నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలు పొందుపరిచి మేనిఫెస్టో రూపొందించారు. వాటిని అమలు చేస్తూనే ఇతరేతర వర్గాలకు లబ్ధి చేకూరేలా మరిన్ని పథకాలను ఆచరణలోకి తీసుకొచ్చి సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందేలా చర్యలు తీసుకున్నారు. బీసీల జనాభా గణన పూర్తయితే ఇది మరింత పదునుతేరుతుందన్న ఆలోచన ఆయనది. అందువల్లే ఈసారి జనాభా లెక్కల్లో బీసీ కులాలను గణించాలన్న బీసీ వర్గాలకు అందరికన్నా ముందు మద్దతు పలకటమేకాక, ఆ డిమాండ్‌ను సమర్థిస్తూ పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలతో మాట్లాడించారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదింపజేశారు. బీసీల కుల గణన నిర్ణయానికి అనువుగా ఇప్పటికే ఆ దిశగా అడుగులేసిన రాష్ట్రాల్లో కార్యాచరణ ఏ విధంగా ఉందన్న అంశాన్ని అధ్యయనం చేసేందుకు, మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. జాతీయ పక్షాలుగా ముద్రపడిన పార్టీలు సైతం బీసీ వర్గాల డిమాండ్‌పై నికరమైన విధానం ప్రకటించలేని నిస్సహాయతలో పడగా ఆదినుంచీ అందుకు మద్దతిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి తన తాజా నిర్ణయంతో ఆ వర్గాలకు మరింత చేరువయ్యారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.నవమి రా.9.55 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.18 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.11.58 నుండి 1.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు తదుపరి ప.12.23 నుండి 1.15 వరకు
అమృతఘడియలు: రా.8.48 నుండి 10.17 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఈ యుగం బాబాసాహెబ్‌దే!

ఇవ్వాళ పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు అందరూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను భుజానికి ఎత్తుకుంటున్నారు. ఇందులో కొందరు అంబేడ్కర్ చెప్పిన సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించేవారూ ఉన్నారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... బాబాసాహెబ్ ఏం చెప్పారో దానికి పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ దేశ రాజ్యాంగ మౌలిక సూత్రాలనే దెబ్బతీయ చూస్తున్నవారూ ఉండటం! విభిన్న భౌగోళిక ప్రాంతాలూ, అనేక జాతులూ, మతాలూ, కులాలూ, భాషలూ ఉన్న భారతదేశం సమాఖ్య లౌకిక రాజ్యంగా విలసిల్లాలని అంబేడ్కర్ ఆశించారు. ఆ మేర రాజ్యాంగంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కానీ నేడు కొందరు పాలకులు, ప్రభుత్వాలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడిచే విధంగా అడుగులు వేస్తుండడం విషాదకరం.

సందర్భం



డాక్టర్ కత్తి పద్మారావు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ఆయన వ్యక్తిత్వాన్ని గురించి, సిద్ధాంత అన్వయం గురించి ముఖ్యంగా భారత రాజ్యాంగ నిర్మాణం గురించి, కుల నిర్మూలనా సిద్ధాంత ప్రతిపాదన గురించి చర్చ జరుగుతోంది. ఆయన తన జీవిత కాలంలో విస్తృతంగా రచనలు చేశారు. ఆయన మేధో సంపన్నత ఆయన గవేషణ పద్ధతిలోనే ఉంది. ముఖ్యంగా వేదాలను పరిశీలించిన పద్ధతి వినూత్నమైనది, విప్లవాత్మకమైనది. ఎందుకంటే అంతకుముందు వేదాల గురించి పరిశోధించిన మాక్స్ ముల్లర్, సురేంద్ర దాస్ గుప్తా, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటివారు ఎవరూ కూడా వేదాలు అశాస్త్రీయమైన భావాలతో రూపొందాయని చెప్ప లేకపోయారు. ముఖ్యంగా శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తమ తమ కోణాల్లో వేద సమర్థకులుగా భాష్యం రాసుకున్నారు. అంబేడ్కర్ ఒక్కరే వేదాలను, భగవద్గీతను హింసాత్మక గ్రంథాలుగా పేర్కొన్న సాహసవంతుడు. అలాగే ఆయన 'శాక్రెడ్ ఆఫ్ ఈస్ట్' పేరుతో వచ్చిన 50 వాల్యూమ్స్ చదివి రాసుకున్న నోట్స్ ఎంతో విలువైనది. దాన్ని ముద్రిస్తే ప్రపంచ మూల తత్త్వ శాస్త్రానికి ఎంతో విలువైన సమాచారం జోడించగల గ్రంథాలు అందుబాటులోకి వస్తాయి. ఆయన తాత్విక దర్శనాలు శాస్త్రీయమైన చర్చతో కూడి ఉంటాయి. మార్క్స్, ఎంగెల్స్‌లు రాసిన 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో', ఎంగెల్స్ రాసిన 'డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్', మోర్గాన్ రాసిన 'ఏన్షియంట్ సొసైటీ' వంటి వాటి స్థాయిలో... ఆయన తాత్విక, సామాజిక, రాజకీయ చర్చలు ఉంటాయి.

వేదాల గురించి అంబేడ్కర్ ఇలా అన్నారు. 'వేదాలు హిందువుల మతసాహిత్యంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించుకున్నాయని చెప్పడం వాటిని గురించి చాలా తక్కువ చెప్పినట్టే అవుతుంది. వేదాలు హిందువుల పవిత్ర సాహిత్యం అని చెప్పినా సరిపోనిదే అవుతుంది. ఎందుచేతనంటే అవి తప్పు పట్టడానికి వీలు లేనివి. వాటిని అపౌరుషేయాలని నమ్ముతారు కాబట్టి'. అంటే వేదాలు మానవ కల్పితాలు కావు అని అర్థం. మానవ కల్పితాలు కాకపోవడం వల్ల సాధారణంగా ప్రతి మానవుడు చేసే తప్పిదాలకు, దోషాలకు, పొరపాట్లకు అవి అతీతంగా ఉంటాయి. అందుచేతనే అవి అమోఘమైనవిగా భారతీయులు నమ్ముతున్నారు. అయితే అంబేడ్కర్ వేదాలను మానవ మాత్రులైన ఋషులే రచించారని చెప్పారు. ఒకరిని ద్వేషించే, అపహాస్యం చేసే, హింసను ప్రోత్సహించే ఏ గ్రంథాలైనా అవి విశ్వజనీనమైనవి కావు అని అంబేడ్కర్ చెప్పారు.

అంబేడ్కర్ ప్రతిభ బహుముఖీనం. ప్రధానంగా ఆయన తాత్వికులు. ముందు తన్ను తాను తెలుసుకున్నారు. తర్వాత తన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా తెలుసుకున్నారు. తనకూ సమాజానికీ ఉండే అంతఃసంబంధాలను అధ్యయనం చేశారు. సమాజానికి అంతః ప్రకృతి అయిన రాజ్యాన్నీ, దాని అంగమైన ప్రభుత్వాన్నీ, వాటి పునాదుల్నీ పరిశోధించారు. వాటికీ తనకూ ఉండే వైరుధ్యాలనూ బయటకు తీశారు. ఈ దృష్టితో చూసినప్పుడు భారతావనిలో బుద్ధుని తర్వాత అంతలోతైన నైతిక వ్యక్తిత్వం అంబేడ్కర్‌దే అవుతుంది. ఆయన సామాజిక జీవితానికి పునాది బుద్ధుని బోధనా తత్వంలోనే అంతర్లీనంగా ఉంది. ఆయన బోధనలో ప్రేమ, కరుణ, ప్రజ్ఞ, ఆచరణ, దుఃఖ నివారణ, సంఘ నిర్మాణం, నైతికత, త్యాగం, ప్రధానమైనవి.

ఆయన ఎంతో నిబద్ధంగా జీవించారు. రాత్రి పది గంటలకు ఆయన అన్నం తినేటప్పుడు పుస్తకాల జ్వలనంతో పాటు ఆకలి మంట కూడా రగులుతూనే ఉండేది. లండన్ వీధుల్లో అర్ధాకలితో తిరిగారు. ఆయన ధనాన్ని జ్ఞానానికి ఎక్కువ ఖర్చు చేశారు. ఆకలి తీర్చుకోవడానికి తక్కువ డబ్బు వాడేవారు. కాల్చిన రొట్టె ముక్క లను ఒక కప్పు టీలో ముంచి తిని అనంత అధ్యయనం చేసిన త్యాగశీలి ఆయన. ఈరోజు స్కాలర్‌షిప్‌తో చదువుకుంటున్న కొందరు దళిత విద్యార్థులు తమ ఉపకార వేతనాన్ని విలాసాలకు వాడుతున్న వైనం చూస్తుంటే అంబేడ్కర్ నుంచి వీరు ఎంత నేర్చుకోవాలో అర్థమవుతుంది.

అంబేడ్కర్ పరీక్షల కోసం చదవలేదు. విజ్ఞానం కోసం, అవగాహన కోసం సిద్ధాంత నిర్మాణం కోసం, సాక్ష్యాధారాల కోసం చదివారు.



నేడు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి

రాత్రంతా చదువుతూ కనిపించే అంబేడ్కర్‌తో రూమ్‌మేట్ ఎప్పుడైనా చదువు ఆపు అంటే...'నా పరిస్థితులు, నా పేదరికం, నేను ఎంత త్వరగా విద్యార్జన పూర్తి చేస్తే అంత మంచిది. నా కాలాన్ని నేను ఎంత విద్యార్జనలో గడిపితే, ఎంత సద్వినియోగం చేసుకుంటే అంత మంచిది' అని చెప్పేవారు. ఆయన చదువు పట్ల చూపిన నిబద్ధతని ఈనాటి దళిత విద్యార్థి లోకం అనుసరించినట్లయితే మేధోసంపన్నత వీరి సొంతమై వీరు భారత దేశ పునర్నిర్మాణానికి ముందుకు వస్తారు.

నీటి వినియోగం పైన అంబేడ్కర్ పెట్టిన శ్రద్ధ ఏ జాతీయ నాయకుడూ పెట్టలేదు. అంతగా పట్టించుకోలేదు. ఆయన ప్రణాళికలు నిర్దిష్టమై నవి. కార్మికుల అభివృద్ధి కోసం, వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన పోరాడారు. గ్రామీణ శ్రామి కులను పారిశ్రామిక పనుల్లో ఉపయోగించుకుంటే పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా కొలంబియా, హార్వార్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో అంబేడ్కర్ మీద జరిగినంత పరిశోధన భారతదేశంలో జరగడం లేదు. అన్ని కేంద్రీయ, రాష్ట్రీయ, దేశీయ విశ్వ విద్యాలయాల్లోనూ అంబేడ్కర్ పరిశోధనా కేంద్రాలు నిర్మించి... తగినన్ని నిధులు ఇచ్చి ప్రోత్సహించటం ద్వారా ఆయన రచనల లోని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, విద్యా అంశాలపై పరిశోధనలు జరిగేలా చూడాలి. ఆయన నడిపిన పత్రికలు, ఆయన నిర్మించిన సంస్థలు, పార్టీలు, ఆయన ప్రణాళికలు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకాలు. ముఖ్యంగా భూమినీ, పరిశ్రమలనూ జాతీయం చేయాలనే ఆయన ఆలోచన... దళిత, బహుజన, మైనారిటీలు రాజకీయ అధికార సాధన మీద ఆధారపడి ఉంది. అంబేడ్కర్ ముందటి భారతదేశం వేరు. ఆయన తర్వాతి భారతదేశం వేరు. అందుకే అంబేడ్కర్ యుగ కర్త. ఈ యుగం ఆయనదే. ఆయన మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమనేత | 98497 41695

రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాల ప్రకారమే భారత్‌లో సమాఖ్య ప్రభుత్వాలు పూర్తిగా నడవకపోయినా... రాజ్యాంగ మౌలిక సూత్రాలను మాత్రం గత ఆరు దశాబ్దాల్లో అవి అతిక్రమించ లేదనేది వాస్తవం. ఒక వేళ అటువంటి పరిస్థితులు తలెత్తినా న్యాయవ్యవస్థ ఎప్పటికప్పుడు తన న్యాయ సమీక్షాధికారం ద్వారా రాజ్యాంగాన్ని రక్షిస్తూ వచ్చింది.

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం పుణికిపుచ్చుకున్న బీజేపీ 'ఒకే జాతి, ఒకే భాష, ఒకే దేశం' అంటూ నియంతృత్వ భారతాన్ని నిర్మించడానికి వడి వడిగా అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. భారత రాజ్యాంగం బోధిస్తున్న బహుళత్వం, పరస్పర సహకారం, రాష్ట్రాల హక్కులు, స్థానిక స్వయం పరిపాలన వంటి వాటిని తుంగలో తొక్కడానికే అఖండ ఏకైక భారత్ ప్రాపగాండా అనేది స్పష్టం.

ఈ దేశంలోని వేల కులాలు, విభిన్న జాతులు, మతాలు, ప్రాంతాల అస్తిత్వాలను కనుమరుగు చేసి మెజారిటీ మతాన్నీ, భాషనూ ఇతరులపై రుద్దడానికి చేస్తున్న ప్రయత్నాలను ఇంతకన్నా ఏవిధంగా అర్థం చేసుకోవాలి? 'రాష్ట్రాలు మిథ్య, కేంద్రమే నిజం' అన్న రీతిలో కేంద్రంలోని అధికార పార్టీ విధానాలు సాగుతున్నాయి. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ మాత్రం చైతన్యరహితంగా తన పాత పద్ధతుల్లోనే వ్యవహరిస్తూ అనేక రుగ్మతలతో కునారిల్లుతోంది. దేశ నవ నిర్మాణంపై స్పష్టమైన జాతీయ విధానాలు లేని మిగతా జాతీయ పార్టీలు నామమాత్రంగానే మనుగడ సాగిస్తున్నాయి. మరో పక్క చాలా ప్రాంతీయ పార్టీలు అవినీతికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూ జాతీయ రాజకీయాల్లో ప్రభావవంతమైన పాత్రను పోషించే స్థితిలో లేవు.

ఈ పరిస్థితులను అనువుగా తీసుకుని బీజేపీ ఈసారి పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీ సాధించడంతో పాటూ, దేశంలోని సగానికి పైగా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను హస్తగతం చేసుకోవాలని వ్యూహం పన్నుతోంది. నిజంగా ఈ వ్యూహం ఫలిస్తే రాజ్యాంగానికి భారీ సవరణలు చేపట్టి దాని మౌలిక స్వరూపాన్ని మార్చడం బీజేపీకి సులువవుతుంది. మెజారిటీ మతం దేశ ప్రజలందరి మతం అయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ మతానుయాయుల సంస్కృతే మొత్తం దేశ సంస్కృతిగా చలామణీ అవుతుంది. ఇప్పటికే మైనారిటీలు, నిమ్నవర్గాల ఆహార విహారాలపై ఛాందసవాదుల దాడులు, ఆంక్షలను చూస్తూనే ఉన్నాం. బీఫ్‌ను ఆహారంగా తీసుకున్న వారు మత విలువల్ని కించపరచిన వారుగా దాడులకు గురవుతున్నారు. ఎక్కువగా ఉత్తరాదికి పరిమితమైన మూక దాడుల సంస్కృతిని దక్షిణాదికీ, ఈశాన్య భారతానికీ ఛాందసవాదులు విస్తరింపచూస్తున్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఇప్పటి వరకు ఎలాంటి సైనిక, ప్రజా తిరుగుబాటులు జరుగలేదంటే అందుకు రాజ్యాంగం ఇచ్చిన లౌకిక ప్రజాస్వామ్య విలువలే ప్రధాన కారణం. అన్ని కులాలూ, జాతులూ, మతాలూ, భాషలూ, ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం, హక్కులు కల్పించడమనే మౌలిక సూత్రం రాజ్యాంగంలో ఉన్నది కాబట్టే తిరుగుబాట్లు తలెత్తలేదు. కానీ ఒకే దేశం, ఒకే జాతి లాంటి నినాదాలను ముందుకు తెచ్చి కేంద్రీకృత నియంతృత్వ విధానాలనూ, ఫాసిజాన్నీ దేశంలో అమలు చేయడానికి నేడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ తన నియంతృత్వ ధోరణిలో భాగంగానే పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలను రాత్రికి రాత్రే తీసుకుని ప్రజలను ఇక్కట్ల పాలు చేసింది.

సందర్భం



డా॥ గాలి వినోద్ కుమార్

ప్రాతినిధ్య ప్రజాస్వామ్య దేశ నిర్మాణంలో భాగంగా డాక్టర్ అంబేడ్కర్... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజికంగా వెనుక బడిన కారణంగా వారికి రాజ్యాంగంలో రిజర్వే షన్లు పొందుపరచి... విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించారు. కానీ అంబేడ్కర్ నిర్దేశించిన రిజర్వేషన్ల స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ ఆర్థికంగా వెనుకబాటు ఆధారంగా 10 శాతం అగ్ర వర్ణ పేదలకు రిజర్వేషన్లను ఎటువంటి కమిషన్ వేయకుండా, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మూడు రోజుల్లోనే పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకున్న మోదీ ప్రభుత్వాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

6 కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అయిదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులనిచ్చి ముఖ్యమంత్రి జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారు. 135 కోట్ల జనాభాను పాలించే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కనీసం అయిదు ప్రాంతాలకు అయిదుగురు ఉపప్రధానులను చేస్తే తప్పేమిటి? 1955 లోనే మొదటి 'రాష్ట్రాల విభజన కమిషన్'కు భారత రాజ్యాంగ పిత అంబేడ్కర్ ఓ లేఖ రాస్తూ... ఉత్తరాదిన ఢిల్లీని మొదటి దేశ రాజధానిగానూ, దక్షిణాదిన ఉన్న హైద్రాబాద్‌ను దేశ రెండో రాజధానిగానూ చేయాలని ప్రతిపాదించారు. ఇంత వరకు కాంగ్రెస్ కాని, బీజేపీ కానీ ఈ ప్రతిపాదనను పట్టించుకోలేదు. పాలన, అధికార వికేంద్రీకరణ జరిగితేనే కదా అన్ని ప్రాంతాల ప్రజలకూ న్యాయం జరిగేది.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... 135 కోట్ల జనాభాకు కేవలం 29 రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయి. అన్ని అంశాల్లో అమెరికాను ఆదర్శంగా తీసుకుంటున్న భారత్ రాష్ట్రాల సంఖ్య విషయంలో ఎందుకు తీసుకోదో అర్థం కాదు. 35 కోట్ల జనాభాకన్నా తక్కువే ఉన్న అమెరికాలో 50 రాష్ట్రాలు ఉన్నాయి. స్వయం నిర్ణయాధికారాలూ, సొంత సుప్రీంకోర్టు, సొంత రాజ్యాంగం, సొంత జెండా, ఎజెండా కలిగి ఉండే స్వేచ్ఛ అక్కడి రాష్ట్రాలకు ఉంది. అందుకే అక్కడ రాష్ట్రాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయి. బాబా సాహెబ్ సూచించినట్లు భారత్‌లో 2 కోట్ల జనాభాకు ఒక రాష్ట్రం చొప్పున ఏర్పాటు చేస్తే మేలు జరిగి ఉండేది.

జాతీయ వాదం ముసుగులో దళిత, మైనార్టీలపై దాడులు చేస్తే... దేశ జనాభాలో 35 శాతం ఉన్న ఈ వర్గాలు ఎలా నవభారత నిర్మాణంలో భాగస్వాములు అవుతాయి? అందుకే బీజేపీ పాలకులు దుందుడుకు పోకడలకు పోకుండా అంబేడ్కర్ ఆశయాల సాధనకు పాటు పడితే దేశం దానంతట అదే అభివృద్ధి చెందుతుంది.

వ్యాసకర్త ఫౌండర్ చైర్మన్, నవ భారత్ నిర్మాణ్ ఛారిటబుల్ ట్రస్టు

ఇన్‌బాక్స్

అంబేడ్కర్ ఆశయాల సాకారం

దేశంలో జన్మించిన ప్రజలంతా సమానమేననీ, వారందరికీ సమాన హక్కులు, సమాన గౌరవం, సమాన అవకాశాలు చేరువ కావాలనీ అంబేడ్కర్ పరితపించారు. ఆయన చెప్పిన మూడు మాటలు మనం మననం చేసుకోవాలి. ఎడ్యుకేట్, ఆర్గనైజ్, యాజిటేట్... ప్రతీ పౌరుడు విద్యావంతుడిగా మారాలనీ, తద్వారా తన తలరాతను మార్చుకుని, భవిష్యత్తును లిఖించుకోవాలనీ ఆయన ఆశించారు. రెండవది సంఘటితం కావడం, మూడవది పోరాటం చేయడం. ప్రజలు సంఘటితంగా తమ హక్కుల సాధన, సంరక్షణ కోసం పోరాడాలని ఆయన ఎలుగెత్తి నినదించారు.

అయితే ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ ఆశయాలు ఆచరణలో దర్శనమిస్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పరిపాలనలో అవకాశాలు అందరికీ ఇంటి తలుపుతట్టి మరీ చేరువవుతున్నాయి. గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రజల వద్దకే వచ్చి వారి అవసరాలు, అర్హతలు పరిశీలించి నిష్పాక్షికంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేసేలా పాలన జరుగుతోంది. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు, పాఠశాల స్థాయి చిన్నారి నుంచి విశ్వవిద్యాలయాల విద్యార్థి వరకు అర్హులైన ప్రతీ పేదవాడికి నాణ్యతతో కూడిన విద్యను అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.

మహిళలకు చట్టసభల్లో 50 శాతం కంటే అధికంగా సీట్లు కేటాయించడం, స్థానిక సంస్థలు, ఇతర పదవుల కేటాయింపులో వారికి అగ్రాసనం వేయడం కూడా జరిగింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలను అత్యున్నత పదవులలో కూర్చోబెడుతూ, సామాజిక న్యాయాన్ని కార్యరూపంలో చూపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంబేడ్కర్ ఆశయ వారసుడిగా నిలుస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, వసతి దీవెన, ఆసరా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల భవితను మార్చివేస్తున్నారు. అంబేడ్కర్ ఆశించిన విధంగా ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, గౌరవంగా జీవించే పరిస్థితులు రాష్ట్రంలో దర్శనమిస్తున్నాయి.

– ఆచార్య టి. షారోన్ రాజు, విద్యా విభాగాధిపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ శకం

విశ్లేషణ



డాక్టర్ శిఖామణి

అంబేడ్కర్ కోట్లాది భారతీయ దళితుల దాస్య విమోచకుడు మాత్రమే కాదు; భారతీయ దళిత సాహిత్యానికి ఆద్యుడు, ఆధ్యుడు కూడా. అంబేడ్కర్ తన గురుత్రయంగా ప్రకటించుకున్న గౌతమ బుద్ధుడు, సంత్ కబీర్, మహాత్మా జ్యోతిబా పూలేల తాత్విక ఆలోచనా విధానమే అటు అంబేడ్కరిజానికీ, ఇటు భారతీయ దళిత సాహిత్యానికీ సిద్ధాంత భూమిక అయింది.

తెలుగు దళిత సాహిత్యానికి అంబేడ్కర్ ఆంధ్రదేశ పర్యటన ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ గొప్ప ప్రేరణ ఇచ్చింది. నందనార్ హరిశ్చంద్రుడి పట్టువదలని పూనికతో అంబేడ్కర్ 1942 సెప్టెంబర్ 28న ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో అడుగుపెట్టారు. అప్పటికి దళిత నాయకులుగా ఉన్న ఈలి వాడపల్లి, పాము రామ్మూర్తి, కుసుమ ధర్మన్న, బొజ్జా అప్పలస్వామి వంటి వారు ఆ పర్యటనలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ మరణించిన దశాబ్దాలకు గానీ ఆయన జీవితం, రచనలు చదివే అవకాశం తెలుగు దళితులకు దక్కలేదు. 1968లో మొదటిసారి యెండ్లూరి చిన్నయ్య రాసిన డా.అంబేడ్కర్ జీవిత చరిత్ర గ్రంథ రూపంలో వచ్చింది. ఆ కాలంలోనే అంబేడ్కర్ రచించిన 'ఇన్హిలేషన్ ఆఫ్ క్యాస్ట్' గ్రంథానికి యెండ్లూరి చిన్నయ్య, బోయి భీమన్నల అనువాదాలు వచ్చాయి. ఆ తర్వాత అంబేడ్కర్ జీవితచరిత్రను గ్రంథస్థం చేసినవారిలో బి.విజయభారతి, అమూల్యశ్రీ, బోయ జంగయ్య, పి.అబ్బాయి, ఉదయకీర్తి, బొనిగెల రామారావు, బూతం స్వామి వంటి వారున్నారు.

తెలుగునాట మొదటిసారిగా అంబేడ్కర్‌ను సాహిత్యంలో ప్రస్తావించిన ఘనత మహాకవి గుర్రం జాషువాకే దక్కుతుంది. 1947లో వెలువరించిన ఆయన కావ్యం గబ్బిలంలో 'కలడంబేడ్కరుండు నా సహోదరుడు' పద్యంలో గబ్బిలాన్ని అంబేడ్కర్ దీవెనలు తీసుకోమంటారు. పద్యకావ్యాలు, శతకాలు, గేయాలు, వచన కవితలు, నాటకాలు, బుర్రకథలు, హరికథలు ఒకటేమిటి అన్ని ప్రక్రియల్లోనూ అంబేడ్కర్ ఆవిష్కరించబడ్డారు. బోయి భీమన్న 'నమస్సుల్, డాక్టరంబేడ్కరా?' మకుటంతో సుప్రభాతం, రాపాక ఏకాంబరం 'అంబేడ్కరో! సమరసింహా!', చోడగిరి చంద్రరావు 'భీమరాయ శతకం'



వెలువరించారు. దళిత ఉపాధ్యాయ కవులు మల్లవరపు జాను, జల్లి రాజగోపాలరావు, మల్లవరపు వెంకటరావు, బుంగా ఆడమ్‌బాబు, రాచమల్లు దేవయ్య, తోటకూర జార్జి, పలివెల సుదర్శనరావు, గుర్రం ధర్మోజి, నక్కా అమ్మయ్య, మద్దా సత్యనారాయణ వంటి వారు అంబేడ్కర్‌కు పద్యనీరాజనాలు పలికారు.

భీమన్న 'జయ జయ జయ అంబేడ్కర! జయ దళిత జనస్వర!' గేయం దళితుల జాతీయగీతంగా ప్రసిద్ధికెక్కింది. నీల్ సలామ్ కావ్యంలో 'వ్రాయుటబ్బిన నీ పేరె వ్రాయవలయు' అన్నారు కందిపాటి గోపాలరావు. మాష్టార్జీ గేయం 'అందుకో దండాలు బాబా అంబేడ్కరా! / అంబరాన ఉన్నట్టి సుక్కలు పొడవంగో' ఆల్‌టైమ్ రికార్డు. గోరటి వెంకన్న 'వైతాళికా! ఈ యుగము నీదిరా! బౌద్ధాళికా! ఈ జగము నీదిరా!' అని ఆలాపిస్తే, జయరాజు 'జాగోరే జాగో అంబేడ్కర్/ జగజ్జన నేత అంబేడ్కర్' అని తమ బతుకు ఆశగా వర్ణిస్తారు. పావన ప్రసాద్ 'దేశానికి రక్షణ కవచం / అంబేడ్కర్ తత్త్వం కాదా' అని ప్రశ్నిస్తే, బోయి భీమన్న 'పాటలలో అంబేడ్కరు' పేరుతో ప్రత్యేకంగా ఒక గ్రంథాన్నే ప్రచురించారు.

దళిత సామాజిక సాహిత్యోద్యమాలలో భాగంగా ఎందరో కవులు వేలాది గేయాలను ఆలపించారు. సవేరా, శ్రమశ్రీ, భీమసేన, రాంచందర్, శుక్తి, భీమసేన, లెల్లె సురేశ్, ఉదయ భాస్కర్, నాగబత్తుల గోపాలకృష్ణ వంటి కవులు పదుల సంఖ్యలో అంబేడ్కర్‌కు గేయ హారతి పట్టారు. నగేష్ బాబు, ఖాజా సంపాదకత్వంలో వెలువడిన 'విడి ఆకాశం' కవితా సంకలనానికి 'అంబేడ్కరిస్టు ప్రేమ కవిత్వం' అని ఉపశీర్షిక పెట్టారు. 'అతడు జాతి బువ్వ, అతడు వెలుగుతొవ్వ, అతడు పాలబువ్వ, అతడు నిప్పురవ్వ' అని అంబేడ్కర్ ఏమిటో తెలియజేస్తాడు ఎండ్లూరి సుధాకర్. శిఖామణి అంబేడ్కర్ విగ్రహాన్ని 'శతాబ్దాలుగా ఘనీభవించిన దళితాగ్రహం'గా భావిస్తాడు. అంబేడ్కర్‌ను దళితుల అన్నంగిన్నెతో పోలుస్తారు నేతల ప్రతాప్ కుమార్. 'నీ పురుటి నొప్పులతో రాజ్యాంగాన్ని కాదు/ తరాల స్వప్నాల్ని ప్రసవించావు / నువ్వు మాకు తండ్రివా! తల్లివా' అని అంబేడ్కర్‌లో అమ్మతనాన్ని దర్శిస్తారు కలేకూరి ప్రసాద్. చల్లపల్లి స్వరూప రాణి 'ఇప్పుడు మనువు / అగ్రహారం వీడి / అంబేడ్కర్ కాలనీకొచ్చాడు / బాబా! నాకు పాలను నీళ్ళను వేరు చేసే జ్ఞానాన్నివ్వ'మని వేడుకొంటారు. సతీష్ చందర్, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్, బన్న అయిలయ్య, జి.వి.రత్నాకర్, పైడి తెరేష్‌బాబు, విరియాల లక్ష్మీపతి, కొలకలూరి ఇనాక్... అంబేడ్కర్‌ను కవిత్వంలో ఆవిష్కరించారు.

అంబేడ్కర్ భావజాలంపై అనేక గ్రంథాలు వెలువడ్డాయి. కత్తి పద్మారావు అంబేడ్కర్ జీవిత చరిత్ర పేరుతో బృహత్ గ్రంథాన్ని వెలువరించారు. కె.జి. సత్యమూర్తి 'అంబేడ్కర్ సూర్యుడు' రాశారు. అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టు మూడు దశాబ్దాలకు పైగా అంబేడ్కర్ వర్ధంతి అయిన డిసెంబరు 6న స్మారకోపన్యాసాలు ఏర్పాటుచేసి, వాటిని గ్రంథరూపంలో తెస్తోంది. హైదరాబాద్ బుక్ ట్రస్టు వంటి సంస్థలు అంబేడ్కర్ భావజాలాన్ని అనువాదాల రూపంలో తెలుగులో అందించడం అభినందనీయం. అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుగులో చలనచిత్రంగా రూపొందించిన డాక్టర్ పద్మావతి దళితులకు గొప్ప ఉపకారం చేశారు. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి అంబేడ్కర్ జీవితాన్ని ప్రతిఫలించే భావస్ఫోరకమైన గీతాల్ని అందించారు. సొదా అరుణల 'జాతిపిత అంబేడ్కర్', పాటిబండ్ల ఆనందరావు 'రాజగృహ ప్రవేశం' నాటకాలు రంగస్థలం మీద అటు ప్రయోగానికీ, ఇటు ప్రయోజనానికీ పెద్దపీట వేశాయి. జయభేరి, ప్రజాబంధు, రిపబ్లికన్ జ్యోతి, గబ్బిలం, ఏకలవ్య, నీలిజెండా, బహుజన కెరటాలు, దళిత కిరణాలు, సమాంతర వంటి దళిత పత్రికలు అవి బతికినంతకాలం అంబేడ్కర్ భావజాలాన్ని ప్రచారం చేశాయి. ఈ వ్యాసకర్త 15 సంవత్సరాల క్రితమే 'అంబేడ్కర్ శకం' పేరుతో సేకరించి సంకలించిన దాదాపు 500 పుటల అంబేడ్కర్ పద్య, గేయ, వచన కవితా సంపుటి అముద్రితంగా ఉండిపోయింది. ఒక్కో ప్రక్రియలో ఇలాంటి ఒక్కో బృహత్తర సంపుటి రావలసిన అవసరం ఉంది.

*వ్యాసకర్త కవి, 'కవిసంధ్య' సంపాదకుడు
మొబైల్: 98482 02526*

క్లుప్తంగా...

స్టీల్ ప్లాంట్ కొనుగోలు పేరిట బీఆర్ఎస్ కొత్త డ్రామా

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ కొనుగోలు చేస్తామని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ కొత్త డ్రామాకు తెరతీశాడని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మండిపడ్డారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు మూలధన సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. దీనిపై కేంద్ర మంత్రులకు లేఖలు రాశామన్నారు. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యలు స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేవిగా ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోవడానికి కేసీఆర్ కారణమన్నారు.

మార్గదర్శి కేసులో పారదర్శకంగా దర్యాప్తు

- సీఐడీ అదనపు డీజీ సంజయ్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలికి తీయడమే తమ లక్ష్యమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం మౌన ప్రేక్షకులుగా ఉండరాదని 2011లో ఓ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తిస్తూ చట్టబద్ధ సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం, ఉద్యోగులు నిబంధనల రికార్డులు, డాక్యుమెంట్లు సీఐడీకి అందచేసి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు. గతంలో శ్రీరామ్ చిట్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా తమకు ప్రామాణికమన్నారు.

'ప్రజల దృష్టిని మళ్లించేందుకే విశాఖ ఉక్కుపై ప్రకటన'

సాక్షి, హైదరాబాద్: ఆదానీకి బైలడిల్లా గనుల కేటాయింపు కుట్రను బీఆర్ఎస్ బయట పెట్టిన నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదంటూ కేంద్ర ప్రభుత్వం నామమాత్ర ప్రకటన చేసిందని మంత్రి కేటీ రామారావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు వెంటనే క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌తో పాటు బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు పాతర వేసేలా కేంద్రం కుట్రలు చేసిన తీరును బీఆర్ఎస్ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ జారీ చేసిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌లో పాల్గొంటామని కేసీఆర్ చేసిన ప్రకటన నేపథ్యంలోనే కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. బీఆర్ఎస్ దెబ్బకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం.. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయబోమని ప్రకటించిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఎక్కడైనా పోరాటం చేసేందుకు గులాబీ జెండా సిద్ధంగా ఉందని ప్రకటించారు.


నెల్లూరు నగరంలో పర్యటిస్తూ స్థానిక మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్


కర్నూలులో వెంకటమ్మ ఇంటి ముందు కూర్చొని ఆమె సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


బాపట్ల జిల్లా భట్టిప్రోలులో జరిగిన కార్యక్రమంలో పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

ఇంటింటా ఆదరణ

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ఏడో రోజూ అపూర్వ స్పందన

- ఇచ్చిన హామీల్లో సీఎం జగన్ 98 శాతానికి పైగా అమలుచేశారంటూ ప్రశంసలు
- దేశంలో ఎక్కడాలేని రీతిలో సామాజిక సాధికారతకు బాటలు వేస్తున్నారంటూ అభినందనలు
- 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ముల నినాదాలు
- ప్రజా సర్వేలో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ఆరు రోజుల్లో 40 లక్షల కుటుంబాలకు పైగా మిస్డ్‌కాల్స్


కాకినాడ జిల్లా గోర్సలో మహిళ నుంచి సంక్షేమ పథకాలపై సమాధానాలు రాసుకుంటున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్

సాక్షి, అమరావతి/పెనుకొండ రూరల్ : ఇంటింటా ఘన స్వాగతాలు.. ఆత్మీయ పలకరింపులు.. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదాల మధ్య 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. రాష్ట్రంలో 46 నెలల్లో సీఎం వైఎస్ జగన్ సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మేలును వివరించి.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఏడో రోజుకు చేరుకుంది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కూడిన జగనన్న సైన్యానికి ప్రతి ఇంటా కుటుంబ సభ్యులు ఎదురేగి ఆత్మీయ స్వాగతం పలికారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలుచేయకుండా మోసం చేశారని.. కానీ, సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా ఇప్పటికే అమలుచేశారని అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలు, అన్నదమ్ములు ప్రశంసించారు. ద్రోహానికి చంద్రబాబు మారు పేరైతే.. సీఎం జగన్ విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ అని అక్కాచెల్లెమ్మలు కొనియాడారు. సంక్షేమ పథకాల ద్వారా చేయూతనిస్తూ ఆర్థిక సాధికారత.. అమ్మ ఒడి, విద్యాదీవెన తదితర పథకాల ద్వారా విద్యా సాధికారత.. నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకూ సింహభాగం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి రాజకీయ సాధికారత.. ఆసరా వంటి పథకాలు, పరిపాలనలో భాగస్వామ్యం చేయడం ద్వారా మహిళా సాధికారత తద్వారా సామాజిక సాధికారతకు సీఎం జగన్ బాటలు వేస్తూ.. దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నారంటూ ప్రజలు ప్రశంసించారు.

ప్రభుత్వానికి మద్దతుగా 40 లక్షల మిస్డ్‌కాల్స్..

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ సర్కార్‌కూ వైఎస్ జగన్ ప్రభుత్వానికి మధ్య తేడాలను వివరిస్తూ కుటుంబ సభ్యులకు కరపత్రాన్ని అందిస్తున్నారు. ఆ తర్వాత ప్రజా సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను చదివి.. ఆ కుటుంబ సభ్యుల అభిప్రాయాలను అడుగుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో జగన్ పరిపాలిస్తున్నారని.. మళ్లీ సీఎంగా ఆయన్నే గెలిపిస్తామంటూ తమ అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయిస్తున్నారు. సర్వే పూర్తయ్యాక.. గృహసారథులు ఇచ్చిన రశీదు తీసుకుని.. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960-82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇస్తున్నారు. ఆ తర్వాత వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను అడిగి మరీ తీసుకుని.. తమ ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్‌లకు అతికించుకుని అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఇక జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆరో రోజు ముగిసేసరికి అంటే బుధవారం నాటికి 40 లక్షల కుటుంబాలకు పైగా సీఎం వైఎస్ జగన్ పాలనకు, ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960-82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇచ్చారు.

మా ఇంటికి జగనన్న స్టిక్కర్ వేయండి

'అన్నా... నేను బతుకుదెరువు కోసం కువైట్‌లోని ఖతార్‌లో ఉంటున్నా. అలాగని మా ఇంటికి జగనన్న స్టిక్కర్ వేయకుండా వెళ్లకండి. తప్పకుండా అన్న స్టిక్కర్ మా ఇంటి గోడకు ఉండాలి. రానున్న ఎన్నికల నాటికి నేనూ తప్పకుండా వస్తా. అన్న కోసం మీతో ప్రచారం చేస్తా.. ఆయన పేదల దేవుడు'.. అంటూ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం కొండంపల్లి గ్రామానికి చెందిన గొర్ల మంజుల స్థానిక నేతలను వాట్సాప్ ద్వారా కోరారు. రాష్ట్రంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జోరుగా సాగుతున్న విషయాన్ని ఈ-పేపర్ ద్వారా తెలుసుకున్న ఆమె గురువారం రాత్రి స్థానిక నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ తన ఇంటికీ అతికించాలని కోరారు. ఈ ఆడియో ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది.

– ఖతార్ నుంచి కోరిన మహిళా అభిమాని

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే

- ఆర్ఐఎన్ఎల్‌ను బలోపేతం చేసేలా చర్యలు
- ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసే ప్రక్రియపై దృష్టి
- గనుల సమస్యనూ పరిష్కరిస్తామని హామీ
- ఇలా చెప్పలేదంటూ సాయంత్రానికే మాట మార్చిన మంత్రి
- కార్మిక సంఘాల నేతలు మండిపాటు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు) : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. గురువారం విశాఖ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ కంటే ముందు ఆర్ఐఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పూర్తి సామర్థ్యం మేరకు ప్లాంట్ పని చేసే ప్రక్రియపై దృష్టి సారించామని తెలిపారు. గనుల సమస్యనూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటిపై ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు.

ప్రైవేటీకరణ ఆపడం నా చేతుల్లో లేదు

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లడం లేదని తాను చెప్పలేదని, మరింత బలోపేతం చేస్తామని మాత్రమే చెప్పానని కేంద్ర మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే కొద్ది గంటల వ్యవధిలోనే మాట మార్చారు. గురువారం సాయంత్రం ఆయన నోవోటెల్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం చేసిన ప్రకటనపై మరింత క్లారిటీ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్లాంట్‌ను మరింత బలోపేతం చేస్తామని మాత్రమే మీడియాకు చెప్పానన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చేలా సహకరిస్తామన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో కార్మిక సంఘాల నేతలు సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, సి.హెచ్.నరసింగరావులు మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంత్రికి వినతిపత్రం ఇచ్చామన్నారు.


కేంద్ర మంత్రితో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉక్కు పరరిక్షణ పోరాట కమిటీ సభ్యులు

స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు గనులు కేటాయించాలి

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బొగ్గు గనులను కేటాయించాలని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తేను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్లేందుకు సహకరిస్తామని, గనుల కేటాయింపు విషయం ప్రధాని దృష్టికి తీసుకుని వెళ్తామని మంత్రి చెప్పారని తెలిపారు. ప్రైవేటీకరణపై కేంద్రం కాస్తా వెనక్కు తగ్గినట్లే కనిపిస్తోందని చెప్పారు. ప్లాంట్ లాభాల కోసం మాట్లాడుతుండటం శుభపరిణామమన్నారు. స్టీల్ ప్లాంట్ విషయంపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, సింగరేణి గనుల నుంచి బొగ్గు సరఫరా చేస్తామని ముందుకు వస్తే ప్లాంట్ కొనటానికి వచ్చినట్లు ప్రచారం చేసుకోవటం దారుణమన్నారు. బీజేపీతో గొడవ ఉంటే వారితో నేరుగా తేల్చుకోవాలని, స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయం చేయొద్దన్నారు.

సింగరేణిలో ఆంధ్ర వాటా తేల్చండి

బీఆర్ఎస్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయంగా వినియోగించుకుంటోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ అన్నారు. సింగరేణి గనుల్లో ఆంధ్ర రాష్ట్రానికి వాటా ఉందని, ముందు ఆ వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై బీఆర్ఎస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే పోలవరానికి సహకరించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు.

విచారణకు సహకరించాల్సిందే

- మార్గదర్శి ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు ఆదేశం
- తనిఖీలు ఆపేలా ఉత్తర్వులివ్వలేం
- మీడియాకు వివరాల వెల్లడిపైనా జోక్యం చేసుకోలేం
- విచారణ రెండు వారాలకు వాయిదా

సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారుల విచారణకు మార్గదర్శి ఉద్యోగులు సహకరించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేంద్ర కార్యాలయ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయస్థానం.. తనిఖీలు, విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. మీడియాకు అధికారులు వివరాలు వెల్లడించకుండా కూడా జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మార్గదర్శి కేంద్ర కార్యాలయ ఉద్యోగులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తనిఖీలు ముగిశాక పిటిషనా?

మార్గదర్శి ఉద్యోగులు గురువారం లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోకుండా నిరోధించాలని, తనిఖీలు నిలిపివేసేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విన్నవించారు. అయితే బుధవారం ప్రారంభమైన తనిఖీలు గురువారం ఉదయం 9 గంటలకే ముగిశాయని, అలాంటప్పుడు తనిఖీలు ఆపాలని పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి పేర్కొన్నారు. 'సీఐడీ అధికారుల తనిఖీలు ముగిశాయి. ఏ ఉద్యోగిపైనా చర్యలు తీసుకోలేదు. ఎవరినీ బలవంతపెట్టలేదు.. భయపెట్టలేదు. అరెస్టులు చేయలేదు. చట్టప్రకారమే తనిఖీలు జరిగాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదు. పలువురు బ్రాంచ్ మేనేజర్లకు, బ్రాంచ్ ఉద్యోగులకు నోటీసులిచ్చాం. కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు' అని హైకోర్టుకు నివేదించారు.



విచారణలో జోక్యం వద్దన్న 'సుప్రీం'..

'ఏ-1 రామోజీరావు, ఏ-2 శైలజ సహా పలువురు మేనేజర్లు ముందస్తు బెయిల్ పొందారు. వారిని కనీసం కస్టడీకి తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. చట్టబద్ధమైన సంస్థలు కేసును విచారించే సమయంలో పూర్తి వివరాలను పరిశీలించకుండా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీంకోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చింది. నిహారికా ఇన్‌ఫ్రా. వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుపై విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 438 సీఆర్‌పీసీ కింద ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వకూడదని పేర్కొంది. పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి 'వెకేట్' పిటిషన్ దాఖలు చేసుకోవాలని ప్రతివాదులను ఆదేశించడం సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌లో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి రిలీఫ్ ఉత్తర్వులు ఇవ్వవద్దు' అని గోవింద్‌రెడ్డి అభ్యర్థించారు.

ముందు మీ సంగతి చూసుకోండి

- బీఆర్ఎస్ పేపర్ స్టేట్‌మెంట్లతో వ్యవస్థలు మారిపోవు
- బీఆర్ఎస్ మంత్రుల తీరుపై ఏపీ మంత్రుల మండిపాటు
- శాశ్వత పరిష్కారం కోసం పోరాడుతాం : మంత్రి బొత్స
- అవమానిస్తే తీవ్రంగా స్పందిస్తాం : మంత్రి అప్పలరాజు
- వైఎస్సార్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి : మంత్రి విశ్వరూప్
- సింగరేణిని అమ్మకుండా చూసుకోండి : మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి/వజ్రపుకొత్తూరు/ఏలూరు(మెట్రో) : బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన రెండు పేపర్ స్టేట్‌మెంట్లతోనే విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నుంచి కేంద్రం వెనక్కి తగ్గిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, తెలంగాణ మంత్రులు తొలుత వారి రాష్ట్రం సంగతి చూసుకోవాలని మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి పేర్ని నాని హితవు పలికారు. హరీశ్‌రావు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. ఏపీ గురించి తక్కువ చేసి మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. కొందరు తెలంగాణ మంత్రులు అభ్యంతరకరంగా మాట్లాడుతున్నందున కొంచెం తీవ్రంగానే ప్రతిస్పందించాల్సి వస్తుందని అన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. ముందు సింగరేణి సంగతి చూసుకోవాలని చెప్పారు. గురువారం వారు ఆయా ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

మీ వెర్రికి నా జోహార్లు..

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు మా ప్రభుత్వం మొదటి నుంచీ చిత్తశుద్ధితో పని చేస్తోంది. సమయం వచ్చినప్పుడల్లా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానికి లేఖలు రాస్తూనే ఉన్నారు. కలిసినప్పుడు చెబుతూనే ఉన్నారు. ప్రైవేటీకరణను ఏ విధంగా ఆపుకోవాలో మా ప్రభుత్వానికి తెలుసు. కేంద్ర ప్రభుత్వ ప్రకటన తాత్కాలిక ఉపశమనమే. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు మేము పోరాడుతూనే ఉంటాం. బీఆర్ఎస్ రెండు పేపర్ ప్రకటనలు ఇస్తే కేంద్ర ఆపేసిందా? రెండు స్టేట్‌మెంట్లకు వ్యవస్థలు మారిపోతాయా? వాళ్ల వెర్రికి నా జోహార్లు. స్టీల్ ప్లాంట్ విక్రయానికి పెట్టిన తొలినాళ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనొచ్చని చెప్పినా మేము ముందుకు వెళ్లలేదు. అలా చేస్తే ప్రైవేటీకరణను సమర్థించినట్టు అవుతుందని మా ప్రభుత్వం వ్యతిరేకించింది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఇప్పుడున్న సీట్లను నిలుపుకుంటే పెద్ద గొప్ప. రాష్ట్రానికి చంద్రబాబే పెద్ద క్యాన్సర్ గడ్డ. వచ్చే ఎన్నికల్లోనూ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి



సంయమనంతో వ్యవహరించాలి

బీఆర్ఎస్ మంత్రి టి.హరీశ్ రావు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ఆయన తీరు మార్చుకోవాలి. ఏపీ గురించి తక్కువ చేసి మాట్లాడితే సహించబోం. మా ముఖ్యమంత్రిని ఎవరైనా ఏదైనా అంటే కచ్చితంగా నిలువరించే ప్రయత్నం చేస్తాం. దానికి ఎవరైనా సమాధానం చెప్పి తీరాల్సిందే. ఈ రాష్ట్రం పూర్తి పారదర్శక పాలనలో ఉంది., దేశంలో ఎక్కడా సాధ్యపడని విధంగా ఇక్కడ పాలన సాగుతోంది. హరీశ్‌రావు అదే పనిగా గిల్లుతూ మాట్లాడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మనం ఇరుగు పొరుగు రాష్ట్రాల వాళ్లం. సంయమనంతో వ్యవహరించాలి. అలాంటిది మమ్మల్ని అవమానకరంగా మాట్లాడితే తీవ్రంగా స్పందిస్తాం. సీఎం జగన్ ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలన్నింటితో చక్కటి సంబంధ బాంధవ్యాలు కలిగి ఉన్నారు. ఇప్పటికైనా తెలంగాణ మంత్రులు వారి తీరు మార్చుకుంటే మంచిది.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి



జనం నవ్విపోతారు..



హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, ఎయిర్‌పోర్టు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే వచ్చాయి. దీని ద్వారా హైదరాబాద్‌లో అభివృద్ధి భారీ స్థాయిలో పెరిగింది. గత 40 ఏళ్లుగా అనేక మంది ముఖ్యమంత్రులు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారు. ఇటీవల కాలంలో మాత్రమే భారీగా అభివృద్ధి చెందిందనే మాట వాస్తవం కాదు. తెలంగాణ కన్నా ఎక్కువ ఎయిర్‌పోర్టులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. విశాఖ ఉక్కును వదులుకునేందుకు మేం సిద్ధంగా లేము. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే విశాఖ ఉక్కు కర్మాగారం అంశంలో కేంద్రం దిగి వస్తోంది. ఇందులో బీఆర్ఎస్ ఒత్తిడి ఏమిటి? జనం నవ్విపోతారు. తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న మాటలు హాస్యాస్పదం. మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు అవివేకానికి నిదర్శనం.

– పినిపే విశ్వరూప్, రవాణా శాఖ మంత్రి

'సీమ' ఎత్తిపోతలకు ఎందుకు అడ్డు తగలుతున్నారు?



తెలంగాణ సీఎం కేసీఆర్ భయంతోనే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై కేంద్రం వెనకడుగు వేసిందన్న కేటీఆర్ మాటలను చూస్తుంటే ఉట్టికే ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కుతానన్నట్లుంది. సింగరేణిని కేంద్రం అమ్మేస్తానంటోంది. కేటీఆర్.. ముందు ఆసంగతి చూడండి. రాష్ట్ర ప్రజల మనోభావాలు ముడిపడిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే లాభాల బాటలో నడిపేందుకు నిర్మాణాత్మక సూచనలు చేసింది సీఎం వైఎస్ జగన్ ఒక్కరే. ఆ పరిశ్రమ లాభాల బాటలో నిలపడానికి క్యాప్టివ్ మైన్స్‌ను కేటాయించాలని కోరారు.

హరీష్‌రావు రాజకీయ మేధావి. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన తరహాలోనే కేసీఆర్‌ను ఓ పోటు పొడవాలని హరీష్ చూస్తున్నారు. కేసీఆర్‌తో హరీష్‌రావుకు అంతర్గత తగాదాలు ఉన్నాయి. ఆయన కేసీఆర్‌ను తిట్టలేక.. మమ్మల్ని తిడితే.. మేం కేసీఆర్‌ను తిడతామన్నది హరీష్‌రావు ఎత్తుగడ. నిజంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై కేసీఆర్‌కు, హరీష్‌రావుకు ప్రేమ ఉంటే.. రాయలసీమ ఎత్తిపోతలకు ఎందుకు అడ్డుతగలుతున్నారు?

– మాజీ మంత్రి పేర్ని నాని

అమరావతిలో పేదల ఇళ్ల స్థలాల కేసు.. హైకోర్టుకే వెళ్లండి

- పిటిషన్ ఉపసంహరణకు అనుమతించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన జీఓ నంబరు 45పై హైకోర్టుకే వెళ్లాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ అమరావతి మాస్టర్ ప్లానులో మార్పులు చేస్తూ.. రాజధాని ప్రాంతంలో 1,134 ఎకరాలు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 45ను జారీ చేసింది. దీనిపై కొందరు రైతులు హైకోర్టుకు వెళ్లారు. అక్కడ విచారణలో ఉండగానే ఊట్ల శివయ్య అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. 35 సెంట్లకు సంబంధించి పిటిషనా అని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది శ్యాం దివాన్ వాదనలు వినిపిస్తూ.. 19న విచారణ చేపడతామని హైకోర్టు చెప్పిందని, అయితే ఇదేదో 35 సెంట్ల అంశం కాదని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త రాజధాని కోసం యత్నిస్తోందన్నారు. ఈ దశలో జస్టిస్ బీవీ నాగరత్న జోక్యం చేసుకుని హైకోర్టు ఆర్డర్‌లో తప్పేముందని, ఇది ప్రిలిమినరీ ఆర్డర్ మాత్రమేనని ఇలాంటి అంశాల్లో జోక్యం చేసుకుంటూ పోతే మిగతా కేసుల పరిస్థితేంటని ప్రశ్నించారు. పిటిషన్లు విచారించిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చే అంశంపై 19న విచారణ చేపడతామని చెప్పింది కదా అని జస్టిస్ కేఎం జోసెఫ్ ప్రశ్నించారు. ఈ పిటిషన్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని, పిటిషన్ ఉపసంహరించుకుంటారా అని శ్యాం దివాన్‌ను ప్రశ్నించారు. పిటిషనర్ అంగీకారంతో ధర్మాసనం విచారణ ముగించింది.

మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నదే సీఎం చేశారు..

ఇక సీఆర్‌డీఏ చట్టంలో 53 (1) (డీ) ప్రకారం ఐదు శాతం భూమి పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలని పేర్కొన్నా ఆ మేరకు జోన్‌ను గత ప్రభుత్వం ఏర్పాటుచేయలేదని ఏపీ ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఎం జగన్ పేద ప్రజల గురించి ఆలోచించి ఆ మేరకు జోన్-5ను ఏర్పాటుచేస్తూ మాస్టర్‌ప్లాన్‌లో మార్పులకు పూనుకున్నారన్నారు. గత ప్రభుత్వం పేదల హక్కులను గాలిలో కలిపేసిందని, వారి హక్కులు కాపాడాలని మాత్రమే సీఎం ఆదేశించారన్నారు. ఇక మాస్టర్ ప్లాన్ సవరణ నోటిఫికేషన్‌ను హైకోర్టులో సవాల్ చేయగా 19కు వాయిదా పడిందని.. ఈలోపే సుప్రీంకు వచ్చారని, కానీ హైకోర్టుకే వెళ్లాలని సుప్రీం సూచించిందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాజధాని ప్రాంతంలో పేదలు నివసించకూడదని భావించడం దుర్మార్గమన్నారు.

ఇంకా ఎన్నాళ్లీ విచారణ?

- సీబీఐ న్యాయవాదిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- వివేకా హత్య కేసులో తదుపరి విచారణ 17కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు అయ్యిందని.. ఇంకా ఎన్నాళ్లు విచారిస్తారని సీబీఐని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. హత్య కేసును కూడా ఇన్నాళ్లు సాగదీస్తే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చెప్పినట్లు ఏ-4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున నాగేందర్ వాదనలు వినిపించారు.

కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ..

'గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలం తప్ప కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు. వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఇక్కడే ఉండి.. నా ఫోన్‌ను మరో చోటకు తీసుకుపోతే నేను అక్కడ ఉన్నట్లు కాదు. కాబట్టి గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణనలోకి తీసుకోలేం. ఇలాంటి పరిస్థితిలో వారిని వేధింపులకు గురి చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటికే సీబీఐ వారిని పలుమార్లు విచారణకు పిలిచింది. వారు కూడా పూర్తిగా విచారణకు సహకరించారు. ఎర్ర గంగిరెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ ఇప్పటి వరకు రికార్డు చేయలేదు. సీబీఐ.. దర్యాప్తును ఇంకా సాగదీస్తోంది. కారణం ఏంటో తెలియడం లేదు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలైనా దర్యాప్తు ఆపాలని ఏ ధర్మాసనం చెప్పలేదు. దర్యాప్తు అధికారి కేసును తప్పుదారి పట్టిస్తుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక కిరాయి హంతకుడిని అరెస్టు చేయకుండా బెయిల్‌కు సహకరించిన విచారణను ఏమనాలి? కేవలం కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ సాగుతోంది తప్ప.. సాక్ష్యాలు సేకరించే పని చేయడం లేదు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వైఎస్ భాస్కర్ రెడ్డి, ఇతరులు (నిందితులుగా లేని వారు) పరారీలో ఉన్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదు.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు అని సీబీఐ తరఫు న్యాయవాది నాగేందర్ తెలిపారు. కోర్టులో పిటిషన్ల కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందన్నారు. దర్యాప్తు అధికారికి.. కోర్టు పిటిషన్లతో ఏం సంబంధం.. ఆయన విచారణ కొనసాగించవచ్చు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సుప్రీంకోర్టు.. దర్యాప్తు పూర్తి చేయడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. ఇది హత్య మాత్రమే కాదని.. హత్య ద్వారా లబ్ధి పొందేందుకు కుట్ర జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

కర్ణాటకలో అన్నదమ్ముల సవాల్

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అన్నదమ్ముల మధ్య సవాల్ ఆసక్తిని రేపుతోంది. కర్ణాటక దివంగత ముఖ్యమంత్రి ఎస్. బంగారప్ప కుమారులిద్దరూ మరోసారి పోటీపడుతున్నారు. శివమొగ్గ జిల్లాలోని సొరబ నియోజకవర్గం నుంచి కుమార్ బంగారప్ప బీజేపీ నుంచి, మధు బంగారప్ప కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బంగారప్ప 1967 నుంచి 1994 వరకు సొరబ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. చిట్టచివరి సారిగా ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సొరబ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన కుమార్ బంగారప్ప మరోసారి ఎన్నిక కావాలని తహతహలాడుతున్నారు. 2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు గుడ్ బై కొట్టేసి బీజేపీలో చేరిన కుమార్, అప్పటికే జేడీ(ఎస్) సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన మధుపై 3,286 ఓట్ల తేడాతో నెగ్గారు. 2021లో కాంగ్రెస్‌లో చేరిన మధు బంగారప్ప మరోసారి అదే నియోజకవర్గం బరిలో దిగడంతో అన్నదమ్ముల మధ్య పోరు ఉత్కంఠకు దారి తీస్తోంది.

ఒక్క రోజులో 10వేలకుపైగా..

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ మళ్లీ విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా 10,158 కేసులు నమోదయ్యాయి. ఎనిమిది నెలల తర్వాత ఇదే అత్యధికమని కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం తెలిపింది. యాక్టివ్ కేసులు 44,998కి పెరిగినట్లు వెల్లడించింది. అదేసమయంలో, ఒక్క రోజు వ్యవధిలోనే మరో 19 మంది బాధితులు చనిపోవడంతో మొత్తం కోవిడ్ మరణాలు 5,31,035కు చేరాయంది.

బీబీసీపై ఈడీ కేసు

న్యూఢిల్లీ: బీబీసీ ఇండియాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. విదేశీ నిధుల్ని పొందినప్పుడు ఫెమా నిబంధనల్ని ఉల్లంఘించినట్టుగా ఈడీ ఆరోపించింది. బీబీసీ కార్యాలయంలో ఆదాయ పన్ను శాఖ సర్వే నిర్వహించిన రెండు నెలల తర్వాత ఈ కేసు నమోదైంది. బీబీసీకి ప్రవాసుల నుంచి అందుతున్న నిధులపై బీబీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటికి సంబంధించిన లావాదేవీలన్నింటినీ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డీఐ) కింద కేసుని విచారించాల్సిన అవసరం ఉందని ఈడీ అధికారులు చెప్పారు. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద ఆర్థిక లావాదేవీలన్నీ సమర్పించాలని ఆదేశించినట్టుగా వెల్లడించారు. బీబీసీలో కొందరు ఉద్యోగుల్ని ప్రశ్నించారు. బీబీసీ డిప్యూటీ మేనేజింగ్ ఎడిటర్ గురువారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. గుజరాత్ మత ఘర్షణల్లో ప్రధాని మోదీని దోషిగా ఆరోపిస్తూ 'ఇండియా ది మోదీ క్వశ్చన్' పేరుతో బీబీసీ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే ఆ సంస్థలో ఆదాయపన్ను శాఖ సర్వే నిర్వహించడం రాజకీయ దుమారానికి దారి తీసింది.

అత్యంత కరడుగట్టిన నేరగాడు అతీక్ అహ్మద్

కిడ్నాప్‌లు, బెదిరింపులు, వసూళ్లతో ప్రస్థానం ఆరంభం

బినామీ కాంట్రాక్టులు, వ్యాపారాలతో రూ. వందల కోట్ల ఆర్థిక సామ్రాజ్యం

మాఫియా-బాహుబలిగా అలహాబాద్‌లో సమాంతర పాలన

ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక

కుమారుడు అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌తో మళ్లీ తెరపైకి అతీక్ పేరు

మాఫియా డాన్, గ్యాంగ్ లీడర్, హిస్టరీ షీటర్, రౌడీ షీటర్, మాఫియా–బాహుబలి, దబాంగ్, పొలిటికల్ లీడర్.. ఇవన్నీ ఒకే వ్యక్తికి పర్యాయ పదాలు. ఆ ఒక్కడే అతీక్ అహ్మద్. ఉత్తరప్రదేశ్‌లో అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అతడి తండ్రి అతీక్ అహ్మద్ పేరు మళ్లీ ప్రముఖంగా చర్చల్లోకి వచ్చింది. నిరుపేద టాంగావాలా కుమారుడైన అతీక్ అహ్మద్ రౌడీయిజంలో, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగాడు. రూ.వందల కోట్ల విలువైన ఆర్థిక సామ్రాజ్యం నిర్మించుకున్నాడు. దివంగత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మించిన అలహాబాద్(ప్రయాగ్‌రాజ్)ను అతీక్ అహ్మద్ సొంత జాగీరుగా మార్చేసుకొని, సమాంతర పాలన సాగించాడంటే అతడి హవా ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. వందకుపైగా కేసులు నమోదైనప్పటికీ.. ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసు మినహా ఏ కేసులోనూ అతీక్‌కు శిక్ష పడలేదు. వ్యవస్థ మొత్తం అతడికి దాసోహమైందని, నిస్సిగ్గుగా ఊడిగం చేసిందని ప్రత్యర్థులు విమర్శిస్తూ ఉంటారు. నేరాల నుంచి వ్యాపారాలు, వ్యాపారాల నుంచి రాజకీయాలు.. ఇలా సాగింది అతీక్ ప్రస్థానం. నేరాలను, అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి, శిక్షల నుంచి తప్పించుకోవడానికి రాజకీయాలను రక్షణ కవచంగా వాడుకున్నాడు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

క్రిమినల్ కథా చిత్రమ్



18 ఏళ్ల వయసులో తొలి ఎఫ్ఐఆర్

➤ అతీక్ అహ్మద్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జన్మించాడు. టాంగా నడిపే అతడి తండ్రి హాజీ ఫిరోజ్ నేరస్వభావం ఉన్నవాడే. అతీక్ బాల్యంలో కటిక పేదరికం అనుభవించాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న కసితో నేరమార్గం ఎంచుకున్నాడు. స్నేహితులతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. కిడ్నాప్‌లు, బెదిరింపులు, బలవంతపు వసూళ్లతో చెలరేగిపోయాడు. 1983లో 18 ఏళ్ల వయసున్నప్పుడు అతీక్‌పై మొదటి ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. అతడిని అదుపులోకి తీసుకొనేందుకు పోలీసులు విసిరిన వల నుంచి చాలాసార్లు తప్పించుకున్నాడు. అతీక్‌పై నమోదైన కేసులను విచారించాలంటే న్యాయమూర్తులు వెనుకంజ వేసేవారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన 10 మంది జడ్జీలు తమంతట తామే ఈ కేసుల విచారణ నుంచి తప్పుకున్నారు. అతీక్ చంపేస్తాడన్న భయమే ఇందుకు కారణం. యూపీలో యోగి ఆదిత్యనాథ్ పాలన మొదలయ్యాక కూడా ప్రత్యర్థులను కిడ్నాప్ చేసి, తానున్న జైలుకు రప్పించి, తీవ్రంగా హింసించాడు. అతడిని ఉత్తరప్రదేశ్ జైళ్లలో కాకుండా ఇతర రాష్ట్రాల్లోని జైళ్లలో ఉంచాలని నాలుగేళ్ల క్రితం సుప్రీంకోర్టు ఆదేశించింది.

కుటుంబం.. నేరమయం

➤ ఉమేశ్ పాల్ హత్య కేసులో నిందితుడైన అతీక్ కుమారుడు అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌లో హతం కావడం దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. కరడుగట్టిన నేరగాడైన అతీక్ అహ్మద్ కుటుంబ సభ్యులు సైతం నేరాలబాట పట్టినవారే కావడం గమనార్హం. కొందరు ఇప్పటికే వేర్వేరు కేసుల్లో జైలుపాలయ్యారు. అతడి భార్య మాత్రం పరారీలో ఉన్నారు.

➤ నేర సామ్రాజ్యాధినేతగా ఎదిగిన అతీక్ అహ్మద్ కన్ను 1980వ దశకంలో రాజకీయాలపై పడింది. 1989లో యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో అలహాబాద్ వెస్ట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. మతం కార్డు వాడుకున్నాడు. తన ప్రత్యర్థి చాంద్‌బాబాను హత్య చేశాడు. సులువుగా విజయం సాధించాడు.

ఎమ్మెల్యేగా, ఎంపీగా..

తొలిసారి ఎమ్మెల్యే హోదా సంపాదించాడు. ఆ తర్వాత అదే స్థానం నుంచి 1991, 1993లోనూ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందాడు. 1996లో సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌తో, 2002 ఆప్నా దళ్ టికెట్‌తో గెలిచాడు. 2002లో ఆప్నా దళ్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడయ్యాడు. హెలికాప్టర్లలో తిరుగుతూ రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలు చేశాడు. 2004లో మళ్లీ సమాజ్‌వాదీ పార్టీలో చేరాడు. ఆ పార్టీ తరపున ఫూల్పూర్ ఎంపీగా ఘన విజయం సాధించాడు. పార్లమెంట్‌లో అడుగుపెట్టాడు. మొత్తం ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందాడు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత కూడా నేరాలు ఆపలేదు. మరింత రాటుదేలాడు. బినామీల పేరిట కాంట్రాక్టులు దక్కించుకున్నాడు. ఇతర కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు వసూలు చేసేవాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడు. అడ్డొచ్చిన వారిని అంతం చేశాడు. భారీగా ఆస్తులు కూడబెట్టాడు. దేశవ్యాప్తంగా పదికిపైగా రాష్ట్రాలకు అతీక్ నేరసామ్రాజ్యం విస్తరించింది. అచ్చంగా సినిమాల్లో చూపించే డాన్ల తరహాలోనే అతడి వ్యవహార శైలి, ప్రవర్తన ఉండేవి. తరచుగా గుర్రంపై వీధుల్లో తిరిగేవాడు. కొన్నిసార్లు ఖరీదైన కార్ల కాన్వాయ్ వెంటరాగా పాదయాత్ర చేస్తుండేవాడు.

రాజుపాల్ హత్య కేసు

➤ 2005 జనవరి 25న ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఎమ్మెల్యే రాజుపాల్ హత్యతో అతీక్ పతనం ప్రారంభమైంది. ఈ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేశాడు. కానీ, ఓటమే ఎదురయ్యింది. 2004లో ఎంపీగా గెలిచాక తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాడు. ఉప ఎన్నికల్లో తన సోదరుడు అజీమ్‌కు సమాజ్‌వాదీ పార్టీ టికెట్ ఇప్పించుకున్నాడు. ఈ స్థానంలో నేరచరిత్ర ఉన్న రాజుపాల్‌కు బీఎస్పీ టికెట్ ఇచ్చింది. ఎన్నికల్లో అజీమ్ ఓడిపోయాడు. రాజుపాల్ ఎమ్మెల్యే అయ్యాడు. తర్వాత రాజుపాల్ హత్య జరిగింది. ఈ కేసులో అతీక్, అజీమ్ నిందితులు. రాజుపాల్ హత్యతో మళ్లీ ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై అజీమ్ గెలిచాడు. అతీక్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయాడు.

అసద్ అహ్మద్

➤ ఉమేశ్‌పాల్ మర్డర్ కేసులో అసద్ అహ్మద్ నిందితుడు. చాలా రోజులు పోలీసుల కళ్లుగప్పి తిరిగాడు.
➤ అతడిపై రూ.5 లక్షల రివార్డు ఉంది.
➤ గురువారం ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన కాల్పుల్లో మరో నిందితుడు గులామ్‌తోపాటు మరణించాడు.
➤ అతీక్ అహ్మద్ మరో ఇద్దరు కుమారులైన అజాన్, అబాన్ మైనర్లు. వారు ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైల్డ్ ప్రొటెక్షన్ హోంలో ఉన్నారు.

అతీక్ అహ్మద్

➤ గత 43 ఏళ్లుగా పోలీసు రికార్డుల్లో కొనసాగుతున్నాడు. ఇప్పటికే 100కుపైగా కేసులు నమోదయ్యాయి.
➤ ఉమేశ్‌పాల్ అపహరణ కేసులో అతీక్ అహ్మద్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది.
➤ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతీ జైలులో ఉన్నాడు.
➤ అతీక్ అహ్మద్ 1996లో షాయిస్తా పర్వీన్‌ను వివాహం చేసుకున్నాడు.
➤ వారికి ఐదుగురు కుమారులు.. అలీ అహ్మద్, ఉమర్ అహ్మద్, అసద్ అహ్మద్, అజాన్ అహ్మద్, అబాన్ అహ్మద్ ఉన్నారు.
➤ పాకిస్తాన్ ఉగ్రవాదులతో, అక్కడి నిఘా సంస్థ ఐఎస్ఐతో అతీక్ అహ్మద్‌కు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు గతంలో వెల్లువెత్తాయి.

అష్రాఫ్ అలియాస్ అజీమ్ అహ్మద్

➤ అతీక్ అహ్మద్ సోదరుడే అష్రాఫ్/అజీమ్ అహ్మద్.
➤ ఇతడిపై మొత్తం 52 కేసులు ఉన్నాయి. ఒకసారి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందాడు.
➤ 2006 నాటి ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసులో ఇతడిని ప్రయాగ్‌రాజ్ కోర్టు దోషిగా తేల్చింది.
➤ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

షాయిస్తా పర్వీన్

➤ ఉమేశ్ పాల్ హత్య వ్యవహారంలో అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్‌తోపాటు షాయిస్తా పర్వీన్‌పై కేసు నమోదయ్యింది.
➤ పరారీలో ఉన్న పర్వీన్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు రివార్డు ప్రకటించారు.
➤ ఆమె ఆచూకీ ఇంకా దొరక్కపోవడంతో రివార్డు మొత్తాన్ని రూ.25,000 నుంచి రూ.50,000కు పెంచారు.

అలీ అహ్మద్

➤ బలవంతంగా డబ్బు వసూళ్లకు పాల్పడిన కేసులో 2021లో అలీ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపించారు.
➤ ఉమేశ్‌పాల్ హత్య కేసులోనూ అతడి పేరు తెరపైకి వచ్చింది.
➤ అలీ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ఏడాది మార్చి 3న అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. ఇప్పుడు లక్నో జైలులో ఉన్నాడు.
➤ అలీ అహ్మద్ లాంటి నేరగాళ్లు బయట ఉంటే కేవలం సాక్షులకే కాదు, సమాజానికి సైతం ముప్పేనని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఉమర్ అహ్మద్

➤ లక్నోకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైస్వాల్ కిడ్నాప్, దాడి కేసులో అతీక్ అహ్మద్‌తోపాటు ఉమర్ అహ్మద్‌పై 2018 ఎఫ్ఐఆర్ నమోదయ్యింది.
➤ అదే కేసులో ఉమర్ అహ్మద్ ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లోని నైనీ సెంట్రల్ జైలులో ఉన్నాడు.

అతీక్‌కు ఐఎస్ఐ, లష్కరేతో లింకులు

ప్రయాగ్‌రాజ్: ఉమేశ్‌పాల్ హత్యకేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతీక్ అహ్మద్‌కు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఉగ్రవాద లష్కరే తోయిబాతో సంబంధాలున్నాయని పోలీసులు తెలిపారు. గురువారం యూపీ పోలీసులు అతీక్ అహ్మద్‌ను, అతడి సోదరుడు అష్రాఫ్‌ను భారీ బందోబస్తు నడుమ ప్రయాగ్‌రాజ్‌లోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. 'నాకు ఆయుధాలు, డబ్బుకు కొదవలేదు. పాక్ నుంచి డ్రోన్ల ద్వారా సరిహద్దుల్లో పంజాబ్‌కు ఆయుధాలు, డబ్బు చేరుతాయి. అక్కడ మా వాళ్లు వాటిని అందుకుంటారు. కశ్మీర్ ఉగ్రవాదులు కూడా తీసుకెళతారు. కావాలంటే మీరు నన్ను అక్కడికి తీసుకెళ్తే డబ్బు, ఆయుధాలు అందజేస్తా' అంటూ అతీక్ అహ్మద్ విచారణలో వెల్లడించిన విషయాలను యూపీ పోలీసులు ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. రెండు గంటలపాటు సాగిన వాదోపవాదాల అనంతరం అతీక్, అష్రాఫ్‌లిద్దరికీ ఈనెల 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి, ఐదు రోజుల పోలీసు రిమాండ్‌కు అనుమతిస్తూ మేజిస్ట్రేట్ దినేశ్ గౌతమ్ ఆదేశాలిచ్చారని ఉమేశ్ పాల్ భార్య తరఫు లాయర్ చెప్పారు. ఇద్దరినీ రిమాండ్ పూర్తయ్యేదాకా ప్రస్తుతమున్న సబర్మతీ, బరేలీ జైళ్లలోనే ఉంచుతారన్నారు.

మరీ ఇంత పెద్ద శిక్షా ?

- నేర నిరూపణ విధానం సరిగా లేదు
- పరువు నష్టం కేసులో కోర్టు ఎదుట రాహుల్ లాయర్ల వాదన

సూరత్: మోదీ ఇంటి పేరును అనుచితంగా వాడారనే పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష, ఎంపీగా అనర్హత వేటును ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తరఫున ఆయన న్యాయవాదులు గురువారం సూరత్ కోర్టులో వాదనలు వినిపించారు. 'నేర నిరూపణ విధానం సవ్యంగా లేదు. ఈ కేసులో ట్రయల్ కోర్టు జడ్జి అసమతుల్య సాక్ష్యాధారాలను ఆధారం చేసుకుని తీర్పు చెప్పారు. ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో మొత్తం కేసు ఆధారపడింది. రాఫెల్ కేసులో రాహుల్ చెప్పిన బేషరతు క్షమాపణ అంశాన్ని ఈ కేసుకు సంబంధంలేకున్నా ఇందులో జతచేశారు. మరీ ఇంత పెద్ద శిక్షా ?. ఈ కేసులో గరిష్ట శిక్షను అమలుచేయాల్సిన అవసరం లేదు' అని అదనపు సెషన్స్ జడ్జి ఆర్‌పీ మొగెరా ముందు రాహుల్ లాయర్ ఆర్ఎస్ చీమా వాదించారు. శిక్షను నిలుపుదల చేయాలని కోరారు. 'దొంగలందరి ఇంటి పేరు మోదీ అనే ఎందుకుంది? అనే ప్రసంగం చేసే నాటికి రాహుల్ దేశంలోనే రెండో అతిపెద్ద పార్టీకి అధ్యక్షునిగా ఉన్నారు. దేశ ప్రజలపై ఆయన ప్రసంగ ప్రభావం చాలా ఎక్కువ ఉంటుంది. ప్రసంగాన్ని సంచలనం చేయాలనేది ఆయన ఉద్దేశ్యం. ఇలాంటి పరువునష్టం కేసులు ఆయన వేర్వేరు చోట్ల చాలా ఎదుర్కొంటున్నారు. రాఫెల్ కేసులో అనుచిత వ్యాఖ్యలు, ఆనక క్షమాపణల తర్వాతా ఆయన ఇలాంటి ప్రసంగాలు చేశారు' అని పరువునష్టం కేసు వేసిన పూర్ణేశ్ మోదీ తరఫు లాయర్ హర్షిత్ తోలియా వాదించారు. తర్వాత జడ్జి తీర్పును 20వ తేదీకి వాయిదావేశారు.

యూపీలో పోలీసు ఎన్‌కౌంటర్

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్ హతం ● సహాయకుడు గులామ్ సైతం..


ఘటనాస్థలిలో అసద్, గులామ్ మృతదేహాలు

లక్నో/ఝాన్సీ: ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను పోలీసులు ఎదురుకాల్పుల్లో మట్టుబెట్టారు. అసద్‌తోపాటు అతని సహాయకుడు గులామ్ పోలీసుల తూటాలకు హతమయ్యాడు. ఝాన్సీ పట్టణం సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.

మారువేషం.. 42 రౌండ్ల కాల్పులు..

నాటి బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్యకేసులో ప్రత్యక్ష సాక్షి ఉమేశ్ పాల్‌ను హత్య చేశాక అసద్, గులామ్‌లు లక్నోకు, తర్వాత కాన్పూర్‌కు పారిపోయారు. ఆ తర్వాత మీరట్‌కు చివరకు ఢిల్లీకి చేరుకుని 15 రోజులు అక్కడే ఉన్నారు. తర్వాత అజ్మీర్‌కు వెళ్లారు. ఇక మధ్యప్రదేశ్‌లో దాక్కుందామని నిర్ణయించుకుని బయల్దేరారు. అసద్ గ్యాంగ్‌లో ఇన్‌ఫార్మర్‌ను నియమించుకున్న పోలీసులు అసద్ ఎక్కడెక్కడికి వెళ్తున్నాడనేది ఓ కన్నేసి ఉంచారు. ఝాన్సీ పట్టణం మీదుగా మారువేషంలో అసద్ వెళ్తున్నాడని తెల్సి ఇద్దరు డీఎస్పీలుసహా 12 మందితో యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం రాష్ట్ర సరిహద్దుల్లో మాటువేసింది. ఝాన్సీ దగ్గర్లోని బబీనా మార్గంలో బైక్‌పై వెళ్తుండగా హఠాత్తుగా పోలీసులు కంటబడి చుట్టుముట్టేసరికి కాల్పులు జరిపి పారిపోబోయారు. దీంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరూ అక్కడే హతమయ్యారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 42 రౌండ్ల కాల్పులు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. చనిపోయిన వారిపై తలో రూ.5 లక్షల రివార్డ్ ఉంది. 'ఘటనాస్థలిలో అత్యాధునిక విదేశీ ఆయుధాలు బ్రిటిష్ బుల్‌డాగ్ రివాల్వర్, .455 బోర్, వాల్టర్ బోర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నాం' అని ఉత్తరప్రదేశ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్(శాంతిభద్రతలు) ప్రశాంత్ చెప్పారు. ఉమేశ్ హత్య కేసులో అతీక్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని కోర్టులో హాజరుపరిచిన రోజే అసద్ మరణించడం గమనార్హం.

నకిలీ ఎన్‌కౌంటర్ అంటూ ఎస్పీ, బీఎస్పీ ఆరోపణలు

ఈ నకిలీ ఎన్‌కౌంటర్‌లో నిజాలు బయటకురావాలంటే సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్‌సమాజ్ పార్టీలు డిమాండ్‌చేశాయి. ప్రజా సమస్యల నుంచి అందరి దృష్టి మరల్చేందుకే యోగి సర్కార్ ఇలా ఎన్‌కౌంటర్ల పర్వానికి తెరలేపిందని ఆరోపించాయి. ఇది మరో వికాస్ దూబే ఘటన అని బీఎస్పీ చీఫ్ మాయావతి వ్యాఖ్యానించారు.

ఎవరీ అసద్ ?

రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడే ఈ అసద్ అహ్మద్. 2004లో అలహాబాద్(పశ్చిమ) నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా అతీక్ తన సోదరుడు అష్రాఫ్‌ను బరిలోకి దింపాడు. అయితే ఆ ఉప ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి అయిన రాజుపాల్ అనూహ్యంగా విజయం సాధించారు. తమ్ముడి ఓటమిని తట్టుకోలేక ఆగ్రహంతో అతీక్ 2005లో ఎమ్మెల్యే రాజుపాల్‌ను తన సహచరులతో కలిసి హత్యచేయించారు. ఈ హత్యకు న్యాయవాది ఉమేశ్ పాల్ ప్రత్యక్ష సాక్షి. దీంతో ఉమేశ్‌పాల్, ఇద్దరు గన్‌మెన్‌లను అతీక్ కుమారుడు అసద్ అనుచరులు ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన పట్టపగలు దారుణంగా హత్య చేశారు. అప్పటి నుంచి అసద్, గులామ్ పరారీలో ఉన్నారు. అసద్ ఎన్‌కౌంటర్ వార్త తెల్సి సంతోషంతో ఉమేశ్ పాల్ కుటుంబసభ్యులు సీఎం యోగి ఆదిత్యనాథ్, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ ఎన్‌కౌంటర్ నా కుమారుడికి ఘన నివాళి' అని ఉమేశ్ పాల్ తల్లి శాంతీదేవి మీడియా ముందు వ్యాఖ్యానించారు.


కోర్టు హాలులో అతీక్, అష్రాఫ్

అంతా నావల్లే: తండ్రి పశ్చాత్తాపం!

కోర్టుకు హాజరైనపుడు అసద్ మరణవార్త తెల్సి తండ్రి అతీక్ విపరీతంగా ఏడ్చినట్లు సమాచారం. 'ఇదంతా నావల్లే జరిగింది. కొడుకు చావుకు నేనే కారణం. కడసారి చూసుకునేందుకు అంత్యక్రియల్లో పాల్గొంటా. అందుకు అనుమతి ఇవ్వండి. ఈ కేసులో నా కుటుంబసభ్యులను ఇకనైనా వేధించడం ఆపండి' అని ఉన్నతాధికారులను అతీక్ వేడుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, కోర్టులో హాజరుపరిచేందుకు అతీక్‌ను తీసుకొచ్చే మార్గమధ్యంలో పోలీసు వాహన శ్రేణిపై దాడి చేసి తండ్రిని విడిపించుకోవాలని అసద్ ప్రణాళిక వేశాడని పోలీసు అధికారి ప్రశాంత్ చెప్పారు.

భారత వ్యతిరేక శక్తులపై గట్టి చర్యలు తీసుకోండి

రిషి సునాక్‌ను కోరిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ గురువారం బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ యూకేలో దౌత్య కార్యాలయాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్తానీ అనుకూలవాదులు కొందరు ఇటీవల లండన్‌లో భారత దౌత్య కార్యాలయంపై దాడికి దిగడం, భారత జాతీయ పతాకాన్ని అవమానించిన ఘటనలను ఈ సందర్భంగా రిషి సునాక్‌తో ప్రస్తావించారు. భారత వ్యతిరేక శక్తులపై గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, ఆర్థిక నేరస్తులను భారత్‌కు తిరిగి అప్పగించేందుకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఇద్దరు నేతలు పలు ద్వైపాక్షిక అంశాలు, ముఖ్యంగా వాణిజ్యం, ఆర్థిక రంగాల పురోగతిని సమీక్షించారని అధికారులు తెలిపారు.

విపక్షాల ఐక్యతా యత్నాలు

న్యూఢిల్లీ: 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాల ఐక్యతకు వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ గురువారం సీపీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజాతో సమావేశమయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోనూ నితీశ్ కుమార్ భేటీ అయ్యారు. విపక్షాల ఐక్యత, తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మరిన్ని సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. అతిత్వరలో వివిధ పార్టీల అగ్రనేతలతో కీలక భేటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. విపక్షాలు రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాటు చేసుకోవాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి అన్నారు. దేశంలో మూడో కూటమి సాధ్యమేనని ఉద్ఘాటించారు. అయితే, ఈ కూటమి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఏర్పడే అవకాశం ఉందన్నారు. దేశాన్ని, దేశ ప్రజల జీవితాలను కాపాడాలంటే బీజేపీని ఓడించాల్సిందేనని సీతారం ఏచూరి ట్వీట్ చేశారు. బీజేపీ అరాచక పాలనతో దేశ ప్రజలంతా విసుగెత్తిపోయారని డి.రాజా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

కొత్తరకం క్షిపణిని పరీక్షించిన ఉ.కొరియా

సియోల్: ఉత్తరకొరియా రెచ్చగొట్టే ఆయుధ పరీక్షల పరంపరను కొనసాగిస్తోంది. గురువారం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. ఇది మరింత శక్తివంతం, గుర్తించడానికి కష్టతరమైనదని పొరుగుదేశాలు అనుమానిస్తున్నాయి. క్షిపణి ప్రయోగం నేపథ్యంలో పొరుగు దేశం జపాన్ తమ హక్కైడో దీవి వాసులను షెల్టర్లలోకి వెళ్లిపోవాలంటూ అప్రమత్తం చేసింది. రాజధాని ప్యాంగ్‌యాంగ్ నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొరియా ద్వీపకల్పం, జపాన్ మధ్య సముద్రజలాల్లో పడిపోయినట్లు జపాన్ సైన్యం ప్రకటించింది. ఇది దీర్ఘశ్రేణి క్షిపణి అయి ఉంటుందని తెలిపింది. ఘన ఇంధనం కలిగిన ఈ క్షిపణి కొత్తరకానిది అయి ఉంటుందని దక్షిణకొరియా సైన్యం అంటోంది.

కర్ణాటక బీజేపీలో కొనసాగుతున్న అసమ్మతి

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విడుదల చేసిన రెండో జాబితాలో ఏకంగా ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించింది. అవినీతి ఆరోపణల్లో ఇటీవల అరెస్టయిన విరూపాక్ష సహా ఏడుగురు సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వకుండా కొత్త వారికి అవకాశం కల్పిస్తూ 23 మందితో రెండో జాబితాను విడుదల చేసింది. దీంతో మొత్తంగా 212 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. రెండో జాబితాలో కూడా సిట్టింగ్‌లకు చోటు కల్పించకపోవడంతో పార్టీలో అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. ముదిగెరె ఎమ్మెల్యే ఎం.పి. కుమారస్వామి, హావేరి ఎమ్మెల్యే నెహ్రూ ఒలేకర్ పార్టీకి గుడ్ బై కొట్టారు.

సరికొత్తగా భారత్: మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త విధానాలు, కొత్త వ్యూహాలతో కొత్త భారత్ ఆవిష్కృతం దిశగా పరుగులు తీస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాలలో తమ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు ఈ రంగాల్ని విస్మరిస్తే తాము వాటి సహకారంతో కొత్త భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గురువారం జరిగిన రోజ్‌గార్ మేళానుద్దేశించి ప్రధాని వీడియో ద్వారా ప్రసంగించారు. తమ ప్రభుత్వ విధానాలతో దేశంలో యువతకు కొత్త అవకాశాలు కలిసొస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా 71, 506 మందికి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. దేశంలో స్టార్టప్ సెక్టార్‌ని ప్రధాని మోదీ కొనియాడారు. మన దేశంలో స్టార్టప్‌ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. రూ.23 లక్షల కోట్ల బ్యాంక్ గ్యారంటీ రుణాలతో ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఎనిమిది కోట్ల మందికి పైగా కొత్త వ్యాపారాలను ప్రారంభించారని చెప్పారు. సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని చెప్పారు. ప్రజలందరికీ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించినప్పుడే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వల్ప రుణాలతో దేశం ఆర్థికంగా క్షేత్ర స్థాయి నుంచి బలోపేతమవుతుందని ప్రధాని చెప్పారు. కాగా, రైల్వే శాఖలో మూడు లక్షలకు పైగా ఖాళీలు ఉంటే మోదీ 50 వేల అపాయింట్‌మెంట్ లెటర్స్‌ని పంచి పెట్టి చేతులు దులుపుకుంటూ తమాషా చూస్తోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

కశ్మీర్‌లో పాక్ డ్రోన్ కూల్చివేత

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ)కు సమీపంలో పాకిస్తాన్‌కు చెందిన డ్రోన్‌ను భద్రతా దళాలు కూల్చివేశాయి. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి దాటాక సుందర్‌బని సెక్టార్‌లోని భారత భూభాగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రోన్‌కున్న ప్యాకేజీలోని మందుగుండుసామగ్రి, రూ.2 లక్షల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మీ తెలిపింది. మరికొన్ని డ్రోన్లు కూడా ఇటువంటి మందుగుండు సామగ్రిని, ఇతర ఆయుధాలను జారవిడిచి వెళ్లి ఉంటాయనే అనుమానంతో ఆ ప్రాంతంలో సైన్యం తనిఖీలు ముమ్మరం చేసింది. అంతర్జాతీయ సరిహద్దులు, నియంత్రణ రేఖ వెంబడి పాక్ వైపు నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్, పేలుడు సామగ్రిని దొంగచాటుగా చేరవేస్తున్న ఘటనలు భారత బలగాలకు పెనుసవాల్‌గా మారాయి.

ఐటీ రూల్స్‌లో సవరణలు ఉపసంహరించండి

కేంద్ర ప్రభుత్వానికి ఐఎన్ఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఐటీ నిబంధనల్లో తీసుకొచ్చిన సవరణలను ఉపసంహరించుకోవాలని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ(ఐఎన్ఎస్) అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భాగస్వామ్యపక్షాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే సవరణలను ఈ నెల 6న నోటిఫై చేశారని పేర్కొన్నారు. ఏది నిజమో, ఏది నకిలీనో గుర్తించే అధికారాన్ని ఈ సవరణలు ప్రభావితం చేస్తాయని వెల్లడించారు. ఇప్పటిదాకా ఇలాంటి సంపూర్ణ అధికారం ప్రభుత్వానికి, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీ ఐఎన్ఎస్‌కు ఉందని గుర్తుచేశారు. మీడియా వృత్తి, విశ్వసనీయతతో ముడిపడి ఉన్న ఏ అంశంపై అయినా నోటిఫికేషన్ జారీ చేసే ముందు మీడియా సంస్థలు, విలేకరుల సంఘాలతో విస్తృత, అర్థవంతమైన సంప్రదింపులు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిజ నిర్ధారణ కోసం ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు? న్యాయ సహాయం కోరవచ్చా? అప్పీల్ చేసే హక్కు ఉంటుందా? తదితర కీలక అంశాలను నోటిఫైడ్ రూల్స్‌లో ప్రస్తావించలేదని కేఆర్‌పీ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది జనవరిలో బహిర్గతం చేసిన ముసాయిదా సవరణల కంటే ఈ నెల 6న నోటిఫై చేసిన కొత్త ఐటీ రూల్స్ ఏమాత్రం భిన్నంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. భాగస్వామ్య పక్షాలతో చర్చించకుండా ఐటీ రూల్స్‌లో సవరణలు చేయడం సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుందని ఐఎన్ఎస్ సెక్రెటరీ జనరల్ మేరీ పాల్ స్పష్టం చేశారు. సవరణలు నోటిఫై చేసే ముందు మీడియా సంస్థలతో చర్చల కోసం కేంద్ర సమాచార, ప్రసార శాఖ కనీసం ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు.


గిన్నిస్ డ్యాన్స్.. ఒకేసారి బిహూ నృత్యం చేస్తూ, డోలు వాయించి కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించిన 11,304 మంది కళాకారులు. గురువారం గువాహటిలో తీసిందీ ఫొటో.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



సంధ్యాకాంతి
సంధ్యా సమయంలో స్వర్ణ శోభితమైన తటాకం. అందులో బాతుల విహారం. గురువారం సాయంత్రం ధార్వాడలో ఓ చెరువు సౌందర్యం

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు : సీఎం

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీకి 60 నుంచి 65 చోట్ల సమర్థత కలిగిన అభ్యర్థులే లేరని, అందుకే 165 మంది అభ్యర్థులను ప్రకటించి మిగతా నిలుపుదల చేశారని సీఎం బసవరాజ బొమ్మై ఎద్దేవా చేశారు. గురువారం మంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు మూడో జాబితాను విడుదల చేయలేదన్నారు. ఆరంభంలో శూరత్వం చూపారు, తరువాత జాబితా విడుదల చేయటానికి సాధ్యపడలేదు, బీజేపీ నుంచి ఎవరైనా వస్తారా అని చూస్తున్నారన్నారు. బీజేపీ 12 నియోజకవర్గాలను మినహాయించి మిగతా అన్నిచోట్ల అభ్యర్థులను ప్రకటించామన్నారు. బీజేపీలో టికెట్ రాని వారు కొందరు అసంతృప్తితో రాజీనామాలు చేశారు, మాజీ మంత్రి లక్ష్మణ సవదికి నచ్చజెప్పేందుకు సమయం కావాలి. ఆయన నాకంటే సీనియర్, త్వరలో అన్నీ సర్దుకుంటాయని చెప్పారు.

దొడ్డలో ఎన్నికల అబ్జర్వర్ పర్యటన



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న అతుల్ పాండె

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం, నెలమంగల తాలూకాలలో ఎలెక్షన్ ఎక్స్‌పెన్సివ్ అబ్జర్వర్‌గా నియమించబడిన అతుల్‌పాండె గురువారం ఉదయం దొడ్డలో పలుచోట్ల పర్యటించారు. ముఖ్యంగా తాలూకా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కార్యవైఖరిపై దృష్టి సారించారు. స్వయంగా వాహనాలను ఆపి తనిఖీ చేసారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పనితీరు గమనించారు. లోపాలు కనిపించిన చోట తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం తాలూకా కార్యాలయానికి విచ్చేసి ఎన్నికల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎలెక్షన్ అధికారి మోహనకుమారి తదితరులు ఉన్నారు.

టికెట్ అడగనన్న రామదాసు

మైసూరు: నాకు టికెట్ ఇవ్వాలని ఎప్పుడూ అడగలేదని, ఇప్పుడు కూడా ఎవరినీ అడగబోనని, హైకమాండ్‌కు కట్టుబడి ఉంటానని మైసూరు కేఆర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ఎస్.ఎ. రామదాసు అన్నారు. గురువారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర పథకాలు ఇంటింటికీ చేరేలా కృషి చేశానన్నారు. గత 25 సంవత్సరాల నుంచి ప్రజలు నన్ను గెలిపిస్తూ వచ్చారని, అందువల్ల మరోసారి ఎమ్మెల్యే పదవి కావాలని పార్టీని అడగబోనని చెప్పారు. అప్పట్లో శ్రీకంఠదత్త నరసింహరాజు ఒడెయార్, కృష్ణరాజ టికెట్ అడిగారు, అయితే సైకిల్‌పైన తిరుగుతున్న నాకు టికెట్ ఇచ్చారు, అప్పటినుంచి పార్టీ కోసమే పనిచేస్తున్నానని తెలిపారు.

పీఎస్‌లో అగ్ని ప్రమాదం, సీజ్ చేసిన బైక్‌లు దగ్ధం



కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా ఆవులహళ్లి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో వందకు పైగా నిలిపి ఉంచిన బైక్‌లు దగ్ధమయ్యాయి. ఇక్కడ వివిధ కేసుల్లో సీజ్ చేసిన బైక్‌లను పార్కింగ్ చేశారు. గురువారం మధ్యాహ్నం మంటలు ఏర్పడి బైక్‌లు మొత్తం కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే పెద్ద సంఖ్యలో బైక్‌లు కాలిపోయాయి.

టికెట్ ఇచ్చింది యడ్డి కొడుకని కాదు

శివాజీనగర: నాకు బీజేపీ టికెట్ వచ్చింది యడియూరప్ప కొడుకని కాదు. అలాగైతే గత ఎన్నికల్లోనే వరుణ నియోజకవర్గం నుంచి టికెట్ లభించాల్సింది. పార్టీలో నేను చేస్తున్న కార్యక్రమాలను చూసి టికెట్ ఇచ్చారు. ఈ నెల 19న శికారిపురలో నామినేషన్ సమర్పిస్తానని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర చెప్పారు. గురువారం బెంగళూరులో యడియూరప్ప నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యడియూరప్ప తనయుడు కావడం వల్లనే నాకు టికెట్ ఇచ్చారని మాట్లాడుతున్నారు. అది సరికాదు, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నా, అందుకే టికెట్ వచ్చింది అని చెప్పారు. సర్వేల ప్రకారం తాము అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నామినేషన్ల ఘట్టం షురూ





గురువారం బెంగళూరు చిక్‌పేటెలో నామినేషన్ కేంద్రం వద్ద కార్యకర్తల సందోహం

- పలు నియోజకవర్గాల్లో ప్రముఖుల దాఖలు
- నేడు, ఎల్లుండి సెలవులు, 20వ తేదీ ఆఖరు
- కేంద్రాల వద్ద కోలాహలం

బనశంకరి: రాష్ట్రంలో అసలైన ఎన్నికల ఘట్టం ఆరంభమైంది. మే 10 తేదీన నిర్వహించే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్ వెలువడగానే రాష్ట్రంలోని 224 నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ వరకు నామినేషన్లు వేయవచ్చు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు. 16వ తేదీ ఆదివారం సెలవు కాబట్టి నామినేషన్లకు ఆస్కారం లేదు. 21వ తేదీన నామినేషన్ల పరిశీలన, 24వ తేదీ నామినేషన్లు ఉపసంహరణకు చివరి తేదీ. నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థితో పాటు 5 మందిని మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థికి చెందిన మూడు వాహనాలకు మాత్రమే కార్యాలయం వద్ద ప్రవేశానికి అవకాశమిస్తారు.

పలువురు నామినేషన్ల దాఖలు

మొదటిరోజు భారీ పరిశ్రమల మంత్రి మురుగేశ్ నిరాణి బీళగి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే అఫ్జల్‌పుర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాలకయ్య గుత్తేదార్ నామినేషన్ దాఖలు చేశారు.

ఆళందలో జేడీఎస్ అభ్యర్థి మహేశ్వరి వాలి, సేడంలో జేడీఎస్ అభ్యర్థి బాలరాజ గుత్తేదార్ నామినేషన్లు సమర్పించగా మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి పాల్గొన్నారు. కడూరులో బీజేపీ అభ్యర్థి బెళ్లి ప్రకాష్ నామినేషన్ దాఖలు చేశారు. బెంగళూరు నగరంలోని చిక్కపేటే నియోజకవర్గం నుంచి మాజీ మేయర్ గంగాంబిక కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఇదే నియోజకవర్గం నుంచి కేజీఎఫ్ బాబు స్వతంత్రునిగా బరిలోకి దిగారు.

కోలారులో కేఆర్‌ఎస్ అభ్యర్థిగా ఇందిరారెడ్డి నామినేషన్ వేయగా తెరదాళలో బీజేపీ అభ్యర్థి సిద్దుసవది నామినేషన్ వేశారు. గోకాక్‌లో బీజేపీ అభ్యర్థి రమేశ్ జార్కిహోళి నామినేషన్ అందజేశారు. వారి అనుచరుల ఊరేగింపులతో అంతటా కార్యకర్తల కోలాహలం నెలకొంది.

నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

- పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి



యశవంతపుర: నగరంలో నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు బెంగళూరు పోలీసు కమిషనర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద ఇద్దరు ఏసీపీలను నియమించారు. నిర్ణీత సమయంలో మాత్రమే నామినేషన్లు దాఖలు చేయాలి. చెక్‌పోస్టల వద్ద ట్రాఫిక్ అంతరాయంపై ఫిర్యాదులు వచ్చాయి, దానిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రాత్రి సమయంలో చెక్‌పోస్టుల వద్ద కఠినంగా తనిఖీలు చేయడంతో పాటు అనుమానం ఉన్న రోడ్డు మార్గాల్లో సోదాలు చేయాలన్నారు. సుద్దగుంట పాళ్య పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఎస్‌ఐ మంజునాథ్‌స్వామి సస్పెండ్ చేశామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై విచారణ జరుగుతోందని చెప్పారు. నగరంలో తనను స్థానికులు అసభ్యంగా దూషించారని బిహార్ యువకుడు పెట్టిన వీడియోను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఐటీ, బీటీలూ.. తప్పక ఓటేయాలి

బనశంకరి: బెంగళూరు నగర పరిధిలోని ఐటీ బీటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని నగర ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. గురువారం ఎలక్ట్రానిక్ సిటీలో టెక్‌మహేంద్రలో ఏర్పాటు చేసిన పోలింగ్ జాగృతి కార్యక్రమంలో పాల్గొన్న తుషార్ మాట్లాడుతూ... పలు ఐటీ సంస్థల సీఈఓలు తమ సంస్థల్లో విధులు నిర్వహించే ఉద్యోగులందరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపామన్నారు. బెంగళూరు పరిధిలోకి వచ్చే 28 నియోజకవర్గాల్లో ఈసారి అధిక పోలింగ్ నమోదు లక్ష్యంతో అన్ని చోట్ల జాగృతి కార్యక్రమాలు, నాటకాలతో పాటు నమ్మ బెంగళూరు ఐకాన్స్ ద్వారా ఓటర్లు తప్పకుండా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు పోలింగ్ రోజు మే 10న అందరూ తప్పకుండా ఓటువేస్తే వేతనంతో కూడిన సెలవు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బెంగళూరు నగరజిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి సంగప్ప, జాయింట్ కమిషనర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న తుషార్

రూ.1.25 కోట్ల నగలు స్వాధీనం

శివాజీనగర: ఎలాంటి ఆధారాలు లేకుండా బ్యాగ్‌లో తీసుకెళుతున్న రూ.1.25 కోట్ల విలువ చేసే రెండున్నర కేజీల బంగారు ఆభరణాలను గస్తీలో ఉన్న పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. బెంగళూరులోని హలసూరు గేట్ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలోని నగరత్ పేటలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి బ్యాగ్‌తో వెళ్తుండగా అతన్ని తనిఖీచేశారు. అందులో బంగారు ఆభరణాలు లభించాయి, ఎక్కడివనీ అడగ్గా అతడు సరిగా సమాధానం చెప్పలేదు. తగిన ఆధారాలు చూపించి ఆభరణాలను తీసుకొని వెళ్లాలని పోలీసులు తెలిపారు. నగల తరలింపుపై విచారణ చేపట్టారు.

కొడగు వీహెచ్‌పీ నేతపై కాల్పులు

మైసూరు: కొడగు జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది అయిన కృష్ణమూర్తి కారు పైన గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. కుశాల నగరలో కార్యక్రమాన్ని ముగించుకొని న్యాయవాది, బెట్టిళిళ గ్రామ పంచాయతీ సభ్యుడు అయిన కంటి కార్యప్పతో కలిసి బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో బయల్దేరారు. కార్యప్పను అతని ఇంటి వద్ద దింపి, కృష్ణమూర్తి మడికెరికి బయల్దేరారు. ఈ సమయంలో దుండగులు కారుపై తుపాకీతో కాల్పులు జరపగా, కృష్ణమూర్తి ఎలాంటి హాని లేకుండా తప్పించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా మడికెరి గ్రామీణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పెద్ద శబ్దంతో తుపాకీ పేలిందని, కారు డోరు గ్లాస్‌కు తూటా తగిలి పగిలిపోయిందని, అదృష్టవశాత్తు తాను క్షేమంగా బయటపడినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్‌పి సంఘటనాస్థలిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బెంగళూరు హెసరఘట్టలోని ఉద్యానవన పరిశోధనశాలలో గురువారం మామిడి ప్రదర్శన ఆరంభమైంది. పలు రకాల మామిడి పిందెలను తిలకిస్తున్న విద్యార్థినులు

రాజీనామాలపై బీఎస్‌వై ఆగ్రహం

శివాజీనగర: మూడిగెర ఎమ్మెల్యే ఎం.పీ.కుమారస్వామికి బీజేపీ ఏమి తక్కువ చేసింది? ఎందుకు రాజీనామా చేశారు? అంటూ మాజీ ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్ప మండిపడ్డారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... కుమారస్వామికి పార్టీ మూడుసార్లు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా చేసింది. అందుకు కార్యకర్తల శ్రమ కారణమనేది ఆయన మరువరాదు. పార్టీ అంతర్గత సర్వే, నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి ఫైనల్ చేస్తోందన్నారు. మాజీ డీసీఎం లక్ష్మణ సవదితో చర్చిస్తామని, టికెట్ రాకపోతే అసంతృప్తికి గురికావటం సహజమే. దానిని సరిచేసే శక్తి తమకు ఉందని యడియూరప్ప అన్నారు.

నేడు జేడీఎస్ రెండో జాబితా: కుమార

జేడీఎస్ అభ్యర్థుల రెండో జాబితాను శుక్రవారం ప్రకటించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి తెలిపారు. హాసన్ జేడీఎస్ టికెట్ కూడా ఫైనల్ అవుతుందని కుమార తెలిపారు. పార్టీలోకి మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు అధిక సంఖ్యలో చేరుతున్నారని తెలిపారు. ఉత్తర కర్ణాటక నుండే 40కు పైగా అధిక స్థానాలు పార్టీకి రానున్నాయని చెప్పారు.

ఆరని సెగ

- బీజేపీలో రెండోరోజూ అసంతృప్తుల నిరసన గళం
- రాజీనామాలు, తిరుగుబాట్లు





బనశంకరి: అభ్యర్థుల మొదటి జాబితా వెలువడిన వెంటనే అధికార బీజేపీ పార్టీలో చెలరేగిన అసమ్మతి రెండో జాబితా బుధవారం రాత్రి విడుదల కాగానే సెగ మరింత రాజుకుంది. టికెట్లు దక్కలేదని అసంతృప్తికి గురైన ఎమ్మెల్యేలు ఎంపీ కుమారస్వామి, నెహ్రూ ఓలేకార్, మాజీమంత్రి సొగడు శివణ్ణ, శశికాంత అక్కప్పనాయకతో పాటు పలువురు సీనియర్లు కాషాయానికి గుడ్‌బై చెప్పారు. మరో పక్క మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ సవదిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ విఫలమైంది. అరసికెరె టికెట్ ఇవ్వలేదని మాజీ సీఎం యడియూరప్ప బంధువు ఎన్ఆర్ సంతోష్ కార్యకర్తల సమావేశంలో బోరున విలపించారు.

మూడిగెరెలో కుమారస్వామి శపథం

- మూడిగెరె ఎమ్మెల్యే కుమారస్వామి పదవికి, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన ఏకంగా చిక్కమగళూరు నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ సీటీ రవిపై పోటీ చేయనున్నట్లు తెలిసింది. నేను మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని కుమారస్వామి శపథం చేశారు. ఈయనకు చెక్‌బౌన్స్ కేసులో ఇటీవల జైలుశిక్ష పడడం తెలిసిందే.
- హావేరి రిజర్వు నియోజకవర్గం నుంచి టికెట్ దక్కకపోవడంతో నెహ్రూ ఓలేకర్ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, బీజేపీ జిల్లాధ్యక్షునిపై ఏకవచనంతో వాగ్దాడి చేశారు. నాకు టికెట్ నిరాకరించిన బొమ్మై హావేరి జిల్లాలో బీజేపీని ఎలా గెలిపిస్తారో చూస్తానంటూ బహిరంగ సవాల్ విసరడం గమనార్హం. హావేరి సిద్దయ్య సర్కిల్‌లో ఓలేకర్ మద్దతుదారులు టైర్లకు నిప్పుపెట్టారు.
- అథణిలో టికెట్ దక్కకపోవడంతో బెళగావి జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర నెర్లి కారును లక్ష్మణ సవది మద్దతుదారులు ముట్టడించి ఘెరావ్ చేశారు.
- మాలూరు నియోజకవర్గ టికెట్ రేసులో ఉన్న హుడి విజయ్‌కుమార్ బీజేపీకి గుడ్‌బై చెప్పి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని తీర్మానించారు.
- లోకాయుక్త వలలో పడిన చెన్నగిరి ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు మల్లికార్జున మాడాళ్‌కు టికెట్ ప్రకటించలేదని ఆయన మద్దతుదారులు చెన్నగిరిలో బీజేపీ ఆఫీసులోకి చొరబడి విధ్వంసం సృష్టించారు.
- బ్యాటరాయనపురలో టికెట్ రాక ఏ.రవి మద్దతుదారులతో కలిసి సామూహిక రాజీనామా చేశారు.
- మాజీ సీఎం యడియూరప్ప బంధువు ఎస్‌ఐ చిక్కనగౌడర్‌కు టికెట్ నిరాకరించడంతో ఆయన అలిగి కాంగ్రెస్‌లో చేరారు.
- కుణిగల్‌లో మాజీ ఎంపీ ముద్దహనుమేగౌడ, అఫ్జలపురలో నిఖిల్ గుత్తేదార్, చామరాజనగరలో రుద్రేశ్‌తో పాటు అనేకమందికి టికెట్లు దక్కకపోవడంతో అలిగారు. బీజేపీ టికెట్లు దక్కని నేతలు కాంగ్రెస్, జేడీఎస్‌ల వైపు చూపు సారించారు. రానున్న రోజుల్లో నాయకుల వలసలు ఊపందుకోనున్నాయి.



మూడిగెరె బీజేపీ ఎమ్మెల్యే కుమారస్వామి పదవికి, పార్టీకి గుడ్‌బై



హావేరి జిల్లాలో సీఎం బొమ్మైకి నెహ్రూ ఓలేకర్ సవాల్

కేసులు, వ్యతిరేకత ఉంటే నో టికెట్!

యశవంతపుర: గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో మాదిరిగా ఎక్కువమంది సిట్టింగ్‌లను పక్కన పెట్టి కొత్త ముఖాలకు టికెట్లు ఇవ్వాలని బీజేపీ యోచించింది. ఈ నమూనాను కర్ణాటకలో అమలు చేస్తే కష్టమని కొందరు సీనియర్లు హైకమాండ్‌కు సూచించారు. 212 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ మరో 12 స్థానాలకు పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలకు ముందుగానే గెలుపు ప్లాన్ వేసిన సంఘపరివార్ నాయకులు ప్రజా వ్యతిరేకతతో పాటు తీవ్రమైన కేసులను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు, నేతలకు టికెట్లు ఇవ్వరాదని ఆదేశించారు. సుమారు 40 మంది ఎమ్మెల్యేలకు టికెట్‌లు ఇవ్వరాదని తెలిపారు. దీని ఫలితంగానే అనేకమంది టికెట్లు హుళక్కి అయినట్లు సమాచారం. అయితే వేరే రాష్ట్రాల నమూనాను అనుసరిస్తే పార్టీకి ప్రమాదమని యడియూరప్ప చెప్పినట్లు తెలిసింది. అయినప్పటికీ హైకమాండ్ పెద్ద స్థాయిలో మార్పులకు శ్రీకారం చుట్టింది.

పార్టీలో అవమానాలను సహించా: సవది

శివాజీనగర: ఎమ్మెల్సీ పదవికి శుక్రవారం రాజీనామా చేస్తానని బీజేపీ అసంతృప్త నేత లక్ష్మణ సవది స్పష్టం చేశారు. గురువారం అథణి పట్టణంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, పార్టీలో తనకు మానసికంగా హింసకు, అవమానానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వీటన్నిటిని సహించుకొని బీజేపీలో ఉన్నాను. అయితే తల్లి వంటి బీజేపీ వేరేవారికి ప్రాధాన్యత ఇవ్వడంతో పార్టీ నుంచి బయటికి వస్తున్నానని చెప్పారు. తన రాజకీయ గురువైన బీఎల్ సంతోష్ ఫోన్ చేస్తే కాల్‌ను స్వీకరించలేదని, ఎందుకంటే ఆయనతో తాను దురుసుగా మాట్లాడితే ఆయన మనసు బాధపడుతుందని చెప్పారు.

తాను కూడా ఢిల్లీ స్థాయిలో టికెట్ విషయమై మాట్లాడినా ఫలితం లేకపోయిందన్నారు. ఎంపీ అణ్ణాసాబ్ జొల్లెతో భేటీపై స్పందిస్తూ ఇద్దరం ముందునుంచి ఆత్మీయ స్నేహితులు, అందుచేత స్నేహపూర్వకంగా మాట్లాడేందుకు వచ్చారని, బీజేపీ పరిణామాల గురించి మాట్లాడలేదని అన్నారు. ఎమ్మెల్సీకి, బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్, జేడీఎస్‌లలో ఏదో ఒక పార్టీ టికెట్ ద్వారా సవది పోటీ చేస్తారని సమాచారం.

రిజర్వేషన్ల సవరణపై సుప్రీంలో చుక్కెదురు

బనశంకరి: ఒక్కలిగలు, లింగాయతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను తలా రెండుశాతం పెంపు, అలాగే ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్‌ను ఈడబ్ల్యూఎస్‌లోకి మార్చడం దోషపూరితమని సుప్రీంకోర్టు తెలిపింది. రిజర్వేషన్ల మార్పుపై పలు ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టులో కేసులు దాఖలు చేయగా గురువారం న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, బీవీ నాగరత్న బెంచ్ విచారణ జరిపింది. ముస్లింల కోటా ను రద్దు చేయడానికి ఎలాంటి అధ్యయనం చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తమ వాదనలకు కొంత సమయం కావాలని కోరారు. కొత్త రిజర్వేషన్ల ఆధారంగా ఎలాంటి నియామకాలు, ప్రవేశాలు చేయడంలేదని పేర్కొన్నారు. అనంతరం ధర్మాసనం 18వ తేదీకి విచారణ వాయిదా వేసింది.

కరగ పూజారిపై హత్యాయత్నం!

బనశంకరి: ప్రసిద్ధ బెంగళూరు ధర్మరాయ ఆలయ కరగ పూజారి జ్ఞానేంద్రపై దాడి కేసులో ఆదినారాయణ అనే వ్యక్తిని హలసూరుగేట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ నెల 6వ తేదీన జరిగిన కరగ మహోత్సవంలో కరగ మోస్తున్న జ్ఞానేంద్రపై రసాయనాలు, కారంపొడి చల్లి హత్యకు ప్రయత్నించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జ్ఞానేంద్ర గొంతు, పొట్ట భాగాల్లో కాలిన గాయాలు ఏర్పడ్డాయని ఆయన హలసూరుగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జయనగరకు చెందిన ఆదినారాయణపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గురువారం అరెస్ట్ చేశారు.

కరగ ఉత్సవంలో కరగధారిపై భక్తులు పూలు, మిరపకాయలు, ఉప్పు చల్లడం ఆనవాయితీగా ఉంది. ఈ సమయంలో వీరకుమారుడు ఆదినారాయణ జ్ఞానేంద్రపై రసాయనాలు, కారంపొడి కలిపిన పూలు చల్లాడు. జ్ఞానేంద్ర గమనించగా ఆదినారాయణ పారిపోతూ కనిపించాడు. అతని నడవడిక బాగాలేదని కరగ అర్చకుని ఉద్యోగం నుంచి తప్పించడంతో పగ పెంచుకుని దాడి చేశాడు.

క్లుప్తంగా

నగరంలో ఎమ్మెల్యే ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: నగరంలో గురువారం బైరూన్ కిల్లా, అంద్రూన్ ఖిల్లా, గంగానివాస్ వద్ద పార్టీ కార్యకర్తలతో కలిసి నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ ప్రచారం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో పేదల మేలు కోసం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి మళ్లీ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

ఓటింగ్‌పై ప్రచార జాతా

రాయచూరు రూరల్: వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు కోసం నగరసభ అధికారులు ప్రచార జాతా చేపట్టారు. గురువారం నగరసభ కార్యాలయంలో జెడ్పీ, జిల్లాధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతాను కమిషనర్ గురులింగప్ప ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంచరించి శాంతియుతంగా ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనాలని ప్రచారం చేశారు.

అభివృద్ధి ఘనత బీజేపీదే



గజమాలతో ఎమ్మెల్యేకు సత్కారం

గంగావతి రూరల్: గత 60 ఏళ్లలో కాంగ్రెస్ కూడా చేయలేని అభివృద్ధిని ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో చేసి చూపిన ఘనత బీజేపీకే దక్కుతుందని, అలాంటి నాయకుడి కోసం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని జీపీ సభ్యులు డాక్టర్ నాగరాజ్ కంబళి అన్నారు. ఆయన గురువారం ఏపీఎంసీ మాజీ సభ్యులు భోజప్ప కుంబార నేతృత్వంలో 100 మందికి పైగా యువతతోపాటు వివిధ సమాజాల నాయకులు సిట్టింగ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ అభ్యర్థి పరణ్ణ మునవళ్లి, నెక్కంటి సూరిబాబుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. పార్టీ గ్రామీణ అధ్యక్షులు చెన్నప్ప మళిగి, నగరసభ మాజీ అధ్యక్షులు హనుమంతప్ప నాయక, జిల్లా బీజేపీ మీడియా ప్రతినిధి వీరభద్రప్ప నాయక, జీపీ సభ్యులు గవిసిద్దప్ప హోవరగి, కల్లప్ప గడ్డి, పంపాపతి కుంబార, దళపతి, పార్టీ యువ నాయకులు డాక్టర్ అమరేశ్ కుంబార, ఎన్‌డీఎం రమేశ్ కామనూరు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు

గౌరిబిదనూరు: తాలూకాలోని హోసూరు హోబళి కురూడి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా ట్రస్ట్ వారిచే వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగింది. మంగళ, బుధవారాలు రాత్రిదాకా జరిగిన ఉత్సవాలలో తాలూకా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు, సమాజ సేవకుడైన ఎంఎస్ రాధాకృష్ణ ప్రసంగిస్తూ వీరబ్రహ్మేంద్రస్వామివారు చిక్కబళ్లాపురంలోని పాపాఘ్ని నుంచి కడప జిల్లా కందిమల్లాయపల్లెకు వెళ్లిపోయి అక్కడ కాలజ్ఞానం రచించారని చెప్పారు. కాలజ్ఞానంలో పేర్కొన్న సంఘటనలు నేటికీ జరుగుతూ ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాచారి స్వామి పాల్గొన్నారు.

వార్డుల్లో ముమ్మర ప్రచారం



కరపత్రాన్ని అందిస్తున్న అభ్యర్థి చెన్నకేశవ

గంగావతి: నగరంలో 1వ వార్డు నుంచి జేడీఎస్ అభ్యర్థి హెచ్‌ఆర్ చెన్నకేశవ గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 2, 3, 4వ వార్డుల్లో కూడా ఆయన ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సంకీర్ణ ప్రభుత్వ హయాంలో హెచ్‌డీ కుమారస్వామి సీఎంగా ఉండగా నగరానికి కోట్లాది రూపాయలు నిధులు ఇచ్చి బస్టాండ్, మినీ విధానసౌధ, సర్క్యూట్ హౌస్ తదితర అభివృద్ధి పనులను చేపట్టారన్నారు. అవే తన గెలుపు సోపానాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖరారు కాని జాబితా.. తేలని అభ్యర్థుల భవిత

రాయచూరు రూరల్: జిల్లాలో నామినేషన్ల పర్వం ప్రారంభమైనా అభ్యర్థుల జాబితాను ప్రకటించడంలో కాంగ్రెస్ అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఆ పార్టీ అభ్యర్థులు టికెట్ కోసం వేచి చూస్తున్నారు. నగర కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి బోసురాజ్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించగా మైనార్టీలకు కేటాయించాలని అధిష్టానం తీర్మానించింది. మాన్విలో మాజీ ఎమ్మెల్యే హంపయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ భగవంతప్ప నాయక్ టికెట్ కోసం ప్రయత్నిస్తుండగా మాన్విలో నిరసనగళం వినిపిస్తోంది. దేవదుర్గను కాదని మాన్వి టికెట్‌ను డీసీసీ అధ్యక్షుడు ఆశించడం ఎంతవరకు సబబు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక సింధనూరు కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లి, బసనగౌడ బాదర్లిల మధ్య, లింగసూగూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే హులగేరికి బదులుగా రుద్రయ్యకు టికెట్ కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేవదుర్గ విషయంలో రాజశేఖర్ నాయక్, మేటీల మధ్య పోటీ నెలకొంది.

తొలిరోజే ముమ్మరంగా నామినేషన్లు

- నిరాడంబరంగా నామపత్రాలు దాఖలు చేసిన అభ్యర్థులు

రాయచూరు రూరల్: నామినేషన్ల పర్వం మొదలైన తొలిరోజు గురువారం జిల్లాలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. రాయచూరు గ్రామీణ నియోజకవర్గానికి గ్రామీణ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ దద్దల్ నగరంలో నామినేషన్ వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శశికాంత్ శివపురెకు ఆయన తన నామినేషన్ సమర్పించారు. ఎస్‌డీపీఐ అభ్యర్థి ఇషాక్ హుసేన్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి రజనీకాంత్‌కు తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. మస్కిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారిణి దేవికకు బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌గౌడ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ్ నామినేషన్ పత్రాలను అందించారు.



రాయచూరులో నామినేషన్ వేస్తున్నకాంగ్రెస్ గ్రామీణ అభ్యర్థి బసనగౌడ దద్దల్



మస్కిలో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌గౌడ పాటిల్



మస్కిలో కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ తుర్విహాళ్ నామినేషన్ వేస్తున్న దృశ్యం

నామినేషన్ల ప్రక్రియ షురూ

బళ్లారిఅర్బన్: మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గురువారం నుంచి ఎన్నికల నామినేషన్లు ప్రారంభం అయ్యాయి. నగరంలో కర్ణాటక రాష్ట్ర సమితి పక్ష (కేఆర్‌ఎస్‌పీ) నగర అభ్యర్థిగా అల్లీపుర శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తమ పార్టీ నుంచి అన్ని క్షేత్రాల్లో అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు లింగేగౌడల సమక్షంలో ఇప్పటికే 160 సీట్లకు అభ్యర్థులను ఖరారు చేశారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్, యుగంధర్, ముండ్లూరు కుమారస్వామి, ప్రశాంత్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎస్‌యూసీఐ అభ్యర్థి నామినేషన్

సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎస్‌యూసీఐ) పార్టీ నుంచి నగర అభ్యర్థిగా ఆర్.సోమశేఖర్‌గౌడ నామపత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నిత్యం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంజుల, శాంతమ్మ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజున జిల్లాలో 9 నామినేషన్లు

కోలారు / కేజీఎఫ్: కోలారు జిల్లాలో నామినేషన్ల పర్వం మొదటి రోజున వివిధ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 9 మంది అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. ఉదయం 10.30 గంటలకు కోలారు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా సీఎంఆర్ శ్రీనాథ్ తమ పార్టీ నాయకులు, మద్దతుదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు ఆయన నగరంలోని కోలారమ్మ ఆలయం, మసీదులు, చర్చిల్లో పూజలు చేసిన అనంతరం నామినేషన్ వేశారు. ఇదే రోజున కేఆర్‌ఎస్ పార్టీ నుంచి ఇందిరారెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా వెంకటాచలపతి నామినేషన్ సమర్పించారు. మాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ రెబల్ అభ్యర్థిగా హూడి విజయకుమార్, కేఆర్‌ఎస్ పార్టీ నుంచి ఏవీ మహేష్, జేడీఎస్ అభ్యర్థిగా జేఈ రామేగౌడ నామినేషన్ దాఖలు చేశారు. కేజీఎఫ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బి-ఫారంతో వెళ్లి రూపా శశిధర్ సాంకేతికంగా నామినేషన్ పత్రాలు అందించారు. బంగారుపేటె నియోజకవర్గం నుంచి కేఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎం.రాజా, జేడీఎస్ నుంచి మల్లేష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు.



రాయిచూరులో నామినేషన్ వేస్తున్న ఎస్‌డీపీఐ అభ్యర్థి ఇషాక్ హుసేన్



బళ్లారిలో నామినేషన్ సమర్పిస్తున్న కేఆర్‌ఎస్‌పీ అభ్యర్థి అల్లీపుర శ్రీనివాస్‌రెడ్డి



బళ్లారిలో నామినేషన్ అందిస్తున్న ఎస్‌యూసీఐ అభ్యర్థి సోమశేఖర్‌గౌడ



కోలారు నుంచి నామినేషన్ వేస్తున్న జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్

పాత దోస్తీకి స్వస్తి..మిత్రుడితోనే కుస్తీ

- కలఘటిగిలో సంతోష్ లాడ్, నాగరాజ్ చబ్బి మధ్య ఉత్కంఠ పోరు

హుబ్లీ: మారిన రాజకీయ సమీకరణాలతో జిల్లాలోని కలఘటిగి నియోజకవర్గ పోరు రసవత్తరంగా మారింది. ఇక్కడి నుంచి గనుల యజమాని, రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన సంతోష్‌లాడ్ తొలి జాబితాలోనే కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ నిరాకరించి రెండు రోజుల క్రితం పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత నాగరాజ్ చబ్బికి పార్టీ టికెట్ కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోరులో ఉత్కంఠ నెలకొంది. చబ్బి బీజేపీలో ఎమ్మెల్సీగా కొన్నేళ్లు ఉండి కలఘటిగి తాలూకాలో కీలక నేతగా ఎదిగారు. ఈ సారి కాంగ్రెస్ టికెట్ దక్కుతుందన్న ఆశతో పని చేసిన ఆయనకు టికెట్ నిరాకరించారు. దీంతో ఆయన బీజేపీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. ఇక్కడి సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే సీఎం నింబణ్ణవర తనకు తప్ప మరొకరికి టికెట్ ఇస్తే సహకరించబోనని హెచ్చరించారు. దీంతో ఆయన తిరుగుబాటు చేసే అవకాశాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో చబ్బి, లాడ్ మంచి సేవలు అందించారు. చబ్బి గ్రామాల్లో బస చేసి కూడా అందించిన సేవలతో మంచి పేరు తెచ్చుకున్నారు. సంతోష్‌లాడ్ కోవిడ్ వేళ ప్రజలకు రేషన్‌ను పంపిణీ చేశారు. కాగా వీరిద్దరు కలఘటిగికి బయటి వారే. స్థానికుడు నింబణ్ణవర్ టికెట్ చేజారడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారు. తాను స్థానికుడినన్న ప్రచార భేరితో జనం ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. కాగా హుబ్లీ ధార్వాడ తీర్పు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ క్రాంతికిరణ్, కుందగోళకు ఎంఆర్ పాటిల్, ధార్వాడ గ్రామీణకు అమృత్ దేశాయి, నవలగుందకు శంకర్ పాటిల్ మునేనకొప్ప, హుబ్లీ ధార్వాడ పశ్చిమ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అరవింద బెల్లదకు బీజేపీ టికెట్లు కేటాయించింది. అట్టుడికి పోతున్న జగదీశ్ శెట్టర్‌కు టికెట్ రావచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.



నాగరాజ్ చబ్బి(బీజేపీ), సంతోష్‌లాడ్(కాంగ్రెస్)

అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సిద్దరామేశ్వర

హొసపేటె: వచ్చే నెల 10న జరుగనున్న సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు సాగుతున్నాయని విజయనగర నియోజకవర్గం ఎన్నికల అధికారి సిద్దరామేశ్వర తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నియోజకవర్గంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నియమావళిని పాటించాలన్నారు. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటామన్నారు. ఎలాంటి గందరగోళం లేకుండా, ఎన్నికలను నిష్పక్షపాతంగా, పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. విజయనగర నియోజకవర్గంలో మొత్తం 247 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పురుషులు 1,20,806, మహిళలు 1,27,368, ఇతరులు 77 మంది కలిపి మొత్తం 2,48,251 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వజిత్ మెహత తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..రంగనాథ రథోత్సవం




రథాన్ని లాగుతున్న భక్తులు

గంగావతి: తాలూకాలోని ఆనెగుందిలో వెలసిన రంగనాథ స్వామి రథోత్సవాన్ని గురువారం సాయంత్రం నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా రాజవంశీయులు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర రాజవంశీయులను సంప్రదాయం ప్రకారం మేళ తాళాలతో ఊరేగింపుగా రథం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని రథంపై ఉంచగా, రథోత్సవాన్ని రాజా శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించారు. రాజబాటలో చివరి వరకు రథాన్ని లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. ఉదయాన్నే ఆలయంలోని రంగనాథుడికి ప్రత్యేక అలంకరణలతో విశేష పూజలను అర్చకులు నెరవేర్చారు.

తాళం వేసిన ఇళ్లల్లో వరుస చోరీలు

హుబ్లీ: ధార్వాడ కెళగేరిలో అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో వరుసగా చోరీలు జరిగాయి. నగదు, బంగారు, వెండి చోరీకి గురైంది. మూడు ఇళ్ల యజమానులు ఇళ్లకు తాళాలు వేసి వేరే పనులపై పొరుగూరికి వెళ్లగా ఈ చోరీలు జరిగాయి. హొసూరు వీధిలో శాంతయ్య ఇంట్లో వెండి గజ్జెలు చోరీ అయ్యాయి. ఇంటి తాళం పగలగొడుతుండగా శబ్దం రావడంతో ఎదురింటి వారు నిద్ర లేవగా దొంగలు పరారయ్యారు. ఇదే వీధిలో దొడ్డమని శ్రీశైల కడ్లి ఇంటికి తాళాన్ని పగలగొట్టి రూ.25 వేల నగదు చోరీ చేశారు. అలాగే సమీపంలోని దాలి వీధిలో సైనికుడు శేకప్ప మడివాళ ఇంటి తాళం పగలగొట్టి 8 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు సదరు ఇంటి యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



శ్వేత(ఫైల్)

హొసపేటె: ఆర్టీసీ బస్సు నుంచి కిందకు దిగబోయి కింద పడి తీవ్ర గాయాలతో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందిన ఘటన విజయనగర జిల్లా హూవినహడగలి పట్టణ శివార్లలో గురువారం జరిగింది. వివరాలు..హూవిన హడగలిలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలో ఈఅండ్‌సీ విభాగం మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థిని శ్వేత(19) ఆర్టీసీ బస్సులో కాలేజీకి బయల్దేరింది. బస్సు కాలేజీ వద్దకు రాగానే డ్రైవర్ బస్సును నిలపక పోవడంతో విద్యార్థిని శ్వేత వెంటనే కిందకు దిగే ప్రయత్నం చేయగా పట్టు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆమెను వెంటనే నగర ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దొడ్డలో విజయం ఖాయం



మాట్లాడుతున్న ధీరజ్ మునిరాజు

దొడ్డబళ్లాపురం: నియోజకవర్గంలో ఒకరికే టికెట్ దక్కుతుందని, అయితే టికెట్ ఆశించి భంగపడ్డ వారు అసంతృప్తితో ఉండడం సహజమేనని, త్వరలో అన్నీ సమసిపోతాయని దొడ్డ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ధీరజ్ మునిరాజు అన్నారు. పార్టీ తనకు టికెట్ ప్రకటించాక మొదటి సారి బీజేపీ పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడిన ఆయన పార్టీ నమ్మకం ఉంచి అభ్యర్థిగా నిలపడం సంతోషంగా ఉందన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయనని, అందరితో కలిసి పనిచేసి పార్టీని గెలిపిస్తానన్నారు.


ఆటోలో రూ.కోటి పట్టివేత



నగదుతో పోలీసులు

కృష్ణరాజపురం: బెంగళూరులో విజయనగర నుంచి జయనగరకు తరలిస్తున్న రూ. 1 కోటిని, ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం హలసూరు పోలీస్ స్టేషన్ వద్ద ఈ సంఘటన జరిగింది. సురేష్, ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు నగదును ఆటోలో వెళ్తున్నారు. హలసూరు గేట్ పోలీసు స్టేషన్ ముందు బీబీఎంపీ ఆఫీసు వద్దకు రాగానే ఆటో చెడిపోయింది. అక్కడే చెకింగ్‌లో ఉన్న పోలీసులు ఆటోను తనిఖీ చేయగా బ్యాగుల్లో నోట్ల కట్టలు బయటపడ్డాయి. జయనగరలో ఉన్న ఒక బీజేపీ నేతకు ఇవ్వడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. సీజ్ చేసి విచారణ చేపట్టారు.

జేడీఎస్ అభ్యర్థి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి, నాయకులు

బళ్లారిటౌన్: జేడీఎస్ నగర అభ్యర్థి మున్నాబాయి గురువారం 18వ వార్డులోని బిసిలహళ్లిలో, జనతానగర్‌ల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంటింటా ప్రచారం చేస్తూ ప్రాంతీయ పార్టీతోనే నగరాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనళ్లి తాయణ్ణ, జిల్లాధ్యక్షులు సోమలింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.

పంచరత్న రథయాత్రకు శ్రీకారం

కంప్లి: పట్టణంలోని పేటె బసవేశ్వర ఆలయంలో గురువారం జేడీఎస్ అభ్యర్థి రాజునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి పంచరత్న రథయాత్రను ప్రారంభించారు. అనంతరం అభ్యర్థి మాట్లాడుతూ 123 క్షేత్రాల్లో గెలుపు సాధించాలనే లక్ష్యంతో మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి పంచరత్న రథయాత్ర ప్రారంభించారన్నారు. ఈసారి సొంతంగా రాష్ట్రంలో జేడీఎస్ అధికారంలో వస్తుందన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హేమయ్యస్వామి, బీ.అంబణ్ణ, హనుమంత, జగదీష్ పూజార్, నాగరాజ్ దొడ్డప్ప, మల్లప్ప, ఇర్ఫాన్, మరేగౌడ, కృష్ణానాయక్, ముజాహిద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

గెలిచే సత్తా ఉన్నందునే పార్టీ టికెట్



మాట్లాడుతున్న కెఎస్ మంజునాథగౌడ

మాలూరు: తనకు విజయావకాశాలు ఉండడం వల్లనే మాలూరులో పార్టీ తనకు టికెట్ కేటాయించిందని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ మంజునాథగౌడ తెలిపారు. గురువారం ఐటీసీ ఫ్యాక్టరీ సమీపంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన విశేష పూజల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసారి మాలూరు నుంచి తాను భారీ మెజార్టీతో గెలుపొందుతానన్నారు. పార్టీ నాయకుడు హూడి విజయకుమార్ తనకు రెబల్‌గా మారి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తుండడంపై స్పందించిన ఆయన విజయకుమార్‌కు యువకుడని, పార్టీలో మంచి భవిష్యత్తు ఉందని, పార్టీ హైకమాండ్ విజయకుమార్‌తో చర్చించి నామినేషన్‌ను వాపసు తీసుకునేలా చేస్తుందన్నారు. విజయకుమార్ కూడా తన విజయానికి సహకరిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీలో పైరవీలకు అవకాశమే లేదు. గెలిచే వ్యక్తులను గుర్తించి టికెట్ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నీలచంద్ర, చంద్రశేఖర్, మునిరాజ్, రమేష్ తదితరులు ఉన్నారు.

నేనే స్టార్ క్యాంపెయినర్‌ని




ఎంపీ మునిస్వామి, అభ్యర్థి వర్తూరు ప్రకాష్‌లకు గజమాలతో కార్యకర్తల స్వాగత సత్కారం

కోలారు: కోలారు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తానే స్టార్ ప్రచారకుడిన(క్యాంపెయినర్)ని వర్తూరు ప్రకాష్ తెలిపారు. తనకు టికెట్ కేటాయించిన అనంతరం గురువారం తొలిసారిగా నగరంలో ఎన్నికల ప్రచారానికి ముందు వినాయక ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 17న సాంకేతికంగా నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. అనంతరం 19న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మునిరత్న, ఎంపీ ఎస్.మునిస్వామి తదితర ప్రముఖులతో పాటు 50 వేల మంది కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేస్తానన్నారు. కోలారు బీజేపీ టికెట్ ఆకాంక్షి ఓంశక్తి చలపతిని కూడా విశ్వాసంలోకి తీసుకుని, ఇతర నియోజకవర్గాలకు కూడా వెళ్లి ప్రచారం చేస్తానన్నారు. ప్రస్తుతం బీజేపీ, జేడీఎస్ మధ్యనే పోటీ ఉన్నా కోలారులో కాంగ్రెస్ అభ్యర్థిగా సిద్దరామయ్య పోటీ చేస్తే తనకు మరో 10 వేల ఓట్లు అధికంగా వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మునిస్వామి, కేయూడీఏ అధ్యక్షుడు విజయకుమార్, జెడ్పీ మాజీ అధ్యక్షుడు సీఎస్ వెంకటేష్, మ్యాగేరి నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ భవనాలు ప్రారంభం

కేజీఎఫ్: కేజీఎఫ్ పోలీస్ జిల్లాలో నూతనంగా నిర్మించిన క్యాసంబళ్లి, బంగారుపేటె పోలీస్ స్టేషన్ల భవనాలను గురువారం కేంద్ర వలయం ఐజీపీ డాక్టర్ బీఆర్ రవికాంతేగౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికాంతేగౌడ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖ వందలాది కొత్త భవనాలను నిర్మిస్తోందన్నారు. ఇందులో భాగంగా కేజీఎఫ్, బంగారుపేటె, క్యాసంబళ్లిలో కూడా నూతన భవనాలను నిర్మించిందన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీస్ అధికారులు సౌజన్యంతో మెలగాలని, వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. కోలారు ఎస్పీ ఎం నారాయణ, కేజీఎఫ్ ఎస్పీ ధరణీదేవి పాల్గొన్నారు.

ప్రతి ఓటరు ఓటు వేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

కోలారు: ప్రతి ఓటరు ఎన్నికల రోజున తప్పకుండా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని పురసభ రెవిన్యూ అధికారి వి.నాగరాజ్ తెలిపారు. గురువారం పురసభ కార్యాలయంలో దివ్యాంగ ఓటర్లకు నిర్వహించిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు ఓటు వేస్తేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా హాజరైన వారికి ఓటరు ప్రతిజ్ఞావిధిని బోధించారు. పురసభ రెవిన్యూ అధికారి ఎస్.శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ కేజీ రమేష్ పాల్గొన్నారు.

ఇంటింటా లక్ష్మీఅరుణ ప్రచారం



సాక్షి,బళ్లారి: నగర కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీఅరుణ తమ ప్రచార దూకుడును పెంచారు. గురువారం ఆమె తమ పార్టీ మద్దతుదారులు, కార్యకర్తలతో కలిసి 10వ వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు. తన ఎన్నికల గుర్తు ఫుట్‌బాల్ అని, ఆ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ఆయా కాలనీల్లో ఉత్సాహంగా కలియదిరిగారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే నగర రూపురేఖలను మార్చి నగరాభివృద్ధికి తోడ్పడతానన్నారు. ఆయా కాలనీల్లో ఆమెకు ఘనస్వాగతం లభించింది.

పోలింగ్ కేంద్రానికి మెరుగులు



రాయచూరు రూరల్: జిల్లాలో మే 10న జరగనున్న పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని పెంచడానికి, ఓటర్లను ఆకర్షించడానికి అధికారులు నూతన ప్రయోగం చేశారు. జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జిల్లా విద్యా శాఖ, ఎన్నికల అధికార్లు కలిసి జిల్లాలో 1080 పోలింగ్ కేంద్రాలకు సరికొత్త మెరుగులు దిద్దారు. గురువారం డీడీపీఐ వృషబేంద్రయ్య సిరవారలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో నా ఓటు నా హక్కు అనే నినాదాన్ని రాయించడంతో పాటు గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా పోలింగ్ కేంద్రాన్ని ముస్తాబు చేయించారు.

వరుణలో గెలుస్తానన్న సిద్దు

మైసూరు: వరుణలో నన్ను ఓడించడానికి బీజేపీ అనేక కుట్రలుచేస్తోంది, కానీ ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు నన్ను ఎవరూ ఓడించలేరని కాంగ్రెస్ మాజీ సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం మైసూరు నగరంలోని చాముండేశ్వరిలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుణలో నాపైకి ఎవరో సోమణ్ణ అనే అభ్యర్థిని తీసుకుని వచ్చి పోటీ చేయిస్తున్నారు, ఇవే నా చివరి ఎన్నికలు, ఎవరు వచ్చినా మీరు ఇచ్చే తీర్పుకి ఢిల్లీలో బీజేపీ నాయకులు గూబ గుయ్యిమనాలి అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కూడా వరుణలో గెలిచి తీరతానని ప్రకటించారు.

అంజనాద్రిలో ప్రత్యేక పూజలు



గంగావతి రూరల్: రాష్ట్రంతో పాటు గంగావతి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందాలని ఢిల్లీలోని గోండా అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అజయ్ మహావార్ గురువారం యువమోర్చా జిల్లా అధ్యక్షులు శివకుమార్ అరకేరితో కలిసి అంజనాద్రి బాలాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

పిల్లలతో ప్రచారం శిక్షార్హం



కలెక్టర్ వెంకటరాజ

కోలారు: 18 ఏళ్ల లోపు వయస్సుగల పిల్లలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోరాదని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వెంకటరాజ ఆదేశించారు. ఎన్నికల పనులకు, ప్రచారానికి ఏ పార్టీ కూడా పిల్లలను ఉపయోగించుకోరాదని జాతీయ బాలల కమిషన్ సూచించిన నేపథ్యంలో కలెక్టర్ ఈ ఆదేశాలను జారీ చేశారు. పార్టీలు ఎన్నికల ప్రచారంలో పిల్లలను వాడుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టర్‌చే చెక్‌పోస్టుల తనిఖీ

మైసూరు: శాసనసభ ఎన్నికల సందర్భంగా మైసూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను మైసూరు జిల్లా కలెక్టర్ కేవీ రాజేంద్ర గురువారం పరిశీలించారు. చాముండేశ్వరి నియోజకవర్గం పరిధిలో ఉన్న జయపుర హోబ్లిలో హారోహళ్లి చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీని పరిశీలించారు. హెచ్‌డి కోటె తాలూకాలోని కుంచెహళ్లి చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

కేజీఎఫ్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు గురువారం తాలూకాలోని ఆంధ్ర-తమిళనాడు సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. అంతర్రాష్ట్ర సంచారం సాగిస్తున్న వాహనాల తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా? లేదా అనే విషయం గురించి పరిశీలించారు. కెంపాపుర చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న దాఖలా పుస్తకాలను పరీక్షించారు. పూర్తి తనిఖీ అనంతరమే కంటైనర్లతో సహా అన్ని వాహనాలను వదలాలని చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. తనిఖీ సమయంలో వీడియో రికార్డింగ్‌ని తప్పనిసరిగా చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, రెవిన్యూ అధికారి రఘురాంసింగ్ తదితర అధికారులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించరూ

శ్రీనివాసపురం: పనసమాకనహళ్లి చెరువులో ఆక్రమణలను తొలగించి సర్వే చేసి చెరువును అభివృద్ధి చేయాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు నారాయణగౌడ మాట్లాడుతూ తాలూకాలోని చెరువులను వెంటనే సర్వే చేసి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని కోరారు. ఈసందర్భంగా బంగవాది నాగరాజగౌడ, ఆలవాటి శివ, సహదేవణ్ణ, గిరీష్, సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరుణుడి కోసం పూజలు



మైసూరు: మైసూరు నగరంలోని ఆర్టీనగరలో నైపుణ్య స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో నిర్వాహకులు విద్యార్థులతో వరుణ పూజలు చేయించారు. విద్యార్థులు మట్టితో చేసిన నందిని తలపై పెట్టుకుని వరుణుడి పాటలు పాడుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి నందిపై పోశారు. ఎండల నుంచి ఉపశమనానికి వర్షాలు పడాలని పూజలు చేశారు.

కోడ్ ఉల్లంఘన.. మంత్రిపై కేసు

యశవంతపుర: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి కార్యకర్తలకు బిరియాని భోజనం పెట్టించిన మంత్రి ఎస్టీ సోమశేఖర్‌పై కగ్గలిపుర పోలీసులు కేసు నమోదు చేశారు. విధానసభ ఎన్నికలలో భాగంగా కార్యకర్తల సమావేశంలో బిరియాని భోజనం సిద్ధంగా ఉంది భోజనం చేయాలని సూచించారు. దీంతో జేడీఎస్ న్యాయవిభాగం అధ్యక్షుడు ఎపీ రంగనాథ్ ఎన్నికల అధికారులకు వీడియో క్లిప్పింగ్‌ను జత చేసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారులు వీడియోను పరిశీలించి ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

బీజేపీ అభ్యర్థులకు బీఫారం



బొమ్మనహళ్లి: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో నగరంలోని బెంగళూరు దక్షిణ జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులకు గురువారం నగరంలోని మల్లేశ్వరంలో బీజేపీ కార్యాలయంలో పార్టీ బీఫారం అందజేశారు. బెంగళూరు దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, బీటీఎం లేఔట్ నుంచి మొదటిసారి టికెట్‌ను సాధించిన శ్రీధర్ రెడ్డి, జయనగర నుంచి కేసీ. రామ్మూర్తిలు రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి సిద్దరాజు, కన్నడ నటి, బీజేపీ నాయకురాలు తార అనురాధ చేతుల మీదుగా బీఫారం అందుకున్నారు.

మద్యం స్వాధీనం

తుమకూరు: శాసన సభ ఎన్నికల సందర్భంగా యలదబాగి శిడ్లకోన మార్గంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని అబ్కారి శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న అధికారులు యలదబాగి–శిడ్లకోన మార్గంలో దాడులు చేసి 264 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

కారులో రూ. 34 లక్షల నగదు పట్టివేత

మైసూరు: చామరాజనగర జిల్లా గుండ్లుపేట పరిధిలోని హరికాటి చెక్‌పోస్ట్ వద్ద గురువారం అధికారులు రూ. 34 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఓ కారును తనిఖీ చేయగా నగదు బయటపడింది. ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును, వాహనాన్ని సీజ్ చేశారు.

మడికేరిలో తాగునీటికి కటకట

యశవంతపుర: కావేరి నది పుట్టే కొడుగు జిల్లాలో తాగునీటి సమస్య వెంటాడుతుంది. మడికేరి చుట్టు పక్కల గ్రామాలకు రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణానికి తాగునీరు అందించే కోటు కాలువ ఎండిపోయింది. దీంతో రెండు రోజులకొక్కసారి పట్టణానికి నీటిని సరఫరా చేస్తున్నారు.

టికెట్ దక్కలేదని సంతోష్ కంటతడి

యశవంతపుర: హాసన జిల్లా అరసీకెరె టికెట్‌కు ఆశించి భంగపడిన సీఎం రాజకీయ మాజీ కార్యదర్శి ఎస్ఆర్ సంతోష్‌కు కన్నీరు పెట్టుకున్నారు. అరసీకెరెలోని తన నివాసంలో వద్ద చేరిన అభిమానులు, కార్యకర్తల మధ్య బోరుమని ఏడ్చారు. టికెట్ కోసం హైకమాండ్‌పై ఒత్తిడి పెంచాలని కార్యకర్తలు సమాధాన పరిచారు. హైకమాండ్ టికెట్ ఇవ్వకున్న క్షేత్రం ప్రజలను మరవరన్నారు. స్థానిక బీజేపీ నాయకులు సంతోష్‌కు ధైర్యం చెప్పారు. సంతోష్ మాజీ సీఎం యడియూరప్పకు రాజకీయ కార్యదర్శిగా సేవలందించారు. ఐదేళ్లుగా అరసీకెరెలో బీజేపీని బలోపేతం చేశారు.

వాహనాలకు నిప్పు



తుమకూరు: ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన ఘటన తుమకూరు నగరంలోని శ్రీరామనగరలో చోటు చేసుకుంది. నగరంలోని శ్రీరామనగర మహా నగర పాలికె మాజీ సభ్యుడు టి.హెచ్. వాసుదేవకు చెందిన మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. ఓ బైక్ పూర్తిగా కాలిపోయింది. మరో రెండు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘరానా దొంగలు అరెస్ట్

- రెండు కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న సీహెచ్.ప్రతాప్‌రెడ్డి, శరణప్ప తదితరులు

బనశంకరి: కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళ సహా ముగ్గురు ఘరానా దొంగలను గురువారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి కోటి రూపాయలు విలువ చేసే రెండు కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో సీహెచ్.ప్రతాప్‌రెడ్డి చోరీ వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన జయంతి, బెంగళూరు అమ్జద్‌సింగ్, గుజరాత్‌కు చెందిన ముజుభాయ్ దొంగలు. తమిళనాడు, గుజరాత్ నుంచి బెంగళూరు చేరుకుని తాళం వేసిన ఇళ్లను గుర్తించి వీరు చోరీలకు పాల్పడేవారు.

పగలు గుర్తింపు.. రాత్రికి కన్నం :

ముగ్గురి అరెస్ట్‌తో 15 కేసులు వెలుగుచూశాయి. జయంతి 2016 నుంచి హెబ్బాల, ఆర్‌టీ.నగర, బాణసవాడి, తమిళనాడులో చోరీలకు పాల్పడి జైలు జీవితం గడిపి తిరిగి ఇదే వృత్తిని కొనసాగిస్తోంది. చోరీ కేసులో అరెస్టయిన అమ్జద్‌సింగ్ 2012లో బాగలూరులో జరిగిన జంటహత్యలు కేసులో జైలుపాలయ్యాడు. తిరిగి వివిధ కేసుల్లో 2018లో మాగడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. తిరిగి బయటకు వచ్చి చోరీలు చేయడం మొదలుపెట్టారు. పగటి సమయంలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడేవారు. ఇతడి వద్ద నుంచి 650 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌కు చెందిన ముజుభాయ్ తన ఇద్దరు సోదరులతో కలిసి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తన అనుచరులతో కలిసి చోరీలకు పాల్పడి యశ్వంతపురలో మకాం పెట్టేవారు. చోరీలకు పాల్పడిన నగదు, బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను మట్టిలో పాతిపెట్టి యశవంతపుర రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడే ఉండేవారు. కొన్నేళ్లుగా ముగ్గురు నగరంలో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగుచూడగా వీరి వద్దనుంచి కిలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

డబ్బున్నోళ్లకే బీజేపీ టిక్కెట్ ఇస్తారా?

- దొడ్డ బీజేపీలో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు
- వక్కలిగులకు అన్యాయం అంటూ ఆవేదన



మాట్లాడుతున్న అసంతృప్తి నేతలు

దొడ్డబళ్లాపురం: బీజేపీ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టికెట్ ఆశించి భంగపడ్డ అనేకమంది నాయకులు రెబల్స్‌గా మారుతున్నారు. అదేవిధంగా దొడ్డ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ పలువురు నాయకులు తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పట్టణంలోని పీఎల్‌డీ బ్యాంకు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసిన వారు డబ్బున్న వాళ్లకే టికెట్ ఇస్తారా? పార్టీ కోసం పనిచేసిన వారికి ఇవ్వరా? అంటూ పార్టీ పెద్దలను ప్రశ్నించారు. ముఖ్యంగా తాలూకాలో వక్కలిగులు అధిక సంఖ్యలో ఉండగా తమ సామాజిక వర్గం వారికి టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. అందులోనూ స్థానికేతరుడైన ధీరజ్ మునిరాజుకు టికెట్ కేటాయించడం సమంజసం కాదన్నారు. జిల్లాలో ఒక్క తాలూకాలో కూడా వక్కలిగులకు టికెట్ ఇవ్వకపోవడం వెనుక కుట్ర దాగుందన్నారు. కనీసం స్థానిక వ్యక్తికి టికెట్ ఇచ్చిఉంటే తాము అభ్యర్థి గెలుపునకు కృషి చేసేవారమన్నారు. రెండుమూడు రోజుల్లో తామంతా చర్చించుకుని ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా టీవీ లక్ష్మినారాయణ, బీసీ నారాయణస్వామి, సత్యప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బొలెరో బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పుట్టపర్తి అర్బన్: కిరాణ సరుకులతో బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్తున్న బొలేరో వాహనం బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి బొలేరో వాహనం (ఏపీ02, టీసీ 9648) పుట్టపర్తి మండలం పెడపల్లి ఈడ్గా మలుపు వద్దకు రాగానే యాక్సిల్ విరిగిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ నాగార్జున వాహనం కింద పడిపోవడంతో తలకు, బలమైన గాయాలు తగిలి కోమాలోకి వెళ్లాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం బోల్తా

మడకశిర రూరల్: పావగడ నుంచి మడకశిర వైపు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మండల పరిధిలోని ఆమిదాలగొంది సమీపంలో గురువారం సాయంత్రం ప్రధాన రోడ్డులో స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి అశోక్ అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మడకశిర ఆస్పత్రికి తరలించారు.

చిత్రం... వైవిధ్యం

- కనువిందు చేస్తున్న పెయింటింగ్స్



బనశంకరి: కళాతన ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన కస్విkా పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులను కనువిందు చేస్తోంది. కుమార కృప రోడ్డు చిత్రకళా పరిషత్ గ్యాలరీలో కళాతన ఆర్ట్ ఫౌండేషన్ కస్విkా పేరుతో ఏర్పాటు చేసిన గ్రూప్ ఎగ్జిబిషన్ పెయింటింగ్స్‌లో 12 మంది వర్ధమాన కళాకారులు గీసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ప్రకృతి పర్యావరణం, నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వివిధ రాష్ట్రాల సంస్కృతులు, నదులు, దేవతలు, నృత్యం తదితర వాటిని ఇతివృత్తంగా చేసుకుని కళాకారులు తమ మనసులోని భావాలను కుంచె ద్వారా వ్యక్తం చేశారు. కళాకారులు చంద్రశేఖర్ వేణుగోపాల్, ఇషితా రామ్‌ప్రసాద్, ఎన్.జస్మితా రావ్, మోనికాగుప్తా, ఎంఏ.మంజునాథ్, నిరజాజగన్నాథ్ పూజాకెడియా, కే పీ.రేణుకా, ఆర్.శాంత ప్రేమా, సంధ్యా నాగరాజ్, సారికా, స్పందితా చక్రవర్తి తదితర 12 మంది కళాకారులు వైవిధ్యభరితమైన చిత్రాలకు జీవం పోశారు. ఈ ప్రదర్శన 16 తేదీ వరకు నిర్వహిస్తారు.



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల పెయింటింగ్స్

శూలాలు గుచ్చుకుని క్రేన్లకు ఊరేగింపు



హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మిడగరపల్లి, మత్తిగిరి మధ్య వెలసిన ప్రసిద్ధ కోటమారియమ్మ ఆలయ రథోత్సవంలో భాగంగా గురువారం భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకొని క్రేన్ వాహనాలపై వేలాడుతూ ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చారు. పెద్దఎత్తున భక్తులు క్రేన్ వాహనాలలో వేలాడుతూ విన్యాసాలు ప్రదర్శించడంతో హోసూరు, డెంకణీకోట రోడ్డు కిక్కిరిసిపోయింది. పోలీసులు వాహనాలను ఇతర మార్గంలో మళ్లించారు. భక్తుల విన్యాసాలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు కోటమారియమ్మ ఆలయం వద్దకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా దాతలు, సంఘాలు భక్తులకు చల్లని పానీయాలు, అన్నదానం నిర్వహించారు.

సీఎం వెంట కాంతార రిషబ్

యశవంతపుర: సీఎం బొమ్మై రాష్ట్రంలో దేవస్థానాల సందర్శన చేపట్టారు. గురువారం కొల్లూరు మూకాంబిక దేవస్థానాన్ని సతీసమేతంగా దర్శించారు. ఈ సమయంలో కాంతార నటుడు రిషబ్‌శెట్టి కూడా సీఎం వెంట ఉండడం విశేషం. తరువాత సీఎం విలేకరులతో మాట్లాడుతూ రిషబ్‌శెట్టి అనుకోకుండా కలిశారని చెప్పడం గమనార్హం. ఇటీవల సీఎంను ప్రముఖ నటుడు కిచ్చ సుదీప్ కలవడం తెలిసిందే. సీఎం వెంట మంత్రి కోట శ్రీనివాస పూజారి, ప్రమోద్ మధ్వరాజ్‌లున్నారు. జిల్లాకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు గైరాజరయ్యారు. కాగా, ఉడుపి జిల్లా శిరూరు వద్ద సీఎం హెలికాప్టర్ టేకాఫ్ అవుతుండగా అక్కడికి వంద మీటర్ల దూరంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. హెలికాప్టర్ యథావిధిగా టేకాఫ్ అయ్యింది.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన వ్యక్తి

క్రిష్ణగిరి: హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారి సూళగిరి సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూళగిరి సమీపంలోని అళగుబావి వద్ద జాతీయ రహదారిపై 35 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని స్థానికులు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతుడి వివరాలు సేకరిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు ... హోసూరు పారిశ్రామికవాడ అరసనట్టి ప్రాంతానికి చెందిన చంద్రప్ప భార్య అమరావతి (33). ఐదేళ్ల క్రితం దంపతులు విభేదాల కారణంగా విడిపోయారు. ఈ నేపథ్యంలో అమరావతి కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటోంది. ఫలితం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తితో రెండు రోజుల క్రితం విషపూరిత మందు తాగింది. బంధువులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి మృతి చెందింది. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చకచకా రెవెన్యూ సర్టిఫికెట్ల జారీ

హోసూరు: చిట్టా, పట్టాల, ఆక్రమణల తొలగింపు, తదితర రెవెన్యూ శాఖ ద్వారా అందుకోవలసిన సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఎన్నో సమస్యలు పడుతుంటారు. ఈ సమస్య పరిష్కారానికి గురువారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో రెవిన్యూ శాఖాధికార్లతో కలెక్టర్ దీపక్‌జేకబ్ సమావేశమయ్యారు. ప్రజలకు అవసరమైన చిట్టా, పట్టా, ఇతర సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, ఈ సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్ ద్వారా పొందే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణలకు గురైన స్థలాలను తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, అధికారులు వేడియప్పన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వరుణను తాలూకా చేశారా ?

మైసూరు: సీఎల్‌పీ నేత సిద్దరామయయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వరుణ నియోజకవర్గం ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని మైసూరు ఎంపీ ప్రతాప్ సింహ మండిపడ్డారు. గురువారం మైసూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కనీసం వరుణ నియోజక వర్గాన్ని తాలూకా కేంద్రంగా చేయలేదని, ఆయనకు ఇక్కడి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని అన్నారు. 2018లో ఇవి చివరి ఎన్నికలు అని చెప్పుకున్న సిద్దరామయ్య మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై ఆశతో పోటీ చేస్తున్నారని, చివరకు వరుణకు వచ్చారని, ఇక్కడ కూడా ఆయన ఓటమి తప్పదని అన్నారు.

జేడీఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక



మాట్లాడుతున్న అభ్యర్థి సిఆర్ నరసింహమూర్తి

గౌరిబిదనూరు: జేడీఎస్ పార్టీకి కార్యకర్తలే కీలకమని, వారి శ్రమను పార్టీ అధిష్టానం ఎన్నటికి మరచిపోదని శాసన మండలి సభ్యుడు టీపీ శరవణ్ అన్నారు. గురువారం ఆయన తాలూకాలోని వివిధ గ్రామాలలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. జేడీఎస్ పంచరత్న యోజన ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. మహిళలకు, రైతులకు, విద్యార్థులకు ప్రయోజనకారిగా వుందన్నారు. రైతుల రుణమాఫీ, మహిళా సంఘాల రుణాల మాఫీ. విద్యార్థులకు ఉచిత విద్య ఇవ్వడానికి జేడీఎస్ పార్టీ ప్రణాళిక రూపొందించిందన్నారు. అభ్యర్థి, మాజీ జడ్పీ అధ్యక్షుడు సిఆర్ నరసింహమూర్తి మాట్లాడుతూ... రాష్ట్రానికి రెండు మార్లు ముఖ్యమంత్రి అయిన కుమారస్వామి అధికారంలో వున్నపుడు ప్రజలకు ఉపయోగ పడే అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ నెల 15న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు రోషన్ అబ్బాస్, మంజునాథ రెడ్డి, నటరాజ, భాస్కర్, కల్లూడి గౌడ, బైపాస్ నాగరాజు, మహిళా విభాగం డా గంగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీ ఫారం లేకుండా మంత్రి నామినేషన్



మంత్రి సుధాకర్ నామినేషన్ సమర్పిస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: స్థానిక బీజేపీ అభ్యర్థి, మంత్రి కె.సుధాకర్ గురువారం నామినేషన్ సమర్పించారు. బి–ఫారం లేకుండా నామినేషన్ దాఖలు చేశానని, ఏప్రిల్ 17 న ఉదయం మద్దతుదారులతో కలసి బి ఫారంతో మరోసారి నామినేషన్ వేస్తానని అన్నారు. ప్రజలు ఈసారి కూడా ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వానికి ప్రజలు అవకాశం ఇవ్వరాదన్నారు. కాగా, చిక్క జిల్లాలో పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు నామినేషన్లు అందజేశారు. బాగేపల్లి స్వతంత్ర అభ్యర్థి ఎస్ సంపంగి, కెఆర్‌ఎస్ పార్టీ నుంచి సి.తిప్పణ్ణ, శిడ్లఘట్టలో కెఆర్‌ఎస్ అభ్యర్థి కెంపేగౌడ, గౌరిబిదనూరు నుంచి కెంపరాజు అనే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.

చేతబడి పూజల కలకలం



శివమొగ్గ: జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టు కింది చేతబడి పూజలు చేయడం కలకలం కలిగించింది. శివమొగ్గ తాలూకాలోని ముద్దినకొప్ప గ్రామంలో ఉన్న బోవి కాలనీ దగ్గర హైవే పక్కన ఎవరో వ్యక్తులు చెట్టు కింద పసుపు– కుంకుమ, కోడిగుడ్లు, అన్నం, బొమ్మలు, డబ్బాలు ఉంచి పూజలు చేశారు. చెట్టుకు ఒక గొర్రెను కూడా కట్టి వెళ్లారు. గ్రామస్తులు చూసి భయాందోళనకు గురి కావడంతో పాటు అటు వైపు వెళ్ళడానికి సంకోచిస్తున్నారు.

సతీశ్ రెడ్డి విజయం సాధించాలని...

బొమ్మనహళ్లి: శాసన సభ ఎన్నికల్లో బొమ్మనహళ్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం సతీశ్‌రెడ్డి భారీ విజయం సాధించాలని ఆయన అభిమానులు కోదండరామ స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం నగరంలోని హులిమావులో కోదండరామ స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు అరటి పండ్లపై సతీశ్‌రెడ్డి పేరు రాసి ఆయన భారీ మెజార్టీతో ఎన్నికల్లో గెలవాలని రథంపైకి విసిరారు. సతీశ్‌రెడ్డి నాలుగోసారి బీజేపీ నుంచి బరిలో దిగారు.



హోసూరు వార్తలు..

ద్విచక్ర వాహనాల ఢీ.. కార్మికుడు మృతి

కెలమంగలం: రెండు ద్విచక్ర వాహనాలు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కెలమంగలం సమీపంలోని దొడ్డేగానపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సెంబప్ప (45). బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో డెంకణీకోటవైపు వెళ్తుండగా ఆ మార్గంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సెంబప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు...

హోసూరు: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... సూళగిరి సమీపంలోని సెంబరసనపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శ్రీనివాసన్ (21) బుధవారం సాయంత్రం హోసూరు నుంచి సూళగిరి వైపు ద్విచక్ర వాహనంలో వస్తుండగా బత్తలపల్లి వద్ద ఆ మార్గంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో శ్రీనివాసన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పశువులను వెంబడించిన గజరాజు



పశువులను తరుముతున్న ఏనుగు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని అయ్యూరు అటవీ ప్రాంతంలో వయసు మళ్లిన ఏనుగు రోడ్డుపై వెళ్తున్న పశువులను వెంబడించింది. డెంకణీకోట అటవీ ప్రాంతంలోని జవుళగిరి, మరగట్ట, అయ్యూరు, బేవనత్తం తదితర అటవీ ప్రాంతాల్లో సుమారు 50 ఏనుగులకు పైగా మకాం వేసి ఆ ప్రాంతంలో పంటలపై దాడులు చేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అయ్యూరు అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద నుంచి ఓ ముసలి ఏనుగు సాయంత్రం పశువుల వెంటపడింది. విషయం గమనించిన స్థానికులు డెంకణీకోట అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. అటవీ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగును అటవీ ప్రాంతానికి మళ్లించారు.

విద్యార్థుల చైతన్య ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హోసూరు: రాబోవు విద్యా సంవత్సరంలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరిృంచడంపై గురువారం హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి మాధ్యమిక పాఠశాల విద్యార్థులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో 250 మందికిపైగా కొత్త విద్యార్థులను చేర్పించే ఉద్దేశంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాన్‌నాగేష్ అధ్యక్షతన జేఆర్‌సి, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులచే పారిశ్రామిక ప్రాంతంలోని బేడరపల్లి, అన్నానగర్, ఎంజిఆర్ నగర్, భారతీ నగర్ తదితర ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహిస్తూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా నిర్వహిస్తున్నామని, స్థానిక ప్రజలు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేస్తూ పాఠశాల సౌలభ్యాలను వివరిస్తూ స్థానిక ప్రజలకు కరప్రతాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు మంజుల, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అభివృద్ధికి ఓటు వేయండి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విశ్వనాథ్

బనశంకరి: అభివృద్ధి చేసే పార్టీకి ఓటు వేసి గెలిపించాలని యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం చౌడేశ్వరివార్డులో ఆయన కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ డబల్ ఇంజిన్ ప్రభుత్వాలతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. యలహంక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథకంలో నడిపించానని, అభివృద్ధికి ఓటు వేయాలన్నారు. రైతుసేవా సహకార బ్యాంక్ అధ్యక్షురాలు వాణిశ్రీ విశ్వనాథ్, బెంగళూరు ఉత్తర జిల్లా బీజేపీ కమిటీ మెంబరు వై. రామిరెడ్డి, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, ఏఎస్.రాజా, చౌడేశ్వరివార్డు అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి వీవీ.రామమూర్తితో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.





సింగిల్ స్టైల్

ఒకే కలర్.. ఒకే ప్రింట్
టాప్ టు బాటమ్ ఒకే ఫ్యాబ్రిక్
కానీ, ఆకర్షణీయమైన హంగులు ఎన్నో
ఫ్యాషనబుల్‌గా కనిపించే స్టైల్స్ మరెన్నో
ఈ జంప్ సూట్ సొంతం.
వేసవికి సౌకర్యంగా.. వేడుకలో ప్రత్యేకంగా కనిపించే ఈ డ్రెస్ కాన్ఫిడెంట్ లుక్‌తో చూపరులను కట్టి పడేస్తుంది

ధోతీ స్టైల్, అంగరఖా షోల్డర్ స్లైప్, డ్రేప్ స్టైల్, సంప్రదాయ లెహంగా, లాంగ్ ఫ్రాక్ మోడల్, ఈవెనింగ్ డ్రెస్, వెస్టర్న్ లుక్స్.. ఇలా ఒక్క జంప్‌సూట్‌తో ఎన్నో హంగులను క్రియేట్ చేస్తుంది. సీజనల్ వేర్‌గా ఎంపికలో మొదటివరసలో ఉంటుంది. క్యాజువల్ వేర్‌గా తక్కువ ఖర్చులోనే ఈ లుక్స్‌ని సొంతం చేసుకోవచ్చు. స్టైలిష్ వేర్‌గా ఫ్యాబ్రిక్, డిజైన్‌ని బట్టి పార్టీకి జంప్‌సూట్‌ని ఎంచుకోవచ్చు. ఎంబ్రాయిడరీ జిలుగులతో మెరిపించవచ్చు.



కిచెన్ టిప్స్



- వెల్లుల్లి రేకలు పొట్టు సులువుగా వదలాలంటే... వెల్లుల్లి రేకను కటింగ్ బోర్డు మీద పెట్టి చాకు వెనుక వైపు (మందంగా ఉండే వైపు, ఈ స్థితిలో చాకు పదును ఉన్న వైపు పైకి ఉంటుంది) తిప్పి వెల్లుల్లి రేక చివర గట్టిగా నొక్కితే వెల్లుల్లి రేక విడివడుతుంది.



- పైనాపిల్‌ను కట్ చేయడానికి పెద్ద చాకులను (షెఫ్స్ నైఫ్) వాడాలి. ముందుగా కాయ పైభాగాన్ని, కింది భాగాన్ని తొలగించాలి. ఇప్పుడు కాయను నిలువుగా పెట్టి చెక్కును పై నుంచి కిందకు తొలగించాలి. ఆ తర్వాత మీడియం సైజ్ చాకుతో కాయను చక్రాలుగా తరగాలి.



- బటర్‌ను వంట మొదలు పెట్టడానికి ఓ అరగంట లేదా గంట ముందు ఫ్రిజ్‌లో నుంచి తీసి బయట పెట్టుకోవాలి. ఒకవేళ మర్చిపోతే వేడి పాలగిన్నె మూత మీద లేదా ఉడుకుతున్న వంట పాత్ర మూత మీద పెడితే పది నిమిషాల్లో మెత్తబడుతుంది. అలా కుదరకపోతే స్టవ్ మీద బర్నర్ల మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలో ఉంచాలి.



- ఐస్‌క్రీమ్ ఫ్యామిలీ ప్యాక్ తెచ్చుకున్నప్పుడు దానిని పలుచగా కట్ చేయాలంటే చాకును మరుగుతున్న వేడి నీటిలో ముంచి తీయాలి. ఒక స్లయిస్ కట్ చేయగానే చాకు చల్లబడిపోతుంది. కాబట్టి ప్రతి స్లయిస్‌కూ ఓసారి వేడి నీటిలో ముంచాలి.

బ్యూటిప్స్

స్లిమ్మింగ్ జ్యూస్




ఒక నిమ్మకాయను తీసుకుని అడ్డంగా సన్నని స్లైసుల్లాగా కట్ చేసుకోవాలి. తరువాత అంగుళం అల్లం ముక్క తీసుకుని తొక్కతీసి శుభ్రంగా కడిగి సన్నగా తురుముకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు పోసి తురిమి పెట్టుకున్న అల్లం, నిమ్మ చెక్కలను వేసి నీళ్లను మరగబెట్టాలి. నీళ్లు బాగా మరిగి సగం అయ్యాక స్టవ్ ఆపేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత నీటిని ఒక గ్లాసులోకి వడపోయాలి. వడగట్టిన నీటిలో స్పూను తేనె వేసి కలిపితే బరువును తగ్గించే పానీయం రెడీ అయినట్లే. ఈ నీటిని ఉదయం అల్పాహారానికి, రాత్రి భోజనానికి అరగంట ముందు తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం ద్వారా అధిక బరువు తగ్గుతుంది.

హోమ్ మేడ్ మందార తైలం



ఇరవై మందార పువ్వులను తీసుకుని శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. పువ్వులు బాగా ఆరిన తరువాత మిక్సీజార్‌లో వేసుకుని రెండు స్పూన్ల కొబ్బరి నూనె వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద ఒక గిన్నెపెట్టి దానిలో అరలీటరు నువ్వుల నూనె లేదా కొబ్బరినూనె పోయాలి. అందులో గ్రైండ్ చేసి పెట్టుకున్న మందార పువ్వుల పేస్టు, స్పూను మెంతులు వేసి మరగనివ్వాలి. మరిగిన తరువాత దించే ముందు కొద్దిగా పచ్చకర్పూరం వేయాలి. తర్వాత ఆయిల్‌ను చల్లారనిచ్చి వడకట్టి సీసాలో భద్రపరుచుకోవాలి. ఈ మందార తైలాన్ని వారానికి రెండుసార్లు తలకు పట్టించి మర్దనా చేస్తే.. కుదుళ్లకు పోషణ అందుతుంది. ఫలితంగా రాలడం తగ్గి, జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. పచ్చకర్పూరం లేదా ముద్దకర్పూరం వేయడం వల్ల పేలు రాకుండా ఉండటమే కాక మాడుకు చల్లగా హాయిగా అనిపిస్తుంది.

పట్టుదల

తేలి రాజేశ్వరిది మెదక్ జిల్లా దప్పూరు.
వలస కూలీలుగా తల్లిదండ్రులు ముంబైకి వెళితే అక్కడే పుట్టింది.
స్లమ్స్‌లో ఉన్నా మరాఠీ మీడియంలో చదువుకున్నా
ఏనాటికైనా పై చదువులకు విదేశాలకు వెళ్లాలని పట్టుదల.
దానిని సాధించింది.
లండన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న రాజేశ్వరి
తన చదువు కొనసాగించడానికి డిజిటల్ మార్కెటింగ్‌లో పని చేస్తోంది.
ఆమె ప్రయాణం ఆమె మాటల్లో.


రాజేశ్వరి

మురికివాడ నుంచి లండన్ వరకు

'నా పేరు రాజేశ్వరి. మాది మెదక్ జిల్లా దప్పూరు. మా అమ్మానాన్నలు వలస కూలీలు. ముంబై వలస వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా పని చేసేవారు. ఎక్కడ కడుతుంటే దాని బేస్‌మెంట్‌లో పట్టాలు కట్టుకుని కాపురం ఉండేవారు. అంధేరిలో వాళ్లు కూలి పని చేస్తుండగా నేను పుట్టాను. నాకు అప్పటికే అన్న ఉన్నాడు. ఎల్.కె.జి, యు.కె.జి నేను మరాఠి స్కూల్‌లో చదువుకున్నాక ముంబైలో చదువు కష్టమని నన్ను, అన్నను దప్పూరులోని మా నానమ్మ దగ్గరకు పంపారు. అక్కడ మళ్లీ అఆలు నేర్చుకోవడం నాకు కష్టమైంది. ఐదవ క్లాసు పూర్తయ్యేసరికి మా నానమ్మ చనిపోయింది. ఇక ఊళ్లో ఎవరూ లేరు. మళ్లీ అన్నా, నేను ముంబై చేరుకున్నాం'.

■ **పనిపిల్లగా ఉంటూ**

'2006లో ముంబైకి వచ్చాక ఆరోక్లాసు నుంచి చదవడానికి తెలుగుమీడియం స్కూల్ దొరకలేదు. మేముండే ములుండ్ నుంచి గంట దూరం వెళ్లి చదువుకుందామన్నా దొరకలేదు. చివరకు దగ్గరిలోని కన్నడ మీడియం స్కూల్‌లో చేరాల్సి వచ్చింది. నేను ముంబై వచ్చాక బాగా చదువుకోవాలని అనుకున్నాను. దానికి డబ్బు కావాలి. అందుకని నేను స్కూలుకు వెళ్లడంతోపాటు దగ్గరి ఇళ్లల్లో పనిపిల్లగా చేసేదాన్ని. అందుకు నేను కొంచెం కూడా ఇబ్బంది పడలేదు. నాకంటూ ఒక లక్ష్యం ఉంది. టెన్త్ వరకూ అలాగే చదువుకున్నాను. ఇంటర్‌కి వచ్చేసరికి కాలేజీకి అరాకొరా వెళుతూ టెలీకాలర్‌గా పని చేశాను. దానివల్ల అకౌంట్స్ సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాను. ఇక పై చదవలేనేమో అనిపించింది. ఎలాగో ఇంటర్ పూర్తి చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉద్యోగంలో చేరిపోయాను. అంతవరకూ నేను జీవితం గడిపింది స్లమ్స్‌లోనే'



■ **మళ్లీ చదువుకు**

'ఇంటర్ అయ్యాక నేను ముంబైలోని ఎక్సెంచర్ సంస్థలో ఒక ఏజెన్సీ ద్వారా ఉద్యోగంలో చేరాను. ఇంటర్ పాస్ మీద వారిచ్చిన ఉద్యోగం నాకు తృప్తిగా ఉండేది. కాని 2018 వచ్చేసరికి నా ఉద్యోగంలో ఎటువంటి ఎదుగుదల లేదు. డిగ్రీ లేని నీకు ఈ మాత్రం జీతం ఇవ్వడమే గొప్ప అన్నారు సంస్థ వారు. మళ్లీ చదువు గుర్తుకొచ్చింది. ఏమిటి ఇలా తయారయ్యాను అనుకున్నాను. పై చదువులు చదవాలన్న పట్టుదల గుర్తుకొచ్చింది. ఎలాగైనా నా కలను సాధించుకోవాలనుకున్నాను. కాని ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలని అలాంటి ఆప్షన్ కోసం ఎన్ని కాలేజీలు తిరిగినా వీలు కాదన్నారు. కరెస్పాండెన్స్ కోర్సు చేయమన్నారు. చివరకు కల్యాణ్ (ముంబైలోని ఒక ఏరియా) లో సంకల్ప్ కాలేజీ వాళ్లు నా తపన చూసి నీకు వీలున్నప్పుడు వచ్చి అటెండ్ అవుతూ ఉండు అని సీట్ ఇచ్చారు. అక్కడ నేను బికాం చేరాను. నా ఉద్యోగం వారంలో ఐదు రోజులు. ఏ రెండు రోజులైనా ఆఫ్ తీసుకోవచ్చు. అలా నేను అందరిలా శని, ఆదివారం కాకుండా వీక్ డేస్ ఆఫ్ తీసుకుంటూ 2021 జూన్‌లో బి.కాం పూర్తి చేశాను. ఉద్యోగం చేస్తూ జాగ్రత్తగా పొదుపు చేస్తూ వచ్చాను'

■ **యు.కె. కల**

'ఒకవైపు చదువు, ఉద్యోగంతో పాటు విదేశాలలో చదవడానికి కావలసిన డాక్యుమెంట్స్ ఏమిటో తెలుసుకుంటూ వచ్చాను. పాస్‌పోర్ట్ కోసం నా పర్మినెంట్ అడ్రస్ దప్పూర్ కావడం వల్ల హైదరాబాద్ నుంచే తీసుకోవాల్సి వచ్చింది. దాని కోసం ఆధార్ కరెక్షన్, సర్టిఫికెట్లు చాలా పని. మరో వైపు 2022 సెప్టెంబర్ ఇన్‌టేక్ (యూకేలో సెప్టెంబర్‌లో మొదలయ్యే అకడెమిక్ ఇయర్ కోసం) కోసం ఆన్‌లైన్‌లో ఆయా యూనివర్సిటీల్లో అప్లికేషన్స్ వేస్తూ వెళ్లాను. కాని యు.కెలో చదవడం చాలా ఖర్చుతో పని. అందుకోసం నేను బ్యాంకులోను, వడ్డీ మీద బయటి వ్యక్తుల దగ్గర లోన్ తీసుకున్నాను. యూకేలో మాస్టర్స్ చేయడానికి నాకు సీట్ వచ్చింది. సెప్టెంబర్ 2022లో లండన్ చేరుకున్నాను. చదువుకుంటూ పార్ట్‌టైమ్ జాబ్ చేయడానికి పరిమిత గంటల అనుమతి ఉంటుంది. కాని అక్కడ వెంటనే పని దొరకదు. సులభంగా దొరికే ఉద్యోగం కేర్‌హోమ్‌లలో పని చేయడమే. మతి స్థిమితం లేనివారు, వృద్ధులు... వీరి బాగోగులు చూసుకుంటే డబ్బులు ఇస్తారు. అలా ఆరు నెలలు పని చేశాను. నాకు డిజిటల్ మార్కెటింగ్‌తో బాగా పరిచయం ఉంది కాబట్టి అందులోనూ సంపాదన వెతుకుతున్నాను. ముంబైలో స్లమ్స్‌లో ఉండిపోవలసిన దాన్ని. నా కష్టమే నన్ను యూకే దాకా చేర్చింది. ఇక్కడకు వచ్చి 9 నెలలు గడిచిపోయాయి. ఇప్పుడు ఈస్టర్ సెలవలు నడుస్తున్నాయి. ఈ సెలవుల్లో ఎక్కువ గంటలు పని చేయవచ్చు. పని చేస్తున్నా. కష్టేఫలి అన్నారు కదా'.

రంజాన్ స్పెషల్

ఓట్స్ ఆరెంజ్ క్యారట్ ఖీర్



కావలసినవి: **ఓట్స్**– 50 గ్రాములు; **పాలు** – లీటరు; **క్యారట్ తురుము** – 100 గ్రాములు; **తేనె** – కప్పు (ఇష్టమైతేనే); **యాలకుల పొడి**– టీ స్పూన్; **ఆరెంజ్ జెస్ట్** – టేబుల్ స్పూన్ (ఆరెంజ్ తొక్కల తురుము); **బాదం** – 10 (సన్నగా తరగాలి).

తయారీ: • మందపాటి పెనం వేడి చేసి ఓట్స్‌ను సన్న మంట మీద దోరగా వేయించాలి. • పెద్ద పాత్రలో పాలను మరిగించి అందులో క్యారట్ తురుము వేసి కలుపుతూ పది నిమిషాల సేపు ఉడికించాలి. ఇప్పుడు ఓట్స్ వేసి కలపాలి. చివరగా యాలకుల పొడి, ఆరెంజ్ జెస్ట్ వేసి కలుపుతూ మరో రెండు నిమిషాలపాటు ఉడికించి స్టవ్ ఆపేయాలి. చివరగా బాదం వేసి కలిపి సర్వ్ చేయాలి. తేనె వేసుకోదలిచిన వాళ్లు స్టవ్ ఆపేసిన తర్వాత తేనె కలపాలి.


వంటిల్లు



ఆవ రుచిని ఆస్వాదిద్దాం

ఎండాకాలాన్ని వెంటాడుతూ వస్తుంది ఆవకాయ కాలం. మామిడి కాయలు చెట్టుకొమ్మలకు వేళ్లాడుతూ ఆకుల్లోంచి తొంగి చూస్తూ నోరూరిస్తుంటాయి. మామిడి కాయలతో చేసుకునే ఊరగాయలు పచ్చళ్లను చూద్దాం. నీళ్లూరుతున్న జిహ్వను లాలిద్దాం.

ఆవకాయ



కావలసినవి: **మామిడికాయ ముక్కలు** – 4 కప్పులు; **నూనె**– 2 కప్పులు; **ఆవపిండి**– కప్పు; **మిరప్పొడి**– కప్పు (గుంటూరు కారం రుచికి బాగుంటుంది. కశ్మీరీ కారం వాడితే ఆకర్షణీయంగా కనిపిస్తుంది); **ఉప్పు** – కప్పు (కల్లుప్పును పొడి చేయాలి, టేబుల్ సాల్ట్ వేయాలనుకుంటే ముప్పావు కప్పు సరిపోతుంది); **మెంతిపిండి** – అర కప్పు; **వెల్లుల్లి రేకలు** – అర కప్పు (పొట్టు వలిచినవి); **ఆవాలు** – పావు కప్పు.

తయారీ: • మామిడి కాయలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత పొడి వస్త్రంతో తుడవాలి. సొనపోవడానికి తొడిమలను తొలగించాలి. ఆ తర్వాత టెంకతో సహా ముక్కలు చేయాలి. మీడియం సైజు కాయను 12 ముక్కలు చేయవచ్చు. టెంకలోని గింజను తొలగించి, టెంకకు గింజకు మధ్య ఉండే పొరను కూడా తీసేసి ముక్కలను సిద్ధంగా పెట్టుకోవాలి. • వెడల్పు పాత్ర తీసుకుని తేమలేకుండా శుభ్రంగా తుడిచి కొద్దిసేపు ఎండలో పెట్టాలి. ఆ తర్వాత ఆ పాత్రలో మిరప్పొడి, ఆవపిండి, మెంతి పిండి, ఉప్పు, వెల్లుల్లి రేకలు వేసి కలపాలి. అందులో మామిడికాయ ముక్కలను వేసి ఆవపిండి మిశ్రమం ముక్కలకు సమంగా పట్టే వరకు తడి లేని గరిటెతో కలపాలి. ఆవపిండి కారంలో ఉప్పు చూసుకుని రుచిని బట్టి అవసరమైతే కొద్దిగా కలుపుకోవాలి. • బాణలిలో నూనె మరిగించి అందులో ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత స్టవ్ ఆపేయాలి. నూనె బాగా చల్లారిన తర్వాత ఆవకాయ ముక్కల్లో పోసి గరిటెతో కలపాలి. ఈ మిశ్రమాన్ని జాడీలో నింపాలి. ఆవకాయ మీద నూనె తేలుతూ ఉండాలి.

గమనిక: • నూనెను మరిగించకుండా పచ్చిగా కూడా వేసుకోవచ్చు. • ఆవకాయ, ఇతర ఊరగాయలను నిల్వ చేసే జాడీలను శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తుడిచి పది నిమిషాల సేపు ఎండలో ఉంచాలి. ఎండలో నుంచి తీసిన తర్వాత జాడీ వేడి తగ్గిన తరవాత మాత్రమే ఊరగాయలను నింపాలి.

ముక్కల పచ్చడి



కావలసినవి: **మామిడి కాయ** – 1 పెద్దది; **మిరప్పొడి**– పావు కప్పు; **పసుపు** – టీ స్పూన్; **ఉప్పు** – పావు కప్పు (రుచిని బట్టి తగ్గించుకోవచ్చు); **ఆవ పిండి**– పావు కప్పు; **మెంతి పిండి**– పావు కప్పు; **వెల్లుల్లి రేకలు**– పది. **పోపు కోసం:** **నూనె** – టేబుల్ స్పూన్; **ఆవాలు** – టీ స్పూన్; **మెంతులు** – అర టీ స్పూన్; **ఎండు మిర్చి** – 2; **ఇంగువ**– అర టీ స్పూన్.

తయారీ: • మామిడి కాయలను శుభ్రంగా కడిగి, తుడిచి తొడిమ తొలగించాలి. కాయను చెక్కు తీయకుండా చిన్న ముక్కలు చేయాలి. దాదాపుగా కప్పు ముక్కలు వస్తాయి. ఇందులో పసుపు, ఉప్పు, మిరప్పొడి, ఆవపిండి, మెంతి పిండి, వెల్లుల్లి రేకలు వేసి బాగా కలిపి, పదిహేను నిమిషాల పాటు పక్కన ఉంచాలి. మసాలా పొడుల రుచి ముక్కలకు పట్టాలి, ముక్కల నుంచి నీరు వదిలేటంత సమయం ఉండకూడదు. • బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, మెంతులు వేసి అవి వేగిన తర్వాత ఇంగువ, ఎండుమిర్చి వేసి దించేయాలి. పోపు చల్లారిన తర్వాత మామిడి ముక్కల మిశ్రమంలో వేసి కలపాలి. ఈ పచ్చడి రుచి దాదాపుగా ఆవకాయ రుచికి సమానం. నెలపాటు తాజాగా ఉంటుంది.

మాగాయ



కావలసినవి: **మామిడి కాయ ముక్కలు** – 4; **పసుపు** – టీ స్పూన్; **ఉప్పు** – కప్పు; **మిరప్పొడి**– కప్పు; **కల్లుప్పు** – కప్పు (పొడి చేయాలి); **ఆవాలు** – పావు కప్పు; **మెంతులు** – పావు కప్పు; **ఇంగువ** – చిన్న గోళీ అంత (పొడి అయితే అర టీ స్పూన్); **పోపు కోసం:** **నువ్వుల నూనె** – అర కప్పు; **ఆవాలు** – టీ స్పూన్; **మెంతులు** – టీ స్పూన్; **ఎండు మిర్చి** – 2.

తయారీ: • మామిడి కాయలను శుభ్రంగా కడిగి, తేమ లేకుండా తుడిచి చెక్కు తీసి సన్నగా పొడవుగా ముక్కలు చేయాలి. ఈ ముక్కల్లో పసుపు, ఉప్పు కలిపి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయానికి ముక్కల్లోని నీరు అడుగుకు చేరుతుంది. ముక్కలను తీసి ఒక ప్లేట్‌లో పలుచగా పరిచి ఎండబెట్టాలి. నీటిని మూత పెట్టి భద్రపరచాలి. మామిడి ముక్కలను రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. ముక్కలు మరీ పెళుసుగా మారి విరిగేటట్లు ఎండకూడదు. పైకి తేమలేకుండా ముక్క లోపల ఒక మోస్తరు తేమ ఉండి వేళ్లతో వంచితే వంగేటట్లు ఉండాలి. • ఆవాలు, మెంతులను కూడా రెండు గంటల పాటు ఎండబెట్టాలి. ఈ రెండింటినీ విడిగా పొడి చేయాలి. పొడి చల్లారిన తర్వాత మామిడి ముక్కల నీటిలో కలపాలి. ఆ తర్వాత మిరప్పొడి కూడా వేసి సమంగా కలిసే వరకు తేమలేని పొడి గరిటెతో కలపాలి. • మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఇంగువ, ఆవాలు, మెంతులను వేయించి చివరగా ఎండు మిర్చి వేసి కలిపి ఆపేయాలి. చల్లారిన పోపును మామిడిరసం- ఆవపిండి మిశ్రమంలో వేసి కలపాలి. ఇందులో ఎండిన మామిడి ముక్కలను వేసి నూనె పైకి తేలే వరకు కలిపితే మాగాయ పచ్చడి రెడీ. మూడు లేదా నాలుగు రోజులకు మామిడి ముక్కలు మసాలా పొడుల రుచిని పీల్చుకుంటాయి. అప్పుడు మరోసారి గరిటెతో కలిపి తేమ లేని జాడీలోకి తీసుకుంటే ఏడాది పాటు నిల్వ ఉంటుంది.

● మ్యూజిక్ వరల్డ్

మెరుపులాంటి పాట



స్కూల్ రోజుల్లో పాట పాడటానికి వెళుతున్నప్పుడు చిన్నారి ఆశకు వెనక నుంచి కొన్ని మాటలు వినిపించాయి...'ఈ అమ్మాయి చక్కగా పాడుతుంది'


ఆ మాట తన మనసులో బలంగా ముద్రించుకుపోయి సంగీత సాధనను సీరియస్‌గా తీసుకునేలా చేసింది.

చెన్నైకి చెందిన ఆశా శ్రీరామ్ సింగర్, రైటర్. 'జాజ్ నుంచి బ్లూస్ వరకు రకరకాల ధోరణుల సమ్మేళనం నా సంగీతం' అంటోంది ఆశ. చిన్న వయసులోనే సంగీతంపై ఆశలో ఆసక్తి మొదలైంది. ఎన్నో ప్రసిద్ధ మ్యూజిక్ బ్యాండ్‌ల నుంచి స్ఫూర్తి పొందిన ఆశ మ్యూజిక్‌లో తనదైన స్టైల్ క్రియేట్ చేసుకుంది.

'పాట పాడుతున్నప్పుడు వేరే ప్రపంచంలోకి వెళుతున్నట్లుగా, నాతో పాటు ప్రేక్షకులను తీసుకువెళుతున్నట్లుగా అనిపిస్తుంది' అంటుంది 25 సంవత్సరాల ఆశ. తన సంగీత ప్రయాణంలో దిల్లీ నుంచి ముంబై వరకు ఎన్నో పట్టణాలకు వెళ్లి పాడిన ఆశకు పాట కొత్త కాదు. అయితే ఎప్పుడు పాడినా, ఎక్కడ పాడినా ఇప్పటికీ కొత్తగానే ఫీలవుతుంది. తన గొంతులోని తాజాదనానికి అదే కారణమేమో!

● ఆర్ట్ అండ్ కల్చర్

రాబోయే కాలంలో..



చేసే సహాయం కూడా 'మనీ'తో ముడిపడే రోజులు రానున్నాయని సరదాగా చెప్పే కార్టూన్ ఇది! ఈ కార్టూన్‌ను బ్రెజిల్ కార్టూనిస్ట్ జోటా ఏ కోస్టా గీశాడు. జోటా రైటర్, ఆర్ట్ ఎడిటర్ కూడా. బ్రెజిల్‌లో ఎక్కువ సంఖ్యలో రివార్డ్‌లు గెలుచుకున్న కార్టూనిస్ట్‌లలో జోటా ఒకరు. 'హ్యూమర్ ఆల్ డే' పేరుతో తీసుకువచ్చిన కార్టూన్ పుస్తకానికి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం 'గార్డుజస్' పత్రికలో పనిచేస్తున్నాడు జోటా.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ స్టిచ్ ఇన్ టైమ్ సేవ్స్ నైన్స్

ఇది వోల్డ్ ఇంగ్లీష్ ఇడియమ్. నష్టం వాటిల్లకుండా ఉండాలంటే వెంటనే, సరియైన టైమ్‌లో నష్ట నివారణ చర్యలు చేపట్టాలి అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.
ఉదా: డీల్ విత్ ది ప్రాబ్లమ్ నౌ. రిమెంబర్ ఏ స్టిచ్ ఇన్ టైమ్ సేవ్స్ నైన్

ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్

ఒక విషయం లేదా ఒక వ్యక్తికి సంబంధించిన ప్రధాన క్వాల్టిటీ, ప్రధాన విషయాన్ని ప్రస్తావించే సందర్భంలో వాడే ఇడియమ్ ఇది. **ఉదా:** హీ వాజ్ ఏ సింగర్. బట్ ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్ ఏ స్కాలర్

● ఇన్నోవేషన్



ఎకో ఫ్రెండ్

నలుగురి మంచి కోసం ఆలోచించేవారు అందరికీ మంచి మిత్రులవుతారు. ఎకోఫ్రెండ్లీ ఫ్రెండ్ ధారియ ఈ కోవకు చెందిన యువకుడు. కొండంత సమస్యకు కొండంత పరిష్కారం దొరకకపోవచ్చు. అయితే గోరంత పరిష్కారం దొరికినా చాలు కదా! 'ప్యాడ్‌కేర్ ల్యాబ్' ద్వారా కొండంత సమస్యకు తనవంతు పరిష్కారం చూపి భేష్ అనిపించుకుంటున్నాడు పుణెకు చెందిన అజింక్య ధారియ....

మన దేశంలో వాడి పడేసిన శానిటరీ న్యాప్‌కిన్స్ ప్రతి సంవత్సరం కోట్లలో ఉంటున్నాయి. అవి డీకంపోజ్ కావడానికి వందల సంవత్సరాలు పడుతుందనేది కఠిన వాస్తవం.

కొన్ని సంవత్సరాల క్రితం పుణె(మహారాష్ట్ర)కు సమీపంలోని ఒక డంప్‌యార్డ్ దగ్గరికి వెళ్లాడు అజింక్య ధారియ. అక్కడ చూసిన ఒక దృశ్యం ధారియను షాక్‌కు గురి చేసింది.

చెత్త ఏరుకునేవాళ్లలో కొందరు న్యాప్‌కిన్స్, డైపర్స్‌ను భుజాన ఉన్న సంచిలో వేసుకుంటున్నారు!

ఈ దృశ్యం తన మనసులో సుడులు తిరుగుతూనే ఉంది.

'ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నాడు ధారియ.

సామాజిక సేవారంగంలో పనిచేసే తల్లితో మాట్లాడి శానిటరీ న్యాప్‌కిన్‌లకు సంబంధించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు.

'ట్యాక్సిక్ లింక్స్' అనే పర్యావరణ స్వచ్ఛంద సంస్థ ద్వారా గణాంకాలను సేకరించాడు. చరిత్ర మూలాల్లోకి వెళ్లి 1888 నాటి డిస్పోజబుల్ ప్యాడ్ గురించి తెలుసుకున్నాడు.

రకరకాల పరిశోధనలు, ప్రయత్నాల తరువాత ఎట్టకేలకు 'ప్యాడ్‌కేర్ ల్యాబ్' అనే కంపెనీకి శ్రీకారం చుట్టి తన కలను సాకారం చేసుకున్నాడు ధారియ.

> దేశీయంగా, అంతర్జాతీయంగా సంస్థను విస్తరించడానికి అవసరమైన నిర్మాణాత్మకమైన ప్రణాళికకు రూపకల్పన చేశాడు ధారియ. కంపెనీ విస్తరించాలంటే ఆఫీసులో కూర్చుంటే కుదరదు అనే విషయం అతడికి తెలియనిదేమీ కాదు. అందుకే రెసిడెన్షియల్ కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తున్నాడు.

క్లయింట్స్‌కు 'ప్యాడ్‌కేర్ బిన్'లను ఉచితంగా ఇస్తుంది కంపెనీ. వాడేసిన శానిటరీ న్యాప్‌కిన్‌లను ఈ ప్యాడ్‌కేర్ బిన్‌లో వేస్తే 30 రోజుల వరకు వాసన రావడం, బ్యాక్టీరియా వ్యాపించడంలాంటివి ఉండవు. వాడేసిన న్యాప్‌కిన్‌లు ప్యాడ్‌కేర్ బిన్‌లలో నుంచి మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎంఆర్‌ఎఫ్) కేంద్రాలకు చేరుతాయి.

ప్యాడ్‌కేర్ పేటెంట్ టెక్నాలజీ ఈ వ్యర్థాలను ఇరవై నిమిషాల వ్యవధిలో, తక్కువ ఖర్చుతో పల్ప్, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తుంది.

ఈ పల్ప్‌ను ప్యాకేజింగ్‌తో పాటు ఎన్నో రకాలుగా పరిశ్రమలు వినియోగించుకుంటున్నాయి. ఇక ప్లాస్టిక్‌తో ప్యాడ్‌కేర్ బిన్‌లు తయారుచేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియకు 'మెన్‌స్ట్రుయెల్ హైజీన్ మేనేజ్‌మెంట్' అని పేరు పెట్టారు.

డైపర్‌లు, టెట్రా ప్యాక్‌లు, వస్త్ర వ్యర్థాలు...మొదలైన వాటికోసం ప్రస్తుతం ప్యాడ్‌కేర్ టెక్నాలజీతో రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు.

'ప్యాడ్‌కేర్ ల్యాబ్'కు ఇన్ఫోసిస్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్....మొదలైన సంస్థలు ఫండింగ్ చేశాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా సంస్థను విస్తరించడానికి అవసరమైన నిర్మాణాత్మకమైన ప్రణాళికకు రూపకల్పన చేశాడు ధారియ.

కంపెనీ విస్తరించాలంటే ఆఫీసులో కూర్చుంటే కుదరదు అనే విషయం అతడికి తెలియనిదేమీ కాదు. అందుకే రెసిడెన్షియల్ కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తున్నాడు. వారి సహాయం, సలహాలు తీసుకుంటున్నాడు.

నాందేడ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన ధారియకు చదువుకునే రోజుల నుంచే సామాజిక స్పృహ ఉంది.

'ఈ సమస్య ఇంతేలే అని ఆరోజు నేను నిట్టూర్చి ఉంటే కొత్త ఆవిష్కరణ జరిగేది కాదు' అంటున్న ధారియ మరిన్ని ఆవిష్కరణలతో విజయవంతం కావాలని ఆశిద్దాం.

● టెక్.. టాక్

నోకియా టీ21 ట్యాబ్



డిస్‌ప్లే: 10.36 అంగుళాలు బ్యాటరీ: 8200 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ ● 4జీబి ర్యామ్ 8ఎంపీ ఫ్రంట్ కెమెరా స్క్రీన్ రిజల్యూషన్: 1200×2000 పిక్సెల్స్
బరువు: 471 గ్రా. ఇంటర్నల్ మెమోరీ: 64 జీబి ధర: ₹16,499

లావా బ్లేజ్ 2



సైజ్: 6.5 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ స్టోరేజ్: 6జీబి ర్యామ్ 128 జీబి
● 13–మెగా పిక్సెల్ డ్యూయల్ కెమెరా ● 18 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ● మల్టీపుల్ ఫొటోగ్రఫీ మోడ్స్ ● స్పెషల్ లాంచ్ ప్రైస్: ● ₹8,999

రియల్ టైమ్ లిరిక్స్



పాటల ప్రేమికులు యూట్యూబ్ మ్యూజిక్‌లోకి వెళితే బోలెడు పాటలు వినవచ్చు. అయితే ఇప్పుడు వినడం మాత్రమే కాదు పాడవచ్చు కూడా. యూట్యూబ్ మ్యూజిక్ 'రియల్ టైమ్–లిరిక్స్' ఫీచర్‌ను తీసుకువచ్చింది. రకరకాల థర్డ్–పార్టీ యాప్‌లలో అందుబాటులో ఉన్న ఈ ఫీచర్ ఇప్పుడు యూట్యూబ్ మ్యూజిక్‌లోకి వచ్చింది. ఈ రియల్ టైమ్ లిరిక్స్ ఫీచర్‌తో తమకు ఇష్టమైన పాట పాడవచ్చు. స్క్రీన్‌పై లిరిక్స్ డిస్‌ప్లే చేయవచ్చు. ప్రతి లైన్‌ను హైలైట్ చేయవచ్చు.

యూట్యూబ్ తన మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీస్ యూట్యూబ్ మ్యూజిక్(ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్)లో 'స్లీప్ టైమర్' అనే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. కొందరికి సంగీతం వింటూ పాడుకోవడం అలవాటు. అయితే నిద్రలోకి జారిపోయిన తరువాత కూడా పాటలు ప్లే అవుతూనే ఉంటాయి. 'స్లీప్ టైమర్' ఫీచర్‌తో నిర్దిష్టమైన టైమ్ తరువాత మ్యూజిక్ ప్లేయర్ ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. కొందరు యూజర్‌లకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ ఫీచర్ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది.

గూగుల్‌లో ఆటో–ఆర్కైవ్ ఫీచర్



ఆండ్రాయిడ్ యూజర్‌ల కోసం గూగుల్ 'ఆటో–ఆర్కైవ్' అనే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. యాప్‌ను మాన్యువల్‌గా అన్‌ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేకుండానే ఈ ఫీచర్‌తో యాప్ స్టోరేజ్ స్పేస్‌లో 60 శాతం వరకు ఖాళీ చేయవచ్చు. కొందరు రకరకాల యాప్స్ ఇన్‌స్టాల్ చేస్తుంటారు. అయితే వాటిలో ఎక్కువ కాలం పాటు ఉపయోగించేవి తక్కువే. స్టోరేజ్ స్పేస్ ఎక్కువలేని వాటికి 'ఆటో–ఆర్కైవ్' ఉపయోగపడుతుంది.

● గేమింగ్

ఎట్లయితే గట్లాయే...షూటౌట్!



కౌంటర్ స్ట్రైక్ ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న గేమ్...కౌంటర్ స్ట్రైక్–2

2000 సంవత్సరంలో కౌంటర్ స్ట్రైక్ ఫస్ట్ వెర్షన్ విడుదల అయింది.

ఈసారి ప్రత్యేకత రిఫ్లెక్స్ రెడ్యూసింగ్ టెక్నాలజీ. ఇది ప్లేయర్స్‌కు సరికొత్త ప్లేయింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. రిఫ్లెక్స్ రెడ్యూసింగ్ టెక్నాలజీ గేమ్స్‌లో లేటెన్సీని తగ్గిస్తుంది.ఈ మల్టీప్లేయర్ ట్యాక్టికల్ ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియోగేమ్ థీమ్...హత్యలు చేసి అరాచకాలు సృష్టించే టెర్రరిస్ట్‌లకు, కౌంటర్ టెర్రరిస్ట్‌లకు మధ్య జరిగే వార్. టెర్రరిస్ట్‌లు పెట్టిన బాంబు ఎక్కడ ఉంది? దాన్ని ఎలా నిర్వీర్యం చేయాలి... లాంటి టాస్క్‌లు ఈ గేమ్‌లో ఉంటాయి.

సిరీస్: కౌంటర్ స్ట్రైక్ **జానర్:** ట్యాక్టికల్ షూటర్ **ఇంజిన్:** సోర్స్2 **ప్లాట్‌ఫామ్:** మైక్రోసాఫ్ట్ విండోస్

సినిమా

కథ విన్నారా?


● చిరంజీవి

హీరో చిరంజీవి, 'బింబిసార' ఫేమ్ దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? చిరంజీవి కథ విన్నారా? అంటే ఫిల్మ్‌నగర్ అవుననంటోంది. చిరంజీవికి వశిష్ఠ ఇటీవల ఓ కథ చెప్పారట. ఆ స్టోరీ చిరంజీవిని ఇంప్రెస్ చేయడంతో ప్రస్తుతం స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నారట వశిష్ఠ. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందనుందని సమాచారం. ఇక ప్రస్తుతం 'భోళా శంకర్' చిత్రంతో బిజీగా ఉన్నారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

రామకృష్ణ గోవింద...


● అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించగా, మమ్ముట్టి కీలక పాత్ర చేశారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ రెడ్డి 2 పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. హిప్ హాప్ తమిళ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రామకృష్ణ గోవింద.. గోవింద హరి గోవింద...' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. 'రామ పోయి కృష్ణ వచ్చె, బాధే పోయి హ్యాపీ వచ్చిందా, నైటే పోయి లైటే వచ్చె, ప్రేమే పోతూ పోతూ ఏదో ఏదో నేర్పించిందా.. గోవిందా గోవిందా గర్ల్‌ఫ్రెండ్ గోవిందా.. అయ్యిందా అయ్యిందా బ్రేకప్ అయ్యిందా, పోయిందా పోయిందా ప్రేమే దూరం పోయిందా, వచ్చిందా వచ్చిందా ఫ్రీడమ్ వచ్చిందా..' అంటూ ఈ పాట సాగుతుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని రామ్ మిర్యాల పాడగా, శేఖర్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు.


● వెంకటేశ్

వైజాగ్‌లో సైంధవ్

వైజాగ్‌కు మకాం మార్చింది 'సైంధవ్' టీమ్. 'హిట్' ఫ్రాంచైజీ చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసింది చిత్ర యూనిట్. తాజా షూటింగ్ షెడ్యూల్ గురువారం వైజాగ్‌లో మొదలైంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా డిసెంబరు 22న విడుదల కానుంది.

ఆహ్లాదకరంగా.. ఉల్లాసంగా...


● కొరటాల శివ, ఎన్టీఆర్, జేమ్స్, రాజమౌళి

కొన్ని రోజులుగా 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ సెలబ్రేషన్ మూడ్‌లో ఉంది. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు సాధించిన నేపథ్యంలో టాలీవుడ్‌లో వేడుకలో జరుగుతున్నాయి. రామ్‌చరణ్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఇటీవల చిరంజీవి స్వయంగా పార్టీ ఇచ్చారు. తెలుగు చిత్రసీమకు ఆస్కార్ తెచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్‌లను, టీమ్‌ని ఈ పార్టీలో చిరంజీవి సన్మానించారు. గత ఆదివారం తెలుగు పరిశ్రమ 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కి ప్రత్యేకంగా వేడుక నిర్వహించింది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో ఓ హీరో అయిన ఎన్టీఆర్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని స్వగృహంలో గ్రాండ్ పార్టీ ఇచ్చారు. ఈ పార్టీలో దర్శకులు రాజమౌళి, త్రివిక్రమ్, కొరటాల శివ, నిర్మాతలు నవీన్ ఎర్నేని, నాగవంశీ, స్వప్నాదత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అమెజాన్ స్టూడియోస్ వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ ఫరెల్ కూడా పాల్గొన్నారు. ''మిత్రులు, శ్రేయోభిలాషులతో ఈ సాయంత్రం ఎంతో ఆహ్లాదకరంగా, ఉల్లాసంగా గడిచింది. జేమ్స్ అండ్ ఎమిలీలు పాల్గొనడం గ్రేట్. ఈ డిన్నర్ సెలబ్రేషన్స్‌కు హాజరైన అందరికీ ధన్యవాదాలు'' అంటూ సెలబ్రేషన్స్‌లోని కొన్ని ఫోటోలను షేర్ చేశారు ఎన్టీఆర్. ఈ నేపథ్యంలో జేమ్స్ ఫరెల్, ఎన్టీఆర్‌ల మధ్య ఏదైనా ప్రాజెక్ట్ గురించిన చర్చలు జరిగాయా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇక ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తి కాగా, మలి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకుంటున్నారు.


● రాశీ ఖన్నా

హారర్ మోడ్

తమిళ హారర్ ఫ్రాంచైజీలో ఒకటైన 'అరణ్మణై' నాలుగో భాగంలో నటిస్తున్నారు రాశీ ఖన్నా. సుందర్. సి, తమన్నా, విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రధారులుగా 'అరణ్మణై 4' రూపొందుతోంది. సుందర్. సి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. మలి షెడ్యూల్ చిత్రీకరణ కొచ్చిలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లోనే పాల్గొంటున్నారు రాశీఖన్నా. ప్రస్తుతం రాశీ ఖన్నాపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''అరణ్మణై 3'లో నటించిన రాశీ ఖన్నా 'అరణ్మణై 4'లోనూ మంచి పాత్ర చేస్తున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.

యముడి డ్రామా


● సాయికుమార్

యువచంద్ర, శివకుమార్, కౌటిల్య, సుదర్శన్ రెడ్డి హీరోలుగా, ప్రియాంక శర్మ, నేహా దేశ్‌పాండే, హమీద హీరోయిన్లుగా సాయికుమార్ యముడి పాత్రలో నటించిన చిత్రం 'యమ డ్రామ'. టి. హర్షచౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామ కృష్ణారావు నిర్మించారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'నిను చూసినా కనే...' అనే తొలి వీడియో సాంగ్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కేఎల్ దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ఈ పాటకి కరుణాకర్ సాహిత్యం అందించారు. టి. హర్షచౌదరి మాట్లాడుతూ– ''వినోదం, భావోద్వేగాలను రంగరించి ఆద్యంతం ఆకట్టుకునేలా రూపొందించిన ఈ సినిమాలో యువతకు ఓ మంచి సందేశం ఉంది'' అన్నారు. ''మా సినిమాని ఈ నెలలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు శివరామకృష్ణారావు. ఈ చిత్రానికి కెమెరా: దాము నర్రావుల, సమర్పణ: సుకన్య.

అమ్మని ఇష్టపడేవాళ్లు రుద్రుడుని ఇష్టపడతారు

– రాఘవా లారెన్స్

''అటు సినిమాలు, ఇటు సేవా కార్యక్రమాలను బ్యాలెన్స్ చేయడం మొదట్లో కష్టంగా ఉండేది. తర్వాత అలవాటైంది. ఇప్పటివరకూ దాదాపు 150 మంది పిల్లలకు ఆపరేషన్లు చేయించాను. సినిమాల్లో హీరోగా ఉండటం కంటే రియల్ లైఫ్‌లో హీరోగా ఉండాలనేది నా కోరిక'' అన్నారు రాఘవా లారెన్స్. కతిరేశన్ దర్శకత్వంలో రాఘవా లారెన్స్, ప్రియా భవానీ శంకర్ జంటగా రూపొందిన చిత్రం 'రుద్రుడు'. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో నేడు విడుదలవుతోంది. నిర్మాత 'ఠాగూర్' మధు 'రుద్రుడు'ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్ చెప్పిన విశేషాలు.



● 'రుద్రుడు' మదర్ సెంటిమెంట్ ఫిల్మ్. నా ప్రతి సినిమాలో ఏదో ఒక మంచి సందేశం ఉన్నట్టే ఇందులోనూ అమ్మానాన్నల గురించి ఓ చక్కని సందేశం ఉంది. ఈ చిత్రంలో ఐటీ ఉద్యోగం చేసే ఒక మధ్య తరగతి కుర్రాడిలా కనిపిస్తాను. అలాంటి మిడిల్ క్లాస్ అబ్బాయిని పరిస్థితులు ఎలా మాస్‌గా మార్చాయి? అనేది ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. అమ్మని ఇష్టపడేవాళ్లంతా 'రుద్రుడు' మూవీని ఇష్టపడతారు. ● నన్ను కొత్తగా చూపించాలనే కతిరేశన్‌గారి తపన నాకు బాగా నచ్చింది. ఈ చిత్రంలోని భావోద్వేగాలు, థ్రిల్, వినోదం, మాస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు వంద శాతం చేరువ అవుతాయి. ● 'ఠాగూర్' మధుగారు నాకు లక్కీ ప్రొడ్యూసర్. నాపై ఆయనకి చాలా నమ్మకం. మరోసారి ఆ నమ్మకాన్ని 'రుద్రుడు' నిలబెట్టుకుంటుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్‌గారు విలన్‌గా చేశారు. నా పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ఆయన పాత్ర కూడా అదే స్థాయిలో ఉంటుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం, సామ్ సీఎస్ నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటాయి. 'అఖండ' సినిమా ఫైట్స్ నాకు నచ్చడంతో ఆ మూవీకి పని చేసిన శివ మాస్టర్‌ని తీసుకున్నాం. 'రుద్రుడు'లో కథకు తగ్గట్టు యాక్షన్‌ని డిజైన్ చేశారాయన. ప్రస్తుతం 'చంద్రముఖి 2, జిగర్తాండ 2' సినిమాల్లో నటిస్తున్నాను. అలాగే డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కథ, స్క్రీన్ ప్లే అందించి, నిర్మిస్తున్న మరో చిత్రంలో నటిస్తున్నాను.

టైటిల్ బాగుంది

– విజయేంద్ర ప్రసాద్


● విజయేంద్ర ప్రసాద్, ఎల్‌ఎల్ బాబు

''నాతో నేను' మూవీ టైటిల్ బాగుంది. ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. కొత్త నిర్మాతలు చేస్తున్న ఈ తొలి ప్రయత్నం విజయం సాధించాలి'' అని రచయిత, దర్శకుడు, ఎంపీ విజయేంద్ర ప్రసాద్ అన్నారు. సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలీ రాజ్‌పుత్, ఐశ్వర్య, రాజీవ్ కనకాల కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాతో నేను'. 'జబర్దస్త్' ఫేమ్ శాంతికుమార్ తుర్లపాటి దర్శకత్వంలో ఎల్‌ఎల్ బాబు సమర్పణలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విజయేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. ''శాంతికుమార్ మంచి కథతో ఈ సినిమా తీస్తున్నారు'' అన్నారు సాయికుమార్. ''ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూపించబోతున్నాం'' అన్నారు ప్రశాంత్ టంగుటూరి.

నువ్వు నాకే...

దర్శకుడు కె. దశరథ్ అందించిన కథతో రూపొందుతోన్న చిత్రం 'లవ్ యూ రామ్'. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా డీవై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డీవై చౌదరి, కె. దశరథ్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. కె. వేద సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తూ మేరా..' (నువ్వు నాకే) అంటూ సాగే మెలోడీ పాటని విడుదల చేశారు. ''క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ఇది. 'తూ మేరా..' పాటని మంచి మెలోడీగా కంపోజ్ చేశారు వేద'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● రోహిత్, అపర్ణ

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	38	60,431
నిఫ్టీ ▲	16	17,828

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,126	▲	197
డోజోన్స్	33,925	▲	279
ఎఫ్‌టీఎస్ఈ 100	7,843	▲	19
డాక్స్	15,729	▲	26
షాంఘై	3,318	▼	9
నికాయ్	28,157	▲	74

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,880	▲	267
బంగారం (22 క్యారట్)	60,636	▲	264
వెండి (కిలో)	75,869	▲	929

ఇన్ఫోసిస్.. ఓకే

- క్యూ4 నికర లాభం రూ. 6,128 కోట్లు
- ఈ ఏడాదికి 4-7 శాతం వృద్ధి అంచనా
- పూర్తి ఏడాది లాభం 24,095 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో అంచనాలకంటే దిగువన ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం వార్షికంగా 8 శాతం ఎగసింది. రూ. 6,128 కోట్లను తాకింది. త్రైమాసికవారీ(క్యూ3)గా చూస్తే ఇది 7 శాతం తక్కువకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 5,686 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 37,441 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఆదాయం 4-7 శాతం స్థాయిలో పుంజుకోగలదని తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. వెరసి ఐటీ సేవలకు నంబర్ టూ ర్యాంకులో ఉన్న కంపెనీ 2019 తదుపరి మళ్లీ నెమ్మదించిన గైడెన్స్‌ను వెలువరించింది. ఈ ఏడాది 20-22 శాతం స్థాయిలో నిర్వహణ లాభ మార్జిన్లు సాధించే వీలున్నట్లు పేర్కొంది.

పూర్తి ఏడాదికి

మార్చితో ముగిసిన గతేడాదికి ఇన్ఫోసిస్ నికర లాభం 9 శాతం బలపడి రూ. 24,095 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 21 శాతం జంప్‌చేసి రూ. 1,46,767 కోట్లకు చేరింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాల విడుదల సందర్భంగా కంపెనీ గతేడాది ఆదాయంలో 16-16.5 శాతం వృద్ధిని అంచనా వేసింది. వెరసి అంతక్రితం ప్రకటించిన 15-16 శాతం గైడెన్స్‌ను మెరుగుపరచింది. క్యూ4లో ఉత్తర అమెరికా నుంచి 61 శాతం ఆదాయం లభించగా.. యూరోపియన్ ప్రాంతం నుంచి 27 శాతం సమకూరింది. కాగా.. క్యూ4లో ఆర్జించిన పటిష్ట ఫ్రీక్యాష్ ఫ్లో నేపథ్యంలో తుది డివిడెండును ప్రకటించినట్లు సీఎఫ్‌వో నీలాంజన్ రాయ్ వెల్లడించారు. పూర్తి ఏడాదికి అంతక్రితం డివిడెండుతో పోలిస్తే 10 శాతం అధికంగా చెల్లించినట్లు పేర్కొన్నారు. మూలధన కేటాయింపుల పాలసీకి అనుగుణంగా మరోసారి షేర్ల బైబ్యాక్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలియజేశారు.



ఫలితాల ప్రకటన సందర్భంగా ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్ (ఎడమ వ్యక్తి), సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్

ఫలితాల్లో హైలైట్స్...

- వాటాదారులకు షేరుకి రూ. 17.50 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీంతో గతేడాదికి మొత్తం రూ. 34 డివిడెండ్ చెల్లించినట్లయ్యింది.
- క్యూ4లో 2.1 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది. క్యూ3లో 3.3 బిలియన్ డాలర్లు, క్యూ2లో 2.7 బిలియన్ డాలర్ల చొప్పున పొందింది.
- గతేడాది మొత్తం 9.8 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు సంపాదించింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు క్యూ3తో పోలిస్తే 24.3% నుంచి 20.9 శాతానికి దిగివచ్చింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 3,43,234కు చేరింది. గత త్రైమాసికంతో పోలిస్తే నికరంగా 3,611 మంది ఉద్యోగులు తగ్గారు.

అక్షతకు రూ. 68 కోట్లు

ఇన్ఫోసిస్ తాజాగా షేరుకి రూ. 17.5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీంతో కంపెనీలో 3.89 కోట్ల షేర్లుగల బ్రిటిష్ ప్రధాని రిషీ సునక్ భార్య అక్షత రూ. 68.17 కోట్లు అందుకోనున్నారు. ఇందుకు జూన్ 2 రికార్డ్ డేట్. కంపెనీ ఇప్పటికే రూ. 16.5 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. దీంతో అక్షత మొత్తం రూ. 132 కోట్లకు పైగా డివిడెండ్ అందుకోనున్నారు. గురువారం షేరు ధర రూ. 1,389(బీఎస్ఈ)తో చూస్తే ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కుమార్తె అక్షతకు గల వాటా విలువ రూ. 5,400 కోట్లు. కాగా.. 2021-22 ఏడాదిలోనూ డివిడెండ్ రూపేణా అక్షత ఇన్ఫోసిస్ నుంచి దాదాపు రూ. 121 కోట్లు అందుకోవడం గమనార్హం!

క్లయింట్ల ఆసక్తి...

'డిజిటల్, క్లౌడ్, ఆటోమేషన్ సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టితో 2022-23లో పటిష్ట పనితీరును చూపాం. పరిస్థితులు మారినప్పటికీ కంపెనీ సామర్థ్యం, చౌక వ్యయాలు, సమీకృత అవకాశాలు వంటివి క్లయింట్లను ఆకట్టుకుంటున్నాయి. ఇది భారీ డీల్స్‌కు దారి చూపుతోంది' అని ఇన్ఫోసిస్ సీఈఓ ఎండీ సలీల్ పరేఖ్ వ్యాఖ్యానించారు.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతంపైగా క్షీణించి రూ. 1,389 వద్ద ముగిసింది.

ఎగుమతులు @ 447 బిలియన్ డాలర్లు



- 2022-23లో 6 శాతం వృద్ధి
- దిగుమతులు 16.5 శాతం పెరిగి 714 బిలియన్ డాలర్లుకు అప్
- వాణిజ్యలోటు 267 బిలియన్ డాలర్లు

రోమ్: భారత్ వస్తు ఎగుమతులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2021-22తో పోల్చితే 6 శాతం పెరిగి 447 బిలియన్ డాలర్లకు చేరినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇదే సమయంలో దేశ దిగుమతులు 16.5 శాతం ఎగసి 714 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించారు. వెరసి ఎగుమతులు-దిగుమతుల మధ్య వాణిజ్యలోటు 267 బిలియన్ డాలర్లకు చేరింది. పెట్రోలియం, ఫార్మా, రసాయనాలు, సముద్ర ఉత్పత్తుల రంగాల నుంచి ఎగుమతుల్లో మంచి వృద్ధి నమోదయినట్లు ఆయన వెల్లడించారు. ఫ్రాన్స్, ఇటలీల్లో ఏప్రిల్ 11 నుంచి 13వ తేదీ వరకూ పర్యటించిన గోయల్ ఈ సందర్భంగా పలు కంపెనీల సీఈఓలతో భేటీ అయ్యారు. ఆయా దేశాలతో వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు మరింత పురోగమించడం లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు తెలిపిన అంశాల్లో ముఖ్యమైనవి...

- వస్తు, సేవలు కలిపి ఎగుమతులు కొత్త రికార్డులో 14 శాతం వృద్ధి నమోదయ్యింది. విలువలో 770 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక్క సేవల ఎగుమతులు చూస్తే, 27.16 శాతం పెరిగి 323 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక విభాగాల దిగుమతులు 892 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ భారత్ ఎకానమీ క్రియాశీలత, పురోగమనానికి సూచికలుగా ఎగుమతి-దిగుమతి గణాంకాలు ఉన్నాయి.
- అన్ని దేశాలతో పటిష్ట వాణిజ్య సంబంధాలు నెరపడానికి భారత్ కృషి సల్పుతోంది.
- ఇన్వెస్టర్ల పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణ ప్రదేశంగా ఉంది. ఎకానమీ పరంగా చూస్తే, భారత్ ఎంతో పటిష్టంగా ఉంది. వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదవుతున్నాయి. ఎగుమతులు బాగున్నాయి. ద్రవ్యోల్బణం దిగివస్తోంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు పటిష్టంగా 600 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. విదేశాల నుంచి భారత్‌కు పంపుతున్న రెమిటెన్సులు 100 బిలియన్ డాలర్లుపైగానే ఉంటున్నాయి. పెట్టుబడుల ప్రవాహం బాగుంది.
- ఎగుమతుల భారీ వృద్ధి లక్ష్యంగా సమర్థవంతమైన విదేశీ వాణిజ్య పాలసీ (ఎఫ్‌టీపీ)ని భారత్ ఇప్పటికే ఆవిష్కరించింది. 2030 నాటికి దేశ ఎగుమతులను ఏకంగా 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చడంతో పాటు రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చేయాలని పాలసీలో నిర్దేశించడం జరిగింది.

జోయాలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు



హైదరాబాద్: ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ సందర్భంగా జ్యుయలరీ కొనుగోళ్లపై ప్రత్యేకమైన క్యాష్‌బ్యాక్ ఆఫర్లను ప్రకటించింది. రూ.50,000 అంతకుపైబడిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాలను కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.2,000 విలువైన గిఫ్ట్ వోచర్‌ను ఇవ్వనుంది. అలాగే రూ.50,000, అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి రూ.1,000 విలువ గల గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి ఆభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు జరిపిన వారికి 5 శాతం రాయితీ కూడా ఇస్తుంది. నేటి నుంచి(14వ తేదీ) ప్రారంభమై ఈ నెల 23వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ అద్భుతమైన ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ ఎండీ జాయ్ ఆలుక్కాస్ కోరారు.

తొమ్మిదో రోజూ లాభాలే

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడేలో ఒడిదుడుకులు
- సెన్సెక్స్ లాభం 38 పాయింట్లు
- 16 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: ఆఖర్లో బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీల ర్యాలీ తొమ్మిదోరోజూ కొనసాగింది. గడిచిన రెండేళ్లలో సూచీలు వరుసగా తొమ్మిది రోజుల పాటు ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న బలహీన సంకేతాల కారణంగా ఇంట్రాడేలో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 29 పాయింట్ల నష్టంతో 60,364 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 405 పాయింట్ల పరిధిలో కదలాడి 60,081 వద్ద కనిష్టాన్ని 60,487 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 38 పాయింట్ల స్వల్ప లాభంతో 60,431 వద్ద ముగిసింది. నిఫ్టీ అయిదు పాయింట్లను కోల్పోయి 17,807 వద్ద 17,635 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 17,730 వద్ద కనిష్టాన్ని 17,842 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 16 పాయింట్లు పెరిగి 17,828 వద్ద స్థిరపడింది. ఐటీ, ఫార్మా, ఇంధన, మీడియా రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ 0.33%, స్మాల్ క్యాప్ సూచీ 0.16 శాతం చొప్పున లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 26 పైసలు బలపడి 81.85 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.222 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.274 కోట్ల షేర్లను అమ్మేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు. శని, ఆది వారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో ఎక్స్ఛేంజీలు తిరిగి సోమవారం యథావిధిగా ప్రారంభమవుతాయి.

అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ''టీసీఎస్ క్యూ4 ఆర్థిక ఫలితాల సందర్భంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా విభాగం(బీఎఫ్ఎస్ఐ) పనితీరు, అవుట్‌లుక్‌పై యాజమాన్యం ఆందోళనకర వ్యాఖ్యలతో దేశీయ ఐటీ రంగ షేర్లన్నీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ..., బ్యాంకింగ్ సంక్షోభం కారణంగా మాంద్యం పరిస్థితులు తలెత్తవచ్చని ఎఫ్ఓఎంసీ మినిట్స్ సూచించడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడాయి. ఈ జాతీయ, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

రిలయన్స్ కేజీ-డీ6 గ్యాస్‌కు డిమాండ్

ఐవోసీ టాప్ బిడ్డర్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన కేజీ-డీ6 బ్లాక్ నుంచి వెలికితీసే గ్యాస్ విక్రయం కోసం నిర్వహించిన వేలానికి మంచి స్పందన కనిపించింది. వివిధ రంగాలకు చెందిన 41 కంపెనీలు వేలంలో పాల్గొనగా 29 సంస్థలు 5 ఏళ్ల కాలానికి గ్యాస్‌ను కొనుగోలు చేశాయి. ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), అదానీ-టోటల్ గ్యాస్, షెల్ తదితర కంపెనీలు వీటిలో ఉన్నాయి. రోజుకు 6 మిలియన్ ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) గ్యాస్‌ను విక్రయించగా ఐవోసీ దాదాపు సగభాగాన్ని (2.9 ఎంసీఎండీ) దక్కించుకుంది. గెయిల్ 0.7 ఎంసీఎండీ, అదానీ-టోటల్ గ్యాస్ 0.4 ఎంసీఎండీ, షెల్ 0.5 ఎంసీఎండీ, జీఎస్‌పీసీ 0.25 ఎంసీఎండీ, ఐజీఎస్ మరో 0.5 ఎంసీఎండీ గ్యాస్‌ను కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నిర్దిష్ట ఫార్ములా ప్రకారం గ్యాస్ ధర



యూనిట్‌కు (ఎంబీటీయూ) 13.35 డాలర్లుగా ఉంటుందని పేర్కొన్నాయి. అయితే, సంక్లిష్ట ప్రాంతాల నుంచి ఉత్పత్తి చేసే గ్యాస్‌కు ప్రభుత్వం నిర్దేశించిన సీలింగ్ రేటును చెల్లించాల్సి ఉంటుందని వివరించాయి. ఏప్రిల్-సెప్టెంబర్ కాలానికి ఇది 12.12 డాలర్లుగా ఉందని తెలిపాయి. ఈ రేటును కేంద్రం 6 నెలలకోసారి సవరిస్తుంది. రిలయన్స్, దాని భాగస్వామి బీపీ ఈ జనవరిలోనే వేలం నిర్వహించాలని భావించినప్పటికీ జనవరి 13న కేంద్రం కొత్త ధరల విధానాన్ని ప్రకటించింది. దీంతో వేలాన్ని వాయిదా వేసుకుని, మార్చి 9 నుంచి నిర్వహించింది.

సాక్షి స్పోర్ట్స్



సామ్సన్‌పై రూ. 12 లక్షల జరిమానా

రాజస్తాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ సంజూ సామ్సన్‌పై రూ. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు ఐపీఎల్ నిర్వాహకులు ఈ చర్య తీసుకున్నారు. బెంగళూరు జట్టు కెప్టెన్ డుప్లెసిస్ తర్వాత జరిమానా ఎదుర్కొన్న రెండో కెప్టెన్ సామ్సన్. మరోవైపు ఇదే మ్యాచ్‌లో అంపైరింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన రాజస్తాన్ రాయల్స్ స్పిన్నర్ అశ్విన్‌పై అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'

సూపర్ కప్ టోర్నీలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తొలి 'డ్రా' నమోదు చేసింది. కేరళలో జరుగుతున్న ఈ టోర్నీలో ఈస్ట్ బెంగాల్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌ను హైదరాబాద్ 3-3తో 'డ్రా'గా ముగించింది. సోమవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఒడిశాతో హైదరాబాద్ ఆడుతుంది.

విజేత షణ్ముఖ



ముంబై: అఖిల భారత 'ఫిడే' రేటింగ్ చెస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ పి.షణ్ముఖ విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్ల పాటు జరిగిన ఈ టోర్నీలో షణ్ముఖతోపాటు విక్రమాదిత్య కులకర్ణి, సౌరవ్ ఖేరెడ్కర్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. షణ్ముఖకు టైటిల్ ఖరారు కాగా... విక్రమాదిత్య రన్నరప్‌గా, సౌరవ్ సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. ఈ టోర్నీలో షణ్ముఖ ఏడు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. విజేతగా నిలిచిన షణ్ముఖకు ట్రోఫీతోపాటు రూ. 75 వేలు ప్రైజ్‌మనీగా లభించింది.

డైమండ్ లీగ్ టోర్నీతో నీరజ్ సీజన్ షురూ



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా ఈ ఏడాది అంతర్జాతీయ సీజన్‌ను డైమండ్ లీగ్ టోర్నీతో మొదలుపెట్టనున్నాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ పసిడి పతకం గెలిచి చాంపియన్‌గా నిలిచాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ సీజన్‌లో మొత్తం 14 వన్డే టోర్నీలు ఉన్నాయి. మే 5న దోహాలో తొలి టోర్నీ జరుగుతుంది.

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీకి ధనుష్ శ్రీకాంత్



న్యూఢిల్లీ: జూన్ తొలి వారంలో జర్మనీలో జరిగే ప్రపంచకప్ జూనియర్ షూటింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ధనుష్ శ్రీకాంత్‌కు ఈ జట్టులో చోటు దక్కింది. 20 ఏళ్ల ధనుష్ 2019లో దోహాలో జరిగిన ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో... 2021లో పెరూ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు.

గుజరాత్ గెలిచె...

- ఒక బంతి మిగిలి ఉండగా నెగ్గిన డిఫెండింగ్ చాంపియన్
- రాణించిన గిల్, మోహిత్ శర్మ
- పంజాబ్ కింగ్స్‌కు రెండో ఓటమి

మొహాలి: డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఐపీఎల్ టోర్నీలో తమ ఖాతాలో మూడో విజయాన్ని జమ చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులు సాధించింది. పంజాబ్ జట్టులో ఏ ఒక్కరూ భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. నిలదొక్కుకుంటున్న దశలో పెవిలియన్ చేరుకున్నారు. క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన మాథ్యూ షార్ట్ (24 బంతుల్లో 36; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జితేశ్ శర్మ (23 బంతుల్లో 25; 5 ఫోర్లు), స్యామ్ కరన్ (22 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), షారుఖ్ ఖాన్ (9 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రాజపక్స (26 బంతుల్లో 20; 1 ఫోర్) ఫర్వాలేదనిపించారు. గుజరాత్ పేస్ బౌలర్, 2020 తర్వాత మళ్లీ ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్ శర్మ 18 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం గుజరాత్ టైటాన్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 154 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 67; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో గుజరాత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (19 బంతుల్లో 30; 5 ఫోర్లు), గిల్ ధాటిగా ఆడటంతో గుజరాత్ పవర్‌ప్లేలో 56 పరుగులు సాధించింది. అనంతరం



సాయి సుదర్శన్, హార్దిక్ పాండ్యా తక్కువ స్కోర్లకే వెనుదిరిగినా... మరోవైపు శుబ్‌మన్ గిల్ గుజరాత్ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఆచితూచి ఆడుతూనే అవకాశం దొరికినపుడల్లా బంతిని బౌండరీ దాటించిన గిల్ 40 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. డేవిడ్ మిల్లర్ (18 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్)తో కలిసి నాలుగో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. చివరి ఓవర్లో గుజరాత్ విజయానికి 7 పరుగులు అవసరమయ్యాయి. స్యామ్ కరన్ వేసిన ఈ ఓవర్లో తొలి బంతికి మిల్లర్ సింగిల్ తీయగా... రెండో బంతికి గిల్ బౌల్డయ్యాడు. తెవాటియా క్రీజులోకి వచ్చి సింగిల్ తీశాడు. నాలుగో బంతికి మిల్లర్ కూడా సింగిల్ తీశాడు. దాంతో గుజరాత్ విజయానికి చివరి 2 బంతుల్లో 4 పరుగులు కావల్సి రావడంతో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే ఐదో బంతికి రాహుల్ తెవాటియా (2 బంతుల్లో 5 నాటౌట్; 1 ఫోర్) స్కూప్ షాట్‌తో బంతిని బౌండరీకి తరలించడంతో గుజరాత్ విజయం ఖరారైంది.



అంతకుముందు పంజాబ్ జట్టుకు తొలి ఓవర్లోనే దెబ్బ పడింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ ఖాతా తెరవకుండానే షమీ బౌలింగ్‌లో రషీద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (8 బంతుల్లో 8; 2 ఫోర్లు) రెండు ఫోర్లు కొట్టినా భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ప్రమాదకరంగా కనిపిస్తున్న షార్ట్‌ను రషీద్ బౌల్డ్ చేయడంతో పంజాబ్ ఇబ్బందుల్లో పడింది. చివర్లో షారుఖ్ ధాటిగా ఆడటంతో పంజాబ్ స్కోరు 150 దాటింది.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) రషీద్ ఖాన్ (బి) షమీ 0; శిఖర్ ధావన్ (సి) జోసెఫ్ (బి) లిటిల్ 8; మాథ్యూ షార్ట్ (బి) రషీద్ ఖాన్ 36; రాజపక్స (సి) గిల్ (బి) జోసెఫ్ 20; జితేశ్ శర్మ (సి) సాహా (బి) మోహిత్ శర్మ 25; స్యామ్ కరన్ (సి) గిల్ (బి) మోహిత్ శర్మ 22; షారుఖ్ ఖాన్ (రనౌట్) 22; హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 8; రిషి ధావన్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1-0, 2-28, 3-55, 4-92, 5-115, 6-136, 7-152, 8-153. **బౌలింగ్:** షమీ 4-0-44-1, జోష్ లిటిల్ 4-0-31-1, అల్జారి జోసెఫ్ 4-0-32-1, రషీద్ ఖాన్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-18-2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) షార్ట్ (బి) రబడ 30; గిల్ (బి) స్యామ్ కరన్ 67; సాయి సుదర్శన్ (సి) ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి) అర్ష్‌దీప్ 19; హార్దిక్ పాండ్యా (సి) స్యామ్ కరన్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 8; డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 17; రాహుల్ తెవాటియా (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1-48, 2-89, 3-106, 4-148. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-33-1, రబడ 4-0-36-1, హర్‌ప్రీత్ 4-0-20-1, స్యామ్ కరన్ 3.5-0-25-1, రాహుల్ చహర్ 3-0-24-0, మాథ్యూ షార్ట్ 1-0-8-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
గుజరాత్	4	3	1	6	0.341
కోల్‌కతా	3	2	1	4	1.375
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	4	2	2	4	-0.226
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
హైదరాబాద్	3	1	2	2	-1.502
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అమన్ 'పసిడి పట్టు'

ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్‌కు స్వర్ణం

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఎట్టకేలకు భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. ఈ టోర్నీ ఐదో రోజు గురువారం పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో అమన్ సెహ్రావత్ భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించాడు. ఫైనల్లో అమన్ 9-4 పాయింట్ల తేడాతో అల్మాజ్ సమన్‌బెకోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందాడు. నేరుగా క్వార్టర్ ఫైనల్ బౌట్ ఆడిన అమన్ 7-1తో రికుటో అరాయ్ (జపాన్)పై, సెమీ ఫైనల్లో 7-4తో వాన్‌హావో జు (చైనా)పై విజయం సాధించాడు. అమన్ ప్రదర్శనతో వరుసగా నాలుగో ఏడాది 57 కేజీల విభాగంలో భారత్ ఖాతాలోనే స్వర్ణ పతకం చేరడం విశేషం. 2020, 2021, 2022లలో రవి కుమార్ దహియా ఈ విభాగంలో విజేతగా నిలిచాడు. గాయం కారణంగా ఈసారి రవి ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. ఢిల్లీలోని విఖ్యాత ఛత్రశాల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసే అమన్ గత ఏడాది అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణ పతకం సాధించాడు. ఈ ఏడాది అమన్‌కిది రెండో పతకం. ఫిబ్రవరిలో జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో అమన్ కాంస్య పతకం గెలిచాడు. గురువారం జరిగిన ఇతర నాలుగు వెయిట్ కేటగిరీల్లో మూడింట భారత రెజ్లర్లకు నిరాశ ఎదురైంది. 79 కేజీల విభాగంలో దీపక్



అమన్

కుక్నా కాంస్య పతకం నెగ్గగా... 97 కేజీల విభాగంలో దీపక్ నెహ్రా కాంస్య పతక బౌట్‌లో ఓడిపోయాడు. దీపక్ కుక్నా 12-1తో షురాత్ బొజొరోవ్ (తజికిస్తాన్)పై గెలుపొందగా... దీపక్ నెహ్రా 9-12తో మక్సూద్ వెసలోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. అనూజ్ (65 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో, ములాయం యాదవ్ (70 కేజీలు) క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఓటమి పాలయ్యారు.

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడికి ఊరట!



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలను నిరూపించడంలో భారత అగ్రశ్రేణి రెజ్లర్లు విఫలమయ్యారని తెలిసింది. ఈ కేసును విచారించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీని నియమించింది. ఈ కమిటీ తమ నివేదికను క్రీడా శాఖకు సమర్పించింది. కొన్నేళ్లుగా బ్రిజ్ భూషణ్ రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడని, ఆయనను ఈ పదవి నుంచి తప్పించాలని ఆరోపిస్తూ జనవరిలో జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు నిరసన చేపట్టారు. అయితే బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక ఆరోపణలు నిజమేనని నిరూపించేందుకు రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజరంగ్ పర్యవేక్షణ కమిటీకి కచ్చితమైన ఆధారాలు సమర్పించలేదని సమాచారం. ఈ కేసుకు సంబంధించి పలువురిని పర్యవేక్షణ కమిటీ విచారించినా ఒక్కరు కూడా బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా చెప్పలేదని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి.

భారత్‌కు తొలి ఓటమి



అంకిత

తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. చైనా జట్టుతో గురువారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 0-3తో పరాజయం చవిచూసింది. తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 3-6, 5-7తో జియాంగ్ జిన్యు చేతిలో ఓడిపోగా... రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 5-7, 1-6తో యువాన్ యు చేతిలో ఓటమి పాలైంది. దాంతో భారత పరాజయం ఖరారైంది. నామమాత్రంగా జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో శ్రీవల్లి రష్మిక-వైదేహి చౌదరీ ద్వయం 0-6, 1-6తో జియాంగ్ జిన్యు-యాంగ్ జావోజువాన్ జోడీ చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ టోర్నీలో జపాన్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా ఉంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943